


Published From Hyderabad, Mahabubnagar and Kadapa

# వార్తాతరంగాలు

జాతీయ దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :26 | సంచిక :152 | సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | ఆదివారం 11 అక్టోబర్ 2026 | పేజీలు :12 | వేల రూ5 /-

## 'సర్'కు మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల లేఖ..



**న్యూఢిల్లీ:** భారత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు బహిరంగ లేఖను విడుదల చేశారు. ఎన్నికల్లో అక్రమాలు, ఓట్ల చోరీ జరిగాయంటూ చేసే ఆరోపణలకు విశ్వసనీయమైన ఆధారాలు ఉండాలని వారు స్పష్టం చేశారు. నిరాధార ఆరోపణలు ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని పేర్కొన్నారు. ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరిగాయంటూ ఇండియా కూటమి నేతలు, కాక్రోచ్ జనతా పార్టీ ఆరోపిస్తున్న వేళ మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు లేఖ రాయడం సంచలనంగా మారింది. ఈ సందర్భంగా తాము ఏ రాజకీయ పార్టీకి చెందినవాళ్లం కాదని మాజీ అధికారులు లేఖలో - మిగతా3లో

# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదు...

**గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల ఆదాయం 21 శాతానికి పైగా పెరిగిందన్న పొంగులేటి**

**ఇదే రేవంత్ రెడ్డి సమర్థ పాలనకు నిదర్శనమని వ్యాఖ్య**

**పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోని భూ అక్రమాలను వెలికితీస్తున్నామని వెల్లడి**

తెలంగాణలో భూముల విషయంలో బీఆర్ఎస్ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు తిరస్కరించారని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ పాలనపై విశ్వాసం ఉంచారని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో భూములు, ఆస్తుల రిజిస్ట్రేషన్లు గణనీయంగా పెరగడమే ఇందుకు నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. ఈ అంశంపై ఆయన 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. 2026-27 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి ఆగస్టు మధ్య కాలంలో వ్యవసాయ, వ్యవసాయేతర ఆస్తుల రిజిస్ట్రేషన్ల ద్వారా ప్రభుత్వ ఆదాయం భారీగా పెరిగిందని వివరించారు. గత ఏడాదితో పోలిస్తే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం 21.86 శాతం వృద్ధి చెందిందని తెలిపారు. ఈ గణాంకాలే ప్రభుత్వ పనితీరుకు, సీఎం రేవంత్ రెడ్డి పాలనా సామర్థ్యానికి నిదర్శనమని స్పష్టం చేశారు. రాజకీయ లబ్ధి కోసం భూములపై బీఆర్ఎస్ చేసిన అసత్య ప్రచారాలను, ఆరోపణలను ప్రజలు నమ్మలేదని పొంగులేటి అన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో జరిగిన భూ అక్రమాలను తమ ప్రభుత్వం



వెలికితీస్తోందని తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారాలు చూపుతూ, ప్రజలకు వివాదరహిత భూములను అందించేందుకు కృషి చేస్తున్నామని ఆయన వివరించారు.



## బతుకునిచ్చే బతుకమ్మ..

**గునుగుపూల విక్రయంతో ఉపాధి**

**పెద్దేముల్(రంగారెడ్డి):** బతుకమ్మ వచ్చిందంటే చాలు గునుగు, తంగేడు, బంతి, చేమంతి వంటి పూలకు భలే డిమాండ్ ఉంటుంది. నేడు మహాలయ అమావాస్య బతుకమ్మ పండుగను పురస్కరించుకొని పల్లెల్లో పూల సందడి నెలకొంది. తొమ్మిది రోజుల వేడుకకు బతుకమ్మను పేర్చేందుకు అవసరమైన గడ్డిపూలైన గునుగు కొందరికి ఉపాధినిస్తోంది. పొలాల్లో పూసిన పూలను కోసి మార్కెట్‌కు తరలించి ఉపాధి పొందుతున్నారు.

**పొలాల్లో విరివిగా లభ్యం**

పొలాల్లో ఎక్కడ పడితే అక్కడ నాటకుండానే గునుగు పూలు పెరుగుతాయి. పంటకు నష్టం కలిగిస్తాయని రైతులు మొక్కలు చిన్నగా ఉన్నప్పుడే వాటిని కలుపుతోపాటు - మిగతా3లో

# రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

**హైదరాబాద్:** రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. హైదరాబాద్ నగరంలో విపరీతగా రద్దీ ఉన్న ప్రాంతాల్లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఏర్పాటుకు అవసరమైన అంశాలపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ముఖ్యమంత్రి అధికారులకు పలు సూచనలు చేశారు. ఎక్కువ మంది ప్రజలు రాకపోకలు సాగించే ప్రాంతాలతో పాటు వివిధ కర్మాగారాల్లో పని చేసే కార్మికులు, ఉద్యోగులు ప్రయాణించే ప్రాంతాలను మెట్రో, ఎంఎంటీఎస్, బస్ స్టేషన్లతో అనుసంధానించేలా పీఆర్టీ ఉండేలా డిజైన్ చేయాలని సూచించారు. ప్రపంచంలోని అత్యుత్తమ పీఆర్టీలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. సాధ్యమైనంత త్వరగా పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందులో ముఖ్యమైన కాలనీల ఎంపిక, అత్యాధునిక సాంకేతికత, నిర్వహణకు పెద్దపీట వేయాలన్నారు. క్యూర్ పరిధిలో వివిధ ప్రాంతాల మధ్య అనుసంధానత పెరిగేలా, రహదారుల్లో సజావుగా రాకపోకలు సాగించేలా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌ల నిర్మాణం వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే విధానంతో రాకపోకలు మరింత



సజావుగా సాగేలా తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి అధికారులకు ఆదేశించారు. కేబీఆర్ పార్క్ చుట్టూ - మిగతా3లో

# దేశ రాజధానిలో 1000 మందికి పైగా ఆందోళనకారుల అరెస్ట్

**ఢిల్లీలో సీజేపీ నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై రాళ్ల దాడి**

**సీజేపీ వ్యవస్థాపకుడు, యూట్యూబర్ ధ్రువ్ రాఠీ సహా పలువురి అదుపు**

**సీఈసీకి వ్యతిరేకంగా సీజేపీ తలపెట్టిన ఆందోళన**

**నిరసనకు అనుమతి లేదన్న పోలీసులు.. భారీగా బలగాల మోహరింపు**

చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తలపెట్టిన నిరసన కార్యక్రమం ఢిల్లీలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. నిరసనలో పాల్గొనేందుకు వస్తున్న ఆందోళనకారులను పోలీసులు ఎక్కడికక్కడ అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అరెస్ట్ చేసిన నిరసనకారులను తరలిస్తున్న బస్సుపై జన్‌దేవాలన్ ప్రాంతంలో కొందరు రాళ్ల దాడికి పాల్పడటం కలకలం రేపింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, అదుపులోకి తీసుకున్న కొందరు కార్యకర్తలను పోలీసులు బస్సులో తరలిస్తుండగా ఈ ఘటన - మిగతా3లో



# ఢిల్లీలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాయొద్దు..

**నిరసనలను అణచివేయడం మానుకోవాలి:మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్:** ఎన్నికల అక్రమాలపై ప్రశ్నిస్తే అరెస్టులా..? ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాల్సిందే. నిరసన తెలిపే హక్కును అడ్డుకునే అధికారం ఎవరిచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఢిల్లీలో ప్రజాస్వామ్య హక్కులను కాలరాయొద్దు. నిరసనలను అణచివేయడం మానుకోవాలి. జంతర్ మంతర్కు వెళ్లకుండా నిరసనకారులను ఎందుకు అడ్డుకుంటున్నారు ? ఓటర్ల జాబితా సవరణ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిస్తున్నారన్న ఆరోపణలపై సమాధానం చెప్పాలి. దొంగ ఓట్ల నమోదుపై వస్తున్న ఆరోపణలపై ఎన్నికల సంఘం విచారణ జరపాలి. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వంటి నాయకులపై పోలీసుల దాడుల ఆరోపణలు ఆందోళనకరం. ఢిల్లీలో ఇంటర్నెట్, రైళ్లు, బస్సులు, మెట్రో సేవల నిలిపివేతపై స్పష్టత ఇవ్వాలి. 50 వేల కేంద్ర పోలీసు బలగాల మోహరింపు, విద్యార్థుల అరెస్టులపై సమాధానం చెప్పాలి. నిరసనకారులను అడ్డుకునేందుకు బీజేపీ, సంఘ్ పరివార్ కార్యకర్తలను సమీకరిస్తున్నారన్న ఆరోపణలపై స్పష్టత ఇవ్వాలి. దేశంలో ఘర్షణలకు తావిచ్చే పరిస్థితులు సృష్టించవద్దు - శాంతిభద్రతలను కాపాడాలి. రైతుల ఉద్యమాన్ని అణచివేసినట్లే ఇప్పుడు విద్యార్థుల నిరసనలను అణచివేయాలని చూస్తున్నారా? ఈడీ, సీబీఐ, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలు స్వతంత్రంగా పనిచేయాలి. బీజేపీ తన వైఖరి మార్చుకుని ప్రజాస్వామ్య విలువలను గౌరవించాలి. బ్రిటిష్ పాలనను ఎదిరించిన కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణకు పోరాడుతుంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా నుండి బీజేపీ తిరోగమనం ప్రారంభమైంది. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కును, నిరసన తెలిపే హక్కును ఎవరూ కాలరాయలేరని అన్నారు.



## 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'..

**ప్రధాని మోదీకి రాహుల్ సవాల్!**

**ప్రధాని మోదీ ప్రభుత్వానికి సవాల్ విసిరిన రాహుల్ గాంధీ**

**అరెస్టులకు, నిర్బంధాలకు భయపడబోమని స్పష్టీకరణ**

**మోదీ, అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్‌ల లక్షణం పిరికితనం అని వ్యాఖ్య**

**సీఈసీ రాజీనామా కోరుతూ ఢిల్లీలో విపక్షాల నిరసనల నేపథ్యంలో వ్యాఖ్యలు**

రాజ్యాంగాన్ని కాపాడటమే తమ లక్ష్యమని వెల్లడి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. ప్రభుత్వం ఎంతమంది పోలీసులనైనా మోహరించుకోవచ్చని, నేతలను, యువతను అరెస్టు చేసుకోవచ్చని, కానీ ప్రతిపక్షాల పోరాటం మాత్రం ఆగదని శనివారం స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా వీడియో సందేశాన్ని విడుదల చేశారు. గత దశాబ్ద కాలంగా తాను మోదీ, ఆరెస్సెస్‌లపై పోరాడుతున్నానని, వారి గురించి తనకు పూర్తిగా తెలుసని రాహుల్ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్, - మిగతా3లో

# కాంగ్రెస్ 'ఓటు చోరీ' ఆరోపణలను తిప్పికొట్టండి

**బీజేపీ శ్రేణులకు రాంచందర్ రావు పిలుపు**

**ఎన్నికల కమిషన్ ప్రక్రియ పారదర్శకంగా జరిగిందన్న రాంచందర్ రావు**

**వరుస ఓటములతోనే కాంగ్రెస్ తప్పుడు ప్రచారం చేస్తోందని విమర్శ**

**రాజ్యాంగబద్ధ సంస్థలపై బుదర చల్లుతున్నారని మండిపాటు**



ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ ప్రక్రియపై కాంగ్రెస్ చేస్తున్న 'ఓటు చోరీ' ఆరోపణలను క్షేత్రస్థాయిలో బలంగా తిప్పికొట్టాలని బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు రాంచందర్ రావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగానే ఎన్నికల కమిషన్ (ఈసీ) పారదర్శకంగా ఓటర్ల జాబితాను సిద్ధం చేసిందని ఆయన స్పష్టం చేశారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో పార్టీ ముఖ్య నేతలు, మీడియా ప్యానలిస్టులతో జరిగిన సమావేశంలో రాంచందర్ రావు మాట్లాడారు. దొంగ ఓట్ల తొలగింపుపై కాంగ్రెస్ చేస్తున్న అసత్య ఆరోపణలను ఖండించారు. వరుస ఎన్నికల్లో ఓటమి పాలవుతున్న కాంగ్రెస్ పార్టీ, రాజ్యాంగబద్ధ సంస్థలపై బురదజల్లే ప్రయత్నం చేస్తోందని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ చేపట్టిన 'ఓటు చోరీ' ప్రచారాన్ని ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజాస్వామ్యంలో స్వచ్ఛమైన ఓటర్ల జాబితా వల్ల కలిగే ప్రయోజనాలను వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు. ఓటర్ల జాబితా నుంచి తమ మద్దతుదారుల పేర్లను అక్రమంగా తొలగిస్తున్నారని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్న నేపథ్యంలో రాంచందర్ రావు ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ అంశంపై కాంగ్రెస్ నేతలు ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు, జాతీయ స్థాయిలో రాష్ట్రపతిని కూడా కలిసి తమ వాదనలు వినిపించారు.

వార్తాతరంగాలు

ఆదివారం 11 అక్టోబర్ 2026

## సంపాదకీయం

# విశ్వసనీయత పునాదులు తవ్వుతారా

ఒక మనిషి శరీరంలో ఏదైనా అవయవం గాయపడితే, ఆ అవయవానికి చికిత్స చేసి నయం చేయడానికి ప్రయత్నిస్తాం తప్ప... దాన్ని నరికి పారేయాలని ఎవరు అనుకోరు. ప్రజాస్వామ్య వ్యవస్థలైనా అంతే!"ప్రజాస్వామ్య వ్యవస్థల్లో లోపాలు, వివాదాలు రావడం సహజం. భారతదేశం లాంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో అత్యంత కీలకమైన బాధ్యత నిర్వర్తించే ఎన్నికల సంఘం సైతం ఇందుకు మినహాయింపు ఏమీ కాదు. అయితే, ఏదైనా లోపం కనిపించినంత మాత్రాన , ఎన్నికల నిర్వహణలో అభిప్రాయ భేదాలు తలెత్తినంత మాత్రాన... శతాబ్దాలుగా ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలిచిన ఒక రాజ్యాంగ వ్యవస్థ విశ్వసనీయతనే పునాదులతో సహా తవ్వి తీయాలని చూడటం అత్యంత ప్రమాదకరం. ప్రస్తుతం ఎన్నికల సంఘం కమిషనర్ల నియామకం నుంచి మొదలుకొని, ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ వరకు ప్రతి చిన్న అంశం రాజకీయ వివాదాలకు ఆజ్యంగా మారుతోంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ , ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీ నుండి భారత ప్రధాన న్యాయమూర్తిని తప్పిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టంపై నేడు తీవ్రస్థాయిలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి, సుప్రీంకోర్టు గతంలో ఇచ్చిన తీర్పు సూచన మేరకు పార్లమెంట్ ద్వారా ఒక చట్టాన్ని తీసుకురావాల్సిన బాధ్యత కేంద్రంపై ఉంది. ఆ చట్టంలో సీజేఐ ప్రాతినిధ్యం ఉండేలా చూస్తే వ్యవస్థకు మరింత తటస్థత వచ్చేదన్న మాట వాస్తవమే. కేంద్రం అలా చేయకుండా పార్లమెంట్ అత్యధిక మెజారిటీతో ఈ చట్టాన్ని ఆమోదించింది.ఇది పార్లమెంట్ చేసిన రాజ్యాంగబద్ధమైన చట్టం. దీనిపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. విచారణ జరుగుతోంది కూడా. కానీ, చట్టంలోని నియమాలను బూచిగా చూపిస్తూ, కమిషనర్ల మధ్య ఉండే అంతర్గత అభిప్రాయ భేదాలను ఆధారంగా చేసుకుని, కమిషన్ మొత్తాన్నే ప్రధాన రాజకీయం వైపు నెట్టడం సమంజసమా?. ఇక్కడ అసలు విషయమేమిటంటే... ఎన్నికల సంఘం అనేది మ్యాచ్‌ను నిర్వహించి ఫలితాలు ప్రకటించే అంపైర్ లాంటిది మాత్రమే. గ్రౌండ్‌లో ఆడేది రాజకీయ పార్టీలు, తీర్పు ఇచ్చేది ప్రజలు. ఎన్నికల సంఘం అనుకుంటే ఫలితాలను మార్చేస్తుందని అనుకోవడం, పక్షపాతం చూపిస్తుందని చెప్పడం కేవలం అపోహ మాత్రమే. అది అసాధ్యమని విమర్శలు చేసే రాజకీయ పార్టీలకూ లోపల బాగా తెలుసు. కానీ, ప్రస్తుత విపక్షాలు ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విమర్శలు గుప్పిస్తూ, ఆయన రాజీనామాను తమ ప్రధాన రాజకీయ ఎజెండాగా మార్చుకున్నాయి. సీఈసీతో రాజీనామా చేయించడం ద్వారా కేంద్ర ప్రభుత్వాన్ని మానసికంగా, రాజకీయంగా బలహీనపరిచామని చెప్పుకోవడానికి ఇదొక పొలిటికల్ టార్గెట్ గా మారింది.చరిత్ర తిరగేస్తే, ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య వివాదాలు లేదా విభేదాలు రావడం ఇదే మొదటిసారి కాదు. ఇంట్లో నలుగురు అన్నాదమ్ములు ఉంటే గొడవలు రావడం సహజం... అంతమాత్రాన ఇల్లు కూల్చుకోరు కదా!. 1990ల కాలంలో టి.ఎన్. శేషన్ సింగిల్ మెంబర్ కమిషన్‌ను మల్టీ-మెంబర్ కమిషన్‌గా మార్చినప్పుడు తలెత్తిన ఘర్షణలు, ఆ తర్వాత ఎం.ఎస్. గిల్, జి.వి.జి. కృష్ణమూర్తిల మధ్య నడిచిన సుదీర్ఘ ఆధిపత్య పోరాటం, లేదా 2009లో అప్పటి సీఈసీ ఎన్.గోపాలస్వామి తన తోటి కమిషనర్ నవీన్ చావ్లాపై వేటు వేయాలని రాష్ట్రపతికి సిఫార్సు చేసిన ఘటన... ఇవన్నీ ఎన్నికల సంఘంలో అంతర్గత విభేదాలకు నిదర్శనాలు. గతంలో అశోక్ లవాసా కూడా తన విభేదాభిప్రాయాలను రికార్డు చేశారు. ఇవన్నీ వ్యవస్థలోని ప్రజాస్వామ్య స్ఫూర్తిని, అభిప్రాయ స్వేచ్ఛను చూపించే చెక్స్ అండ్ బ్యాలెన్సెస్ మాత్రమే. అంతర్గత విభేదాలు ఉన్నంత మాత్రాన వారు నిర్వహించిన ఎన్నికలను రద్దు చేయాలని కానీ, కమిషన్ ఉనికినే రద్దు చేయాలని కానీ ఆనాడు ఏ రాజకీయ పార్టీ డిమాండ్ చేయలేదు. కానీ, నేడు విపక్షాలు ఏకంగా ఎన్నికల చెల్లుబాటునే ప్రశ్నించే స్థాయికి వెళ్లాయి. ఇక్కడే అసలు ఓటమి రాజకీయం దాగి ఉందనేది స్పష్టమవుతోంది.ముఖ్యంగా కాంగ్రెస్ సహా కొన్ని ప్రధాన ప్రతిపక్ష పార్టీలు తమ వరుస ఓటములకు ప్రజల తీర్పు కారణం కాదు, ఎన్నికల సంఘం , ఈవీఎంల మేనేజ్‌మెంట్‌యే కారణం అని ప్రజల మెదడుల్లోకి ఎక్కించాలని చూస్తున్నాయి. ఇది తీవ్రమైన ముప్పు. ఎలక్షన్ కమిషన్‌లో ఎవరున్నా, సీఈసీగా ఏ అధికారి కూర్చున్నా... క్షేత్రస్థాయిలో ప్రజలు ఓటు వేయకపోతే ఏ పార్టీ కూడా గెలవలేదు. ప్రజల్లో మద్దతు కోల్పోయినప్పుడు, తమ విధానాల్లోని లోపాలను సరిదిద్దుకోవడానికి బదులుగా రాజ్యాంగ వ్యవస్థలపై బురద జల్లడం వల్ల ప్రజాస్వామ్య వ్యవస్థల పట్ల ప్రజలకు ఉండే నమ్మకం సడలిపోతుంది. దేశంలో ఒకప్పుడు ఈవీఎంల వ్యవస్థను ప్రవేశపెట్టడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు కాలం చెల్లిన వాదనలను ముందుకు తెస్తూ మళ్లీ బ్యాలెట్ పేపర్ల విధానమే కావాలని తీర్మానించడం విడ్డూరంగా ఉంది. అంతేకాకుండా, ఎన్నికల ప్రక్రియకు ముందు పారదర్శకత కోసం చేపట్టే ఓటర్ జాబితా సవరణలను వ్యతిరేకించడం ద్వారా ఆ పార్టీ నిజస్వరూపం బయటపడుతోంది. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే సంస్కరణలను స్వాగతించాల్సింది పోయి, వాటిని అడ్డుకోవాలని చూడటం ఆ పార్టీ రాజకీయ అపరిపక్వతకు నిదర్శనం. ఎన్నికల సంఘంలో లోపాలు ఉంటే, పారదర్శకత లోపిస్తే, నియామక ప్రక్రియలో అధికార పక్షం ఆధిపత్యం పెరిగితే... దానిపై ఖచ్చితంగా పోరాడాలి. న్యాయస్థానాల ద్వారా, పార్లమెంట్ చర్చల ద్వారా ఎన్నికల సంస్కరణల కోసం ఒత్తిడి తేవాలి. కానీ, తమ రాజకీయం కోసం, స్వల్పకాలిక ప్రయోజనాల కోసం, వరుస ఓటములను కప్పిపుచ్చుకోవడానికి వ్యవస్థల విశ్వసనీయతనే తెగనరకడం రాజకీయం అనిపించుకోదు. అది కేవలం చేతకానితనం మాత్రమే అవుతుంది. రాజకీయ పార్టీలు కూడా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకుని, వారి మెప్పు పొంది గెలవడానికి ప్రయత్నించాలి. తమ వైఫల్యాలను ఎన్నికల సంఘంపైకి తోసేసి చేతులు దులుపుకునే సంస్కృతికి ఇప్పటికైనా స్వస్తి పలకాలి. వ్యవస్థల లోపాలను సరిదిద్దే దిశగా సాగే పోరాటమే ప్రజాస్వామ్యాన్ని రక్షిస్తుంది తప్ప, వ్యవస్థలను నాశనం చేసే ధోరణి దేశానికే చేటు చేస్తుంది!. దురదృష్టవశాత్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష కూటమి పార్టీలు అదే చేస్తున్నాయి.

# శీతాకాలం ఉన్నట్టా..



తెలంగాణలో ఈ ఏడాది శీతాకాలం ఛాయలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం పొంచి ఉంది. సాధారణంగా నైరుతి రుతుపవనాల నిష్క్రమణతో వాతావరణంలో చలి పుంజుకోవాలి. కానీ, ఈ ఏడాది దానికి విరుద్ధంగా అక్టోబర్ ప్రారంభంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాష్ట్రంలో శీతాకాలపు ఆనవాళ్లు లేకుండా పోవడానికి వాతావరణ మార్పులతో పాటు పాలకుల విధానపరమైన వైఫల్యాలే ప్రధాన కారణమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నైరుతి రుతుపవనాల ఉపసంహరణ సమయంలోనే ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెరుగుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆదిలాబాద్‌లో 37 డిగ్రీలు, హైదరాబాద్‌లో 35 డిగ్రీలు, భద్రాచలం, మహబూబ్‌నగర్‌లలో 36.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ ఏడాది తెలంగాణలో నైరుతి రుతుపవనాల కాలంలో ఏకంగా 17 శాతం వర్షపాత లోటు నమోదైంది. మొత్తం 615.5 మి.మీ. వర్షం కురవాల్సి ఉండగా, అంతకంటే తక్కువగా వర్షాలు పడ్డాయి. ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో అయితే ఏకంగా 27 శాతం వర్షపాత లోటు నమోదు కావడం పట్టణాభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణను గాలికి వదిలేశారనేదానికి నిదర్శనం.ప్రకృతిలో వస్తున్న ఈ మార్పులపై పాలకులకు స్పష్టమైన ప్రణాళిక కొరవడింది. ఎల్ నినో పరిస్థితుల ప్రభావం ఉంటుందని భారత వాతావరణ శాఖ ముందే హెచ్చరించింది. కానీ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడంలో విఫలమైంది. కర్బన ఉద్గారాలను తగ్గించడం, పట్టణాల్లో గ్రీనరీని పెంచడంపై కేవలం ప్రకటనలకే పరిమితమవుతున్న రాజకీయ నాయకులు, గ్రౌండ్ లెవెల్‌లో కాలుష్య నియంత్రణకు కఠినమైన చట్టాలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు.రుతుపవనాల నిష్క్రమణలో జాప్యం, వర్షపాత లోటు కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిన్నది. దీనివల్ల అక్టోబర్ నెలలోనే ప్రజలు తీవ్ర ఉక్కపోతతో, అసౌకర్య వాతావరణంతో అల్లాడిపోతున్నారు. శీతాకాలం జాడ లేకపోవడం వల్ల రాబోయే కాలంలో తీవ్రమైన తాగునీటి ఎద్దడి, వ్యవసాయ రంగానికి నష్టాలు తప్పవని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు ఓటు బ్యాంకు రాజకీయాలను పక్కన పెట్టి, వాతావరణ మార్పులను అరికట్టే దీర్ఘకాలిక విధానాలను అమలు చేయకపోతే.. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రం తీవ్రమైన పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కోక తప్పదు.

# జ్ఞానేశ్ కుమార్ ను సస్పెండ్ చేయాలి

**ఎన్నికల ప్రధాన అధికారి జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలి**

**తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలి**

**రైతు సంఘం డిమాండ్**



మండల కేంద్రశీ నందు రైతు సంఘం ఆధ్వర్యంలో దేశంలో 13. 8 కోట్ల మంది ఓటు హక్కును తొలగించి బిజెపికి తొత్తుగా వ్యవహరిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న జ్ఞానేశ్ కుమార్ రాజీనామాచేయాలని కోరుతూ ,వాల్మీకి విగ్రహం సర్కిల్ నందు జ్ఞానేశ్ కుమార్ ఫోటోలను తగలబెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కే మల్లయ్య ,మండల కార్యదర్శి బి ఈరన్న మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కూని చేసి 13.8 కోట్ల మందికి ఓటు హక్కు లేకుండా చేసి, బిజెపికి ఏజెంట్గా వ్యవహరిస్తూ ,ఇద్దరు కమిషనర్లు 10 నెలల కాలంలో 14 సార్లు ఎస్ ఐ ఆర్ ఫై అభ్యంతరాన్ని వ్యక్తం చేసినప్పటికీ ఏకపక్షంగా వ్యవహరిస్తూ ఎన్నికల వ్యవస్థ పైన ప్రజలకు నమ్మకం లేకుండా చేస్తున్న జ్ఞానేశ్ కుమార్ తక్షణమే రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎన్నికల కమిషనర్లను నియమించే కమిటీ లో 2023 లో బిజెపి ప్రభుత్వం సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ ను తొలగించి అధికార పార్టీ లో ఇంకో మంత్ర ని పెట్టుకున్నప్పటి నుండి ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కోల్పోయి బిజెపి ఏజెంట్గా మారిందని వారు ఆరోపించారు. తొలగించిన ఓట్లను తిరిగి చేర్చాలని ఫారం సిక్స్ లో చేసిన సవరణలను రద్దు చేయాలని డిమాండ్ చేసినారు . ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు గురు, చిన్న మారయ్య, వీరేష్, వలి, ఖాదర్ భాష ఆంజనేయులు ,ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# మోడి అంటే " మర్డరర్ ఆఫ్ డెమొక్రటిక్ ఆఫ్ ఇండియా "

**ఫారం 6, ఫారం 7 లను మోడీ దుర్వినియోగం చేశారు**

**మా దగ్గర కత్తులు కటార్లు బాంబులు ఏమీ లేవు. అడ్డుకోవడం చంద్రబాబు కి తగదు:వైఎస్ షర్మిలా రెడ్డి**



**విజయవాడ:**నన్ను హౌజ్ అరెస్ట్ చేయించడం చంద్రబాబు కి న్యాయమా ? నిరసన వ్యక్తం చేయడం రాజ్యాంగం కల్పించిన హక్కు. కత్తులు, రాళ్లు మా దగ్గర లేవు. శాంతియుతంగా రాజ్ భవన్ కి వెళ్ళాలి అనుకున్నాం . ప్రజాస్వామ్యం బ్రతకాలి అంటే ఓటు ఉండాలి . ఇలాంటి ఓటు హక్కును బీజేపీ ప్రభుత్వం తొలగిస్తుందని ఏపీసీసీ చీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు.షర్మిలా మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 13.40 కోట్ల ఓట్లను తొలగించారు. ఓటర్ల జాబితా నుంచి 13 నుంచి 20 శాతం మందిని తొలగించారు. ఇలా చేస్తే ప్రజాస్వామ్యం ఎలా బ్రతుకుతుంది ? ప్రజల ఓటు చోరీ అవుతుంటే నిరసన చేయడం తప్పా ? ఓటు వజ్రాయుధం. నచ్చిన నాయకుడిని స్వేచ్ఛగా ఎన్నుకొనే హక్కు ఉంది. దళితులు, పేదలు, ముస్లిం, క్రిస్టియన్ల ఓట్లు తొలగిస్తున్నారు. పథకం ప్రకారం బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తుంది. ?కర్ణాటకలో వోట్ చోరీ పై రాహుల్ గాంధీ అన్ని నిజాలు బయట పెట్టారు. బ్రతికి ఉన్న వారి ఓట్లను చనిపోయినట్లు తొలగించారు. ఫారం 6, ఫారం 7 ను బీజేపీ కావాల్సినట్టుగా దుర్వినియోగం చేస్తుంది స్వయం ప్రతిపత్తి సంస్థలు అన్ని మోదీ గుప్పిట్లో ఉన్నాయి . ఎన్నికల సంఘం మోదీ చెప్పినట్లుగా పని చేస్తుంది. ?జ్ఞానేశ్ కుమార్ ను పథకం ప్రకారం జజుజ చేశారు. జ్ఞానేష్ కోసం ఏకంగా 2023 లో చట్టాన్ని మార్చారని అన్నారు.సీఈసీ ని ఎంపిక చేయాలి అంటే ప్రధాని, ప్రతిపక్ష నాయకుడు, సీజేఐ ముగ్గురు కమిటీ సభ్యులుగా ఉండాలి. కానీ జజీ× స్థానంలో క్యాబినెట్ మంత్రిని పెట్టారు. ?అమిత్ షా ను కావాలని మోదీ కమిటీకి నామినేట్ చేశారు. ముగ్గురి సభ్యుల్లో ఇద్దరి మెజారిటీ ఉంటే చాలు. ఎల్వోపీ ఆమోదం లేకుండా నచ్చిన వ్యక్తిని జజుజ చేయొచ్చు . అందుకే బీజేపీ కార్యకర్త జ్ఞానేష్ ను జజుజ చేశారు .చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా జ్ఞానేష్ ఉండటం ప్రజాస్వామ్యానికి సేఫ్ కాదు. జ్ఞానేష్ మీద మాకు నమ్మకం లేదు. ఫారం 7 ను పూర్తిగా బీజేపీ దుర్వినియోగం చేసింది. కర్ణాటకలో ఒక బీజేపీ కార్యకర్త 7 వేల ఓట్లను పేరు రాసి తొలగించారు. ?ఓటరు కి సంబంధం లేకుండా ఓటు తొలగించారు . ?మేము కూడా జ్ఞానేష్ కుమార్ పేరును ఫారం 7 లో రాస్తున్నాం . ఆయనకు కూడా ఆయన ఓటు తొలగిస్తే ఎంత బాధ ఉంటుంది తెలియాలి. ఎవరైనా ఫారం 7 లో జ్ఞానేష్ పేరు రాసి ఆయన బూత్ లో ఇవ్వాలి. మోడీ అంటే "మర్డరర్ ఆఫ్ డెమాక్రటిక్ ఇండియా. ?మోదీ అంటే ప్రజాస్వామ్యాన్ని చంపే వాడని అన్నారు.

# రంగారెడ్డి జిల్లాలో రూ.2 లక్షల విలువైన ఎండీఎంఏ డ్రగ్స్ పట్టివేత



**రంగారెడ్డి, అక్టోబర్ 10**: జిల్లాలో షాబాద్‌లో ఎండీఎంఏ డ్రగ్స్ పట్టుబడింది. బెంగళూరు నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి షాబాద్‌లో విక్రయించేందుకు యత్నించగా.. పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు. షాబాద్ మండలంలోని నాగరగూడ టీ పాయింట్ సమీపంలో డ్రగ్స్ విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. షాబాద్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి దాదాపు 13.97 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యాలు, మూడు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేశారు. పట్టుబడిన మాదకద్రవ్యాల విలువ సుమారు రూ.2 లక్షలు ఉంటుందని అంచనా. నిందితులు పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. అధిక డబ్బు సంపాదించాలనే ఆశతో బెంగళూరు నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. మోకిలా, కోకాపేట తదితర ప్రాంతాల్లో అధిక ధరలకు విక్రయించేందుకు ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. విద్యార్థులు, ఇతర వ్యక్తులను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్ విక్రయిస్తున్నట్లు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పట్టుబడిన వారు మారం వంశీ రెడ్డి (23), వీర ప్రవీణ్ కుమార్ (28) గా పోలీసులు గుర్తించారు. వీరిద్దరూ శంకర్‌పల్లి మండలం ఇంద్రారెడ్డి నగర్‌కు చెందినవారిగా తెలిపారు. నిందితులపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ వెల్లడించారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యువతకు, విద్యార్థులకు సూచించారు. మాదకద్రవ్యాల విక్రయాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీసీపీ యోగేష్ గౌతమ్ హెచ్చరించారు.

# జగన్‌కు ఈడీ షాక్.. అక్రమాస్తుల కేసులపై హైకోర్టును ఆశ్రయించిన ఏజెన్సీ

**జగన్ అక్రమాస్తుల కేసులపై తెలంగాణ హైకోర్టులో ఈడీ పిటిషన్**

**రోజువారీ విచారణ జరపాలని పిటిషన్‌లో అభ్యర్థన**

**దశాబ్దకాలంగా సీబీఐ కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులు**

**విచారణకు జగన్ వ్యక్తిగతంగా హాజరు కావాలని వినతి**




ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి సంబంధించిన అక్రమాస్తుల కేసుల విచారణను వేగవంతం చేయాలని కోరుతూ 'ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్' (ఈడీ) తెలంగాణ హైకోర్టును ఆశ్రయించింది. ఈ కేసుల్లో రోజువారీ విచారణ జరిపి, త్వరితగతిన పరిష్కరించేలా ఆదేశాలు ఇవ్వాలని ఈడీ తన పిటిషన్‌లో అభ్యర్థించింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ కేసులకు సంబంధించి ఈడీ దాఖలు చేసిన తొమ్మిది చార్జిషీట్లు దాదాపు దశాబ్ద కాలంగా సీబీఐ ప్రత్యేక కోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని ఈడీ తెలిపింది. నిందితులు దాఖలు చేసిన డిశ్చార్జ్ పిటిషన్లు పరిష్కారం కాకపోవడం వల్లే విచారణ ముందుకు సాగడం లేదని పేర్కొంది. విచారణకు జగన్‌తో పాటు ఇతర నిందితులంతా వ్యక్తిగతంగా హాజరయ్యేలా ఆదేశించాలని కూడా ఉన్నత న్యాయస్థానాన్ని కోరింది. గత కొన్నేళ్లుగా ఈ కేసుల్లో ప్రత్యేక కోర్టుల విచారణ, ఉన్నత న్యాయస్థానాల్లో సవాళ్లు వంటి పలు న్యాయపరమైన ప్రక్రియలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై తదుపరి విచారణ జరగాల్సి ఉంది.

# నవంబర్ 2వ వారం నుంచి కాళేశ్వరం పనులు

**కరీంనగర్, అక్టోబరు 10:**కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను నవంబర్ రెండో వారంలో ప్రారంభిస్తామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 2027 వర్షాకాలం నాటికి ఈ 3 బ్యారేజీల పునరుద్ధరణ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సాంకేతిక పర్యవేక్షణ కమిటీకి కొత్త డిజైన్లను సమర్పిస్తామని, ఆ తరువాత సాంకేతిక అనుమతులు లభించిన వెంటనే క్షేత్రస్థాయిలో బ్యారేజీల పునరుద్ధరణ పనులు వేగవంతం చేస్తామన్నారు. బ్యారేజీల భద్రత, నిర్మాణం నాణ్యత విషయంలో తెలంగాణ ప్రభుత్వం ఎలాంటి రాజీపడే ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తేల్చిచెప్పారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఇచ్చిన సిఫార్సులు, జాతీయ సాంకేతిక సంస్థల సూచనలు, నిపుణుల కమిటీ వ్యక్తం చేసిన అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పునరుద్ధరణ ప్రణాళికను రూపొందిస్తున్నామని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల భద్రతను అత్యంత పటిష్ఠం



చేస్తామని, ఈ మూడింటిలో నీటి నిల్వతో పాటు వినియోగ సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించి రైతులకు సాగునీరు నీరందిస్తామని మంత్రి ఉత్తమ్ హామీ ఇచ్చారు.కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో గోదావరి నదిపై నిర్మించిన ఒక బహుళార్థసాధక నీటిపారుదల ప్రాజెక్టు. ప్రపంచంలో అతిపెద్ద మల్టీ స్టేజ్ ఎత్తిపోతల ప్రాజెక్టు. 2016లో శంకుస్థాపన చేయగా, తొలి దశ 2019 జూన్ 21న అప్పటి గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్, అప్పటి సీఎం కేసీఆర్ ప్రారంభించారు. కాళేశ్వరం ప్రాజెక్టు 7 లింకులు, 28 ప్యాకేజీలుగా విభజించారు. ఈ ప్రాజెక్టు 13 జిల్లాల గుండా సుమారు 500 కి.మీ (310 మైళ్ళు ) దూరం విస్తరించి ఉంది. ఈ ప్రాజెక్టు మొత్తం 240 టీఎంసీల నీటిని ఎత్తిపోసి అందించడమే లక్ష్యం. మేడిగడ్డ బ్యారేజీ నుంచి 195, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 20, భూగర్భ జలాల నుంచి 25). ఇందులో 169 టీఎంసీలను రైతులకు సాగునీటి కోసం, 30 టీఎంసీలను హైదరాబాద్ నీటి అవసరాలకు, 16 టీఎంసీలను ఇతర పారిశ్రామిక అవసరాలకు, 10 టీఎంసీలను సమీప గ్రామాలకు తాగునీటి కోసం కేటాయించారు.నీటిని ఎత్తిపోయడానికి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల అనే 3 ప్రధాన బ్యారేజీలను నిర్మించారు. అయితే 2023లో మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగడంతో ప్రాజెక్టు భద్రతపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. పగుళ్లకు రిపేర్లు చేపించాలని బీఆర్ఎస్ చెబుతంటే.. భారీ స్కామ్ చేసి దోచుకున్నారని కేసీఆర్ ఫ్యామిలీ మీద కాంగ్రెస్ నేతలు ఆరోపణలు గుప్పించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈ ప్రాజెక్టు లోపాలు, నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయని కాంగ్రెస్ విమర్శలు గుప్పించడం బీఆర్ఎస్ పార్టీకి మైనస్ అయింది. ప్రాజెక్టు సేఫ్టీ మీద అనుమానంతోనే గత మూడేళు ్లగా బ్యారేజీల నుంచి తెలంగాణ ప్రభుత్వం నీటిని ఎత్తిపోయడం లేదు. దీనిపై కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య ఆరోపణలు, విమర్శలు కొనసాగుతున్నాయని తెలిసిందే

# హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసుల అంతర్రాష్ట్ర ఆపరేషన్లు

**హైదరాబాద్ సెప్టెంబర్ 2026:**నగర సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ సెప్టెంబర్ 2026 నెలలో నమోదైన పలు చీజ్రా ఫిర్యాదులపై వేగంగా స్పందించి, మొత్తం 83 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసింది. ఈ నెలలో చేపట్టిన ప్రత్యేక ఆపరేషన్లలో భాగంగా హైదరాబాద్ నగర సైబర్ క్రైమ్ పోలీసులు దేశవ్యాప్తంగా 9 విభిన్న రాష్ట్రాల్లో దాడులు నిర్వహించి 23 సైబర్ క్రైమ్ కేసులకు సంబంధించి 35 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అలాగే సైబర్ నేరగాళ్ల ఖాతాల్లో స్తంభింపజేసిన మొత్తం ?88,48,134 రూపాయలను బాధితులకు విజయవంతంగా తిరిగి వాపసు (రిఫండ్) చేయించారు. ఈ సెప్టెంబర్ నెలలో అరెస్టయిన 35 మంది నిందితుల నేరాల స్వభావాన్ని పరిశీలిస్తే.. సోషల్ మీడియా నేరాలకు సంబంధించి 9 మంది, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌లో 7 మంది, డిజిటల్ అరెస్ట్ కేసుల్లో 6 మంది, ట్రేడింగ్ ఫ్రాడ్‌లో 5 మంది, ప్రకటనల మోసాల్లో 3 మంది, ఐడెంటిటీ థెఫ్ట్‌లో ఇద్దరు, ఎక్స్‌టార్షన్ (బెదిరింపులు) కేసులో ఒకరు, జాబ్ ఫ్రాడ్‌లో ఒకరు, కస్టమర్ కేర్ మోసంలో ఒకరు చొప్పున ఉన్నారు. వీరు అరెస్ట్ అయిన రాష్ట్రాల వారీగా వివరాలు చూస్తే.. తెలంగాణ నుండి 10 మంది, ఆంధ్రప్రదేశ్ నుండి 9 మంది, మహారాష్ట్ర నుండి 6 మంది, కేరళ నుండి ముగ్గురు, ఉత్తర ప్రదేశ్ నుండి ముగ్గురు, బీహార్ నుండి ఒకరు, హర్యానా నుండి ఒకరు, రాజస్థాన్ నుండి ఒకరు మరియు పంజాబ్ నుండి ఒకరు ఉన్నారు. నిందితుల వద్ద నుండి 10 మొబైల్ ఫోన్లు, 07 చెక్ బుక్కులు, ఒక షెల్ కంపెనీ సీల్ స్టాంప్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివిధ మోసాల పద్ధతుల వారీగా బాధితులు కోల్పోయిన మొత్తం మరియు పోలీసులు వాపసు చేయించిన రిఫండ్ వివరాలను పరిశీలిస్తే.. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్‌కి చెందిన 17 కేసుల్లో బాధితులు ?7,68,42,420 నష్టపోగా 9,20,201 రిఫండ్ చేయించారు. ట్రేడింగ్ ఫ్రాడ్ 11 కేసుల్లో 8,43,49,836 పోగొట్టుకోగా 40,24,762 వాపసు ఇప్పించారు. 5 ఓటీపీ ఫ్రాడ్ కేసుల్లో 23,71,465 పోగా ?24,68,321 రిఫండ్ అయ్యాయి. 2 ఏపీకే ఫైల్ ఫ్రాడ్ కేసుల్లో ?8,18,716 నష్టపోగా 5,50,832 రిఫండ్ చేయించారు. ప్రకటనల మోసం ఒక కేసులో 1,29,000 పోగా 50,016 వాపసు ఇచ్చారు. డిజిటల్ అరెస్ట్ ఒక కేసులో 85,00,047 నష్టపోగా 6,91,076, మరియు అనధికార యూపీఐ లావాదేవీల ఒక కేసులో ?4,84,674 నష్టపోగా ?1,42,926 రిఫండ్ ఇప్పించారు. ఈ విధంగా మొత్తం 38 కేసుల్లో బాధితులు ?17,34,96,158 నష్టపోగా, పోలీసులు ?88,48,134 మొత్తాన్ని బాధితులకు తిరిగి ఇప్పించగలిగారు. జోనల్ సైబర్ సెల్స్ డేటా ప్రకారం.. ఈ విభాగం పరిధిలో 2,767 చీజ్రా పిటిషన్లు రాగా, అందులో 381 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. 10 కేసులలో 11 మంది నిందితులను అరెస్ట్ చేసి, ?67,54,049 మొత్తాన్ని బాధితులకు రిఫండ్ చేశారు. డిజిటల్ మానిటరింగ్ ద్వారా సైబర్ పెట్రోల్ విభాగాలు నిర్వహించిన ఎన్‌ఫోర్స్‌మెంట్ వివరాలను పరిశీలిస్తే.. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో మైనర్లను అసభ్యకరంగా, బూతు మాటలతో చూపుతూ వీక్షణలు, లైక్‌లు, సబ్‌స్క్రైబర్లు మరియు మానిటైజేషన్ పొందేందుకు రన్ చేస్తున్న 140 సోషల్ మీడియా ప్రొఫైల్స్, 30 పెయిడ్ ప్రకటనలను గుర్తించారు. అలాగే పాత నాణాలు, ?5 ట్రాక్టర్ నోట్లు, ?786 సిరీస్ నోట్లు, మోసపూరిత బెట్టింగ్ అంచనాలు, గ్యారెంటీ గెలుపుల పేరుతో మోసాలు చేస్తున్న ప్రొఫైళ్లను నిలిపివేశారు. వీటితో పాటు మ్యాట్రిమోనియల్, ప్రైవేట్ వీడియో కాల్ సర్వీసులు, నకిలీ ఉద్యోగ ప్రకటనల ద్వారా అడ్వాన్స్ డబ్బులు, వ్యక్తిగత/ఆర్థిక వివరాలు సేకరించే అనుమానాస్పద ఖాతాలను గుర్తించి చర్యలు తీసుకున్నారు. ముందస్తు జాగ్రత్తగా ఈ 140 ఖాతాలను సంబంధిత సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు రిపోర్ట్ చేసి తొలగించేలా చేశారు. సైబర్ పెట్రోల్ నిరంతర చర్యల్లో భాగంగా ఆన్‌లైన్ గేమింగ్, అక్రమ బెట్టింగ్, నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ సైట్లను ప్రచారం చేస్తున్న 1,457 ప్రొఫైల్స్, 2,603 పెయిడ్ అడ్వర్టైజ్‌మెంట్లను నిలిపివేసి, వాటిని ప్రమోట్ చేస్తున్న వారిపై 09 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు.

# హైదరాబాద్ హైస్పీడ్ రైల్.. భూసేకరణపై కేంద్రం కీలక ప్రకటన

**భూసేకరణకు రాష్ట్రాలకు ఎలాంటి ఆదేశాలు ఇవ్వలేదని వెల్లడి**

**ప్రస్తుతం జరుగుతున్న భూసేకరణ చట్టవిరుద్ధమని స్పష్టీకరణ**

**కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో కిషన్ రెడ్డి భేటీ అనంతరం ప్రకటన**

**ప్రస్తుతం కేవలం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని వెల్లడి**

హైదరాబాద్ కేంద్రంగా నిర్మించ తలపెట్టిన మూడు హైస్పీడ్ రైల్ కారిడార్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఈ ప్రాజెక్టులకు సంబంధించి ప్రస్తుతం అలైన్‌మెంట్ అధ్యయనాలు మాత్రమే జరుగుతున్నాయని, భూసేకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి ప్రతిపాదనలు పంపలేదని స్పష్టం చేసింది. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో ఎవరైనా భూసేకరణకు పాల్పడితే అది చట్టవిరుద్ధం అవుతుందని స్పష్టం చేసింది. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి శనివారం ఢిల్లీలో కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశమయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్–చెన్నై, హైదరాబాద్–బెంగళూరు, హైదరాబాద్–పుణె హైస్పీడ్ రైల్ కారిడార్ల పురోగతిపై చర్చించారు. సమావేశం అనంతరం ఈ వివరాలను కిషన్ రెడ్డి 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పంచుకున్నారు. "రైల్వే మంత్రి స్పష్టం చేసిన దాని ప్రకారం.. సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలకు ఎటువంటి భూసేకరణ అభ్యర్థనలు పంపలేదు. ఈ దశలో హైస్పీడ్ రైల్ పేరుతో జరుగుతున్న ఏ భూసేకరణ అయినా



చట్టవిరుద్ధం" అని కిషన్ రెడ్డి తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రాజెక్టుల అలైన్‌మెంట్ ఖరారైన తర్వాతే ఆ వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో, రైతులతో పంచుకోవడం జరుగుతుందని మంత్రి హామీ ఇచ్చారని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో రైల్ కారిడార్లతో పాటు ఇతర ప్రాజెక్టుల కోసం భూసేకరణ ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కేంద్రం చేసిన ఈ ప్రకటన ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను కొందరు రైతులు వ్యతిరేకిస్తున్న తరుణంలో ఈ స్పష్టత రావడం గమనార్హం. మరోవైపు కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంపై దక్షిణ మధ్య రైల్వే కూడా స్పందించింది. హైదరాబాద్‌ను మూడు ప్రధాన నగరాలతో అనుసంధానించే హైస్పీడ్ రైల్ కనెక్టివిటీకి సంబంధించిన ప్రతిపాదిత అలైన్‌మెంట్‌పై ఇరువురు మంత్రుల మధ్య ఉన్నత స్థాయి చర్చలు జరిగాయని సోషల్ మీడియాలో పేర్కొంది. ఇదిలా ఉండగా, భారతీయ రైల్వేలు 2026–27 ఆర్థిక సంవత్సరానికి గాను జూలై వరకు బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 1.14 లక్షల కోట్లకు పైగా మూలధన వ్యయం చేసినట్లు ప్రభుత్వం గతంలో వెల్లడించింది. అలాగే, దేశీయ పరిజ్ఞానంతో రూపొందించిన 'కవచ్' ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థను 2,633 రూట్ కిలోమీటర్ల మేర ఏర్పాటు చేసినట్లు రైల్వే మంత్రి లోక్‌సభలో తెలిపారు.

# లెనిన్ సెంటర్ లో అఖిల పక్షాల ఆందోళన

లెనిన్ సెంటర్ ఓట్ల దొంగ జ్ఞానేష్ కుమార్ ను తొలగించాలని, సర్ ను రద్దు చేయాలని, ఓటు హక్కును పరిరక్షించాలని కోరుతూ అఖిల పక్షాలు, ప్రజా సంఘాలు చేపట్టిన చలో లోక్ భవన్ కార్యక్రమంలో వందలాదిమంది లెనిన్ సెంటర్ కు చేరుకున్నారు. పోలీసుల ముందస్తు అరెస్టులు, నిర్బంధాలను ఛేదించుకుని కార్యకర్తలు, విద్యార్థులు, యువత, పార్టీల, సంఘాల నేతలు వందలాది మందిని పోలీసులు అరెస్టు చేశారు మహిళలను, విద్యార్థినులను సైతం పోలీసులు ఈడ్చుకొని వెళ్లి పోలీస్ వాహనాల్లో వేశారు. పలువురికి గాయాలయ్యాయి. అలంకార్ సెంటర్, లెనిన్ సెంటర్లలో కార్యకర్తలు బైఠాయించి పెద్ద ఎత్తున మోడీ ప్రభుత్వానికి, ఎన్నికల కమిషనర్ కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వందలాదిగా పోలీసులు, పదుల సంఖ్యలో వాహనాలతో మోహరించినప్పటికీ కార్యకర్తలు, యువత తరలివచ్చి ఉదృతంగా ఆందోళన సాగించారు,ఓట్లు దొంగ జ్ఞానేశ్ కుమార్ ను మోడీ, అమిత్ షా, బీజేపీ ప్రభుత్వం కాపాడుతోందని, వారంతా కుమ్మక్కయ్యారని నేతలు ఆరోపించారు.చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ,కూటమి సర్కార్ ఓటు హక్కును పరిరక్షించాల్సిపోయి, నిసిగ్గుగా ఎన్నికల కమిషన్ ను, కేంద్ర ప్రభుత్వాన్ని బలపరచటం సిగ్గుచేటు ఓట్ల దొంగలు ఉన్న అరెస్టు చేయకపోగా ఓటు హక్కు కోసం పోరాడుతున్న వారిని అరెస్టు చేయటం దుర్మార్గం. ఢిల్లీలో మోడీ ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం, నిర్బంధాన్ని ప్రయోగించడం, అణిచివేయటం గర్హనీయమని, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబురావు అన్నారు.

## బతుకునిచ్చే బతుకమ్మ..

- మొదటి పేజీ తరువాయి

తొలగిస్తుంటారు. కలుపు తీయని పొలాల్లో విరివిగా పెరుగుతుంటాయి. అయితే కొన్ని పొలాల్లో కలుపు తీసిన తర్వాత కూడా పెరుగుతుంటాయి. అలా మొలిచిన మొక్కలే పూలను అందిస్తున్నాయి. బతుకమ్మ పండుగతో కొందరికి ఉపాధిని కల్పిస్తున్నాయి. కొంతమంది కూలీలు బతుకమ్మ పేర్చడానికి అవసరమైన గునుగుపూలు సేకరించి విక్రయిస్తుండడంతో కూలి డబ్బులు గిట్టుబాటవుతున్నాయని చెబుతున్నారు.

**కూలీల హర్షం**

పెద్దేముల్ మండలంలోని వివిధ గ్రామాల్లోని వ్యవసాయ పొలాల్లో ఎర్రరంగు, తెల్లరంగులలో గునుగుపూలు సోయగాన్ని పంచుతున్నాయి. అయితే మండలంలోని తట్టెపల్లి ప్రాంతంలో ఎర్రటి గునుగు పూలు లభిస్తున్నాయి. పెద్దేముల్, జనగాం, రుక్మాపూర్ తదితర ప్రాంతాల్లో మాత్రం తెల్లటిపూలు లభిస్తాయి. గునుగుపూలు ఎక్కడ ఉన్నాయనే విషయం తెలుసుకొని కొందరు కూలీలు వాటిని సేకరిస్తూ ఉపాధి పొందుతున్నారు. బతుకునిచ్చే బతుకమ్మ పండగ తమకు కొంత ఉపాధి కల్పిస్తోందని సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**పూలకు రంగులు అద్ది విక్రయిస్తాం**

ఏటా బతుకమ్మ పండగ సీజన్‌లో గునుగుపూలు సేకరిస్తాం. గునుగుపూలకు హైదరాబాద్ పట్టణంలో మంచి డిమాండ్ ఉంటుంది. సేకరించిన గునుగుపూలను కత్తిరించి వాటిని వివిధ రంగుల్లో అద్దుతాం. తర్వాత వాటిని ఆరబెట్టి హైదరాబాద్‌కు తరలిస్తాం. గునుగుపూల విక్రయంతో రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.రెండు వేల వరకు ఆదాయం వస్తుంది. మార్కెట్‌కు పూలు ఎక్కువగా వచ్చిన సమయంలో మాత్రం ధరలు తగ్గిపోయి ఆదాయం పడిపోతుంది.

## రీసైకిల్డ్ వాటర్ వినియోగంపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

- మొదటి పేజీ తరువాయి

వన్‌వేకు వివిధ కాలనీలు, రహదారుల నుంచి వచ్చే రహదారులు కలిసే చోటుతో పాటు ఫ్రీ లెఫ్ట్, యూటర్న్‌ల విషయంలో తీసుకుంటున్న చర్యలను అధికారులు వివరించారు.యూటిలిటీస్ తరలింపును వేగవంతం చేసి పనులు త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. నాగార్జున సర్కిల్ నుంచి జూబ్లీ చెక్‌పోస్టు వైపు ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.ముంబై వంటి నగరాల్లో ఏడాదిలోపే పనులు పూర్తవుతున్నాయని, అక్కడ వినియోగిస్తున్న సాంకేతికత, పనుల చేపట్టే విధానంపై అధ్యయనం చేయాలని సూచించారు. ప్రారంభించిన పనులు ఏడాదిలోపు పూర్తయ్యేలా చూడాలని చెప్పారు.హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ మార్గానికి సమాంతరంగా రేడియల్ రోడ్డు నిర్మాణంపై అధ్యయనం చేయాలని చెప్పారు. శంకర్‌పల్లి–చేవెళ్ల మధ్య ఇప్పుడు ఉన్న రహదారుల విస్తరణతో పాటు నూతన రోడ్ల నిర్మాణానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలన్నారు.రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. 500 ఎంఎల్‌డీ రీసైకిల్డ్ వాటర్ వినియోగానికి సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు.భారత్ ఫ్యూచర్ సిటీ, చందన్‌వల్లి, ఆలూరులోని డేటా సెంటర్లు, ఇతర పరిశ్రమలు రీసైకిల్డ్ వాటర్ వినియోగించుకునేందుకు వీలుగా పనులు చేపట్టాలని ఆదేశించారు. హై–రైజ్ బిల్డింగుల నిర్మాణం, ల్యాండ్‌స్కేప్స్, పార్కుల్లో రీసైకిల్డ్ వాటర్ వాడేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు ఆదేశించారు. ఈ సమావేశంలో సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ సలహాదారు ఎన్‌వీఎస్ రెడ్డి, అదనపు మేనేజింగ్ డైరెక్టర్ అజిత్ రెడ్డి, హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల కమిషనర్లు ఆర్.వి.కర్ణన్, సృజన,వినయ్ కృష్ణారెడ్డి, వాటర్ బోర్డు ఎండీ అశోక్ రెడ్డి తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

## దేశ రాజధానిలో 1000 మందికి పైగా ఆందోళనకారుల అరెస్ట్

- మొదటి పేజీ తరువాయి

చోటుచేసుకుంది. ఈ సమయంలో కొందరు నిరసనకారులు పోలీసుల కస్టడీ నుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించడమే కాకుండా, బస్సును ధ్వంసం చేసేందుకు కూడా యత్నించారు. అయితే, పోలీసులు వారిని వెంటనే నియంత్రించి, నిర్దేశిత ప్రాంతానికి తరలించారు. ఈ ఘటనతో జన్‌దేవాలన్ పరిసరాల్లో భద్రతను కట్టుదిట్టం చేసి, భారీగా ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సీజేపీ పిలుపు మేరకు జంతర్ మంతర్ వద్దకు చేరుకుంటున్న నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో శనివారం దేశ రాజధాని వ్యాప్తంగా 1,000 మందికి పైగా ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, నిరసనకు ముందే సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ డిప్కే, అధికార ప్రతినిధులు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాలను ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రముఖ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్, యూట్యూబర్ ధ్రువ్ రాఠీని కూడా గురుగ్రామ్‌లోని ఆయన నివాసంలో అరెస్ట్ చేశారు. సుమారు 50 మంది పోలీసులు మఫ్టీలో వచ్చి ఉదయం 8 గంటలకు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సీజేపీ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొంది. గతంలో నిర్వహించిన నిరసనల సందర్భంగా చట్టపరమైన ఆదేశాలను, ఇచ్చిన హామీలను సీజేపీ నిర్వాహకులు పాటించనందున, ఈసారి నిరసనకు అనుమతి నిరాకరించినట్లు పోలీసులు శుక్రవారమే స్పష్టం చేశారు. ప్రస్తుతం ఢిల్లీలోని పలు ప్రాంతాల్లో భారీ పోలీసు బందోబస్తు కొనసాగుతోంది.

## 'సర్'కు మద్దతుగా 124 మంది మాజీ ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారుల లేఖ..

- మొదటి పేజీ తరువాయి

పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ, ఓటర్ల జాబితాల రూపకల్పన, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రత వంటి అంశాల్లో తమకు ప్రత్యక్ష అనుభవం ఉందని వివరించారు. గతంలో బూత్‌ల ఆక్రమణ, బ్యాలెట్ బాక్సుల చోరీ, ఓటర్లను ఓటు వేయకుండా అడ్డుకోవడం వంటి అక్రమాలు జరిగేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ఎన్నికల నిర్వహణలో పలు భద్రతా చర్యలు అమలవుతున్నాయని మాజీ అధికారులు పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో పోటీ చేసిన అభ్యర్థుల ఏజెంట్లు ఓట్ల లెక్కింపును పర్యవేక్షిస్తారని వివరించారు. ఈవీఎంలను అభ్యర్థుల ఏజెంట్ల సమక్షంలో సీల్ చేసి, పర్యవేక్షణకు వీలుగా భద్రపరుస్తారని తెలిపారు. అలాగే, వీవీప్యాట్ స్లిప్పులను ఈవీఎంల లెక్కలతో సరిపోల్చే విధానం కూడా ఉందన్నారు. ఈ సందర్భంగా 2025 బిహార్ అసెంబ్లీ ఎన్నికలను ఉదాహరణగా పేర్కొన్నారు. ఆ రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా ఒక్క చోట కూడా రీపోలింగ్ అవసరం లేకుండా ఎన్నికలు పూర్తయ్యాయని, 1951 తర్వాత అత్యధిక ఓటింగ్ శాతం నమోదైందని తెలిపారు. మహిళా ఓటర్లు రికార్డు స్థాయిలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణలో అమలవుతున్న పర్యవేక్షణ, భద్రతా చర్యల వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అభిప్రాయపడ్డారు.

## 'ఎంత మంది పోలీసులనైనా మోహరించుకోండి'..

- మొదటి పేజీ తరువాయి

జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్‌తో సహా పలువురి పేర్లను ప్రస్తావిస్తూ.. వారి ప్రధాన లక్షణం పిరికితనమని ఆరోపించారు. వారి చుట్టూ ఉచ్చు బిగుస్తోందని, అందుకే వారు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. "మోదీ గారూ.. మీకు నచ్చింది చేసుకోండి. 10 వేలు, 20 వేలు, 50 వేల మంది పోలీసులను పిలవండి. మా నేతలందరినీ, యువతను, మమ్మల్ని అరెస్ట్ చేయండి. కానీ మేం మిమ్మల్ని చుట్టుముడుతున్నాం. వెనక్కి తగ్గే ప్రసక్తే లేదు" అని రాహుల్ గాంధీ తన వీడియోలో ఘాటుగా హెచ్చరించారు. తమ వద్ద అవసరమైన సమాచారం ఉందని, రాజ్యాంగాన్ని, ప్రజల గొంతుకను కాపాడటమే తమ లక్ష్యమని ఆయన పునరుద్ఘాటించారు. గడిచిన 10–15 ఏళ్లలో జరిగిన అన్యాయాలు పునరావృతం కాకుండా చూస్తామన్నారు. దేశ యువత ధైర్యాన్ని చూసి గర్వపడుతున్నానని, నిరసనలు కొనసాగించాలని వారికి పిలుపునిచ్చారు. ఎలక్టోరల్ రోల్స్ ప్రత్యేక సవరణలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ విపక్షాలు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిరసన చేపట్టాలని నిర్ణయించాయి. అయితే, శాంతిభద్రతల కారణాలను చూపుతూ ఢిల్లీ పోలీసులు ఈ ప్రదర్శనకు అనుమతి నిరాకరించారు.

# అతి చేస్తున్న విపక్షాలు

**వెంకయ్య నాయుడు**



**విజయవాడ:**సీఈసీ రాజీనామా, 'సర్' ప్రక్రియ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు చేస్తున్న ఆందోళనలపై మాజీ ఉపరాష్ట్ర వెంకయ్యనాయుడు స్పందించారు. అత్కూరు లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతిపక్షాలు అతిగా ప్రవర్తిస్తున్నాయంటూ . రాజ్యాంగబద్ధ సంస్థను రాజకీయాలతో ముడిపెట్టడం, వ్యక్తిగత విమర్శలు సరికాదన్నారు. నిరాధార ఆరోపణలతో సీఈసీ, ప్రధాని రాజీనామా చేయాలనే డిమాండ్ సమంజసం కాదని చెప్పుకొచ్చారు. ఓట్లు మూకుమ్మడిగా తొలగించారనేది అపోహ మాత్రమే అని స్పష్టం చేశారు. గెలిస్తే తమ ఘనత అని.. ఓడిపోతే ఈవీఎమ్లను నిందించడం హాస్యాస్పదమంటూ వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు.

# ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో అధికార పార్టీకి షాక్



**హైదరాబాద్:**తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘాల ఎన్నికల్లో అధికార పార్టీకి ఎదురు దెబ్బ తాకింది. స్వయానా రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ హామీల వర్షం కురిపించినా, టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ప్రచారం చేసినా, ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇచ్చిన కూటమిని లైట్ తీసుకున్నారు.శుక్రవారం న్న జరిగిన తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ), తెలంగాణ మజ్దూర్ యూనియన్ (టీఎంయూ), నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) కూటమి ఘన విజయం సాధించింది.కాంగ్రెస్ మద్దతిచ్చిన తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్ (టీడబ్ల్యూయూ), స్టాఫ్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ (ఎస్డబ్ల్యూయూ) కూటమికి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ కానీ, అనుబంధ కార్మిక సంఘం కానీ ఎవరికి మద్దతు ఇవ్వలేదు. బడా నేతలు ప్రచారం చేసినా కూడా గుర్తింపు సంఘం ఎన్నికల్లో కాంగ్రెస్ కూటమికి చుక్కెదురవ్వడం ఇప్పుడు చర్చనీయాంశం అయ్యింది.

### ఢిల్లీని పాకిస్థాన్‌కు అప్పగించారా?:

# కేంద్రంపై నారాయణ తీవ్ర ఆగ్రహం

**ఢిల్లీలో నిర్బంధంపై కేంద్ర ప్రభుత్వంపై సీపీఐ నారాయణ ఫైర్**

**తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల్లో ఏఐటీయూసీ గెలుపుపై హర్షం**

**కమ్యూనిస్టులను ఓడించాలన్న కాంగ్రెస్‌పై విమర్శలు**



సీపీఐ సీనియర్ నేత నారాయణ కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశ రాజధాని ఢిల్లీలో పూర్తిస్థాయి లాక్‌డౌన్ విధించారని, ఇంతకీ ఢిల్లీని పాకిస్థాన్‌కు ఏమైనా అప్పగించారా అని ఆయన ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియాలో ఒక వీడియో విడుదల చేశారు. శాంతియుతంగా నిరసన తెలిపేందుకు వచ్చిన వారిని అణచివేసేందుకు 50 వేల నుంచి 75 వేల మంది పోలీసు, ఇతర భద్రతా సిబ్బందిని మోహరించి సాధారణ జనజీవనాన్ని స్తంభింపజేయడం అన్యాయమని అన్నారు. కేంద్రం తప్పులను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం కేంద్రం పరిస్థితి ముందు నుయ్యి, వెనుక గొయ్యిలా తయారైందని వ్యాఖ్యానించారు. ఈ పరిణామాలపై న్యాయ నిపుణులు, సుప్రీంకోర్టు కూడా స్పందిస్తున్నాయని గుర్తుచేశారు. ఇదే సమయంలో, తెలంగాణ ఆర్టీసీ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో ఏఐటీయూసీ అనుబంధ ఎంప్లాయీస్ యూనియన్ విజయం సాధించడంపై నారాయణ సంతోషం వ్యక్తం చేశారు. అయితే, ఈ ఎన్నికలను కమ్యూనిస్టులకు వ్యతిరేకంగా రాజకీయ పోటీగా మార్చిన కాంగ్రెస్ పార్టీపై ఆయన విమర్శలు గుప్పించారు. అధికార అహంకారంతో కమ్యూనిస్టులను ఓడించాలని పిలుపునివ్వడం సరికాదన్నారు. ప్రజల ఉద్యమాలను అణచివేతతో ఆపలేరని, కేంద్రం తన తప్పులను సరిదిద్దుకోవాలని నారాయణ డిమాండ్ చేశారు.

# ఖమ్మంలో నిర్వహించిన నల్గొండ--ఖమ్మం--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క.**



**వనపర్తి:**పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని ఉప ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడిని ఓటరుగా నమోదు చేయించే ప్రక్రియను ఉద్యమంలా చేపట్టాలని, గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిల్లో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాలకు కలుగుతున్న ప్రయోజనాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని అన్నారు. సన్నబియ్యం పంపిణీ, రైతు భరోసా, గృహజ్యోతి, ఉచిత విద్యుత్, చేయూత పింఛన్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలతో ప్రజల జీవితాల్లో వస్తున్న మార్పులను ప్రతి ఇంటికీ వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కాంగ్రెస్ పార్టీతో సుదీర్ఘ అనుబంధం కలిగిన కుటుంబం నుంచి వచ్చిన రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయాన్ని ప్రతి నాయకుడు, కార్యకర్త తమ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదు నుంచి ఎన్నికల్లో ఓటు వేసే వరకు ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరిస్తూ కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి కృషి చేయాలని కోరారు.సంక్షేమ పథకాలే కాంగ్రెస్ విజయానికి బలమని పేర్కొంటూ, పార్టీ శ్రేణుల ఐక్యత, సమష్టి కృషితో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు రాందాస్ నాయక్, మట్టా రాగమయి, కోరెం కనకయ్య తదితరులు పాల్గొన్నారు

# పనితీరుపై రేవంత్ నజర్



**హైదరాబాద్, అక్టోబరు 10:**తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మూడేళ్లు పూర్తవుతున్న తరుణంలో.. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆత్మపరిశీలనకు సిద్ధమైంది. ప్రభుత్వ పాలనపై, ముఖ్యంగా నేతల పనితీరుపై ప్రజాభిప్రాయాన్ని సేకరించేందుకు అత్యంత రహస్యంగా పావులు కదుపుతోంది. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, జీహెచ్ఎంసీ సహా పలు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఇంటెలిజెన్స్ ద్వారా క్షేత్రస్థాయి సర్వే నిర్వహిస్తున్నట్లు సమాచారం. ప్రజా నాడిని ముందుగానే పట్టుకుని, లోపాలను సరిదిద్దుకోవడానికి ప్రభుత్వం సర్వే చేయిస్తున్నట్టు తెలుస్తోంది.సాధారణంగా ఏ ప్రభుత్వమైనా అధికారంలోకి వచ్చాక తమ పథకాలు ప్రజలకు ఎంతవరకు చేరుతున్నాయి.. తమ పాలనపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. అనే అంశాలపై ఎప్పటికప్పుడు థర్డ్ పార్టీల ద్వారా నిఘా పెడుతుంటాయి. అయితే.. రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం ఏకంగా ఇంటెలిజెన్స్ యంత్రాంగాన్ని రంగంలోకి దించింది. ప్రభుత్వ పనితీరుపై క్షేత్రస్థాయిలో లోతుగా ఆరా తీస్తోంది. గ్రామ పంచాయతీ నుంచి మున్సిపల్ వార్డులు, కార్పొరేషన్ డివిజన్ల వారీగా ఈ సర్వేను విస్తృతంగా నిర్వహిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.ఈ సర్వేలో కేవలం ప్రభుత్వం, ముఖ్యమంత్రి పనితీరు మాత్రమే కాకుండా, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, మంత్రుల పాలనా శైలిపై కూడా ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ సేకరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలు ఏమనుకుంటున్నారు.. ఏ ఏ పథకాలపై సానుకూలంగా ఉన్నారు... వేటిపైన అసంతృప్తితో ఉన్నారు.. లాంటి అంశాలను గుర్తించి.. సరిదిద్దుకేవడమే ఈ సర్వే ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది.గత ఎన్నికల హామీల అమలు, సంక్షేమ పథకాల లబ్ధి అర్హులందరికీ అందుతున్నాయా లేదా అనే అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకోవడం ద్వారా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సర్కార్ భావిస్తోంది. ఈ సర్వేలో ప్రజలను ప్రధానంగా అయిదు నుంచి ఏడు రకాల కీలక అంశాలపై ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం, ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యేల పనితీరుతో పాటు, రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలోకి వస్తే బాగుంటుంది? ఒకవేళ కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే దానికి గల కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలను సంధించడం ద్వారా ప్రతిపక్షాల వైపు ప్రజల మొగ్గు ఎలా ఉందో అంచనా వేయాలని చూస్తున్నారు. ముఖ్యంగా హైడ్రా పనితీరు, ఉచిత పథకాలు, విద్యుత్ కోతలు, నిరుద్యోగ సమస్య, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లు వంటి సమస్యాత్మక అంశాలపై ప్రజల స్పందనను ఇంటెలిజెన్స్ వర్గాలు కూలంకషంగా సేకరిస్తున్నట్లు సమాచారం.ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, గ్యాస్ సబ్సిడీ వంటి పథకాలు ఎంతవరకు జనాల్లోకి వెళ్లాయనే కోణంలోనూ ఈ సర్వే వివరాలు రాబడుతోంది. అదే సమయంలో, కొన్ని వర్గాల నుంచి వస్తున్న వ్యతిరేకత, ఉచితాలకు వ్యతిరేకంగా ఉన్న అభిప్రాయాలు, సంక్షేమ పథకాల అమలులో ఉన్న లోపాలను గుర్తించి దిద్దుబాటు చర్యలు చేపట్టడానికి ఈ డేటా ప్రభుత్వానికి అత్యంత కీలకం కానుంది. ఎన్నికల సమయానికి ముందే ప్రజా వ్యతిరేకతను తగ్గించి, పాలనను గాడిలో పెట్టడమే లక్ష్యంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ఇంటెలిజెన్స్ సర్వేను ఒక అస్త్రంగా మలుచుకుంటున్నట్లు స్పష్టమవుతోంది.

# 14న సింహగర్జన...

**అదిలాబాద్, అక్టోబరు 10:** సింగరేణి కాలరీస్ కంపెనీలిమిటెడ్ మరోసారి చర్చనీయాంశంగా మారుతోంది. సింగరేణి కార్మికుల సమస్యలపై పోరాడేందుకు ప్రతిపక్ష బీఆర్ఎస్ సిద్ధమవుతోంది. సింగరేణి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం వైఫలమైందంటూ అక్టోబర్ 14న రామగుండం వేదికగా 'సింగరేణి కార్మిక గర్జన' నిర్వహించబోతోంది. ఈ సభకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, కీలక నేత హరీశ్ రావు తదితరులు హాజరవుతున్నారు.సింగరేణి లాభాల్లో కార్మికులకు దక్కే వాటా గణనీయంగా తగ్గిపోయిందనేది బీఆర్ఎస్ ప్రధానంగా ఆరోపిస్తోంది. గత బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు ఏకంగా 32 శాతం లాభాల వాటా అందిందని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి సంవత్సరంలోనే ఆ వాటా 16 శాతానికి, ఆ తర్వాత 2024-25 నాటికి 12.5 శాతానికి పడిపోయిందని హరీష్ రావు ఆరోపించారు. దసరాకు ముందే లాభాలు, వాటాలను ప్రకటించడం ఆనవాయితీగా వస్తున్నప్పటికీ, ఈసారి ఆ సంప్రదాయానికి తూట్లు పడ్డాయని బీఆర్ఎస్ విమర్శిస్తోంది.సింగరేణి ఆర్థిక పరిస్థితిపై అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి రూ. 4,712 కోట్ల లాభాలను ఆర్జించగా, 2024-25 నాటికి అవి రూ. 6,394 కోట్లకు చేరాయని బీఆర్ఎస్ చెప్తోంది. అయితే ఈ ఏడాది మాత్రం లాభాలు రూ. 1,800 కోట్లకు మించే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వ తప్పుడు నిర్ణయాలు, పరిపాలనా వైఫల్యాలు, టెండర్లలో జాప్యం, భారీ వ్యయంతో కూడిన కాంట్రాక్టుల కారణంగానే సంస్థ ఈ దుస్థితిని ఎదుర్కొంటోందని బీఆర్ఎస్ వాదిస్తోంది. మరోవైపు.. బ్యాంకుల్లో రూ.6,323 కోట్లు నిల్వ ఉన్నప్పటికీ, అదనంగా 4,000 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్ ఎందుకు తీసుకోవాల్సి వచ్చిందని హరీష్ రావు ప్రభుత్వాన్ని నిలదీశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి బొగ్గు గనుల ప్రాంతాలు ఏ పార్టీ రాజకీయ భవిష్యత్తునైనా నిర్ణయించడంలో కీలక పాత్ర పోషించాయి. ఇప్పుడు సింగరేణి కార్మికులను కూడగట్టడం ద్వారా ఉత్తర తెలంగాణలో మళ్లీ పట్టు సాధించాలని బీఆర్ఎస్ భావిస్తోంది. గతంలో తమ ప్రభుత్వ హయాంలో కార్మికులకు అందిన సంక్షేమం, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను పోల్చి చెప్పడం ద్వారా కార్మిక లోకంలో సానుభూతిని పొందడమే లక్ష్యంగా ఈ 'కార్మిక




గర్జన' రూపుదిద్దుకుంటోంది.మొత్తానికి... రామగుండం వేదికగా జరగనున్న ఈ సభ రాష్ట్ర రాజకీయాల్లో అధికార కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టేందుకు బీఆర్ఎస్ చేస్తున్న వ్యూహాత్మక అడుగుగా పరిశీలకులు భావిస్తున్నారు. కార్మిక సమస్యల పేరుతో తెరపైకి వస్తున్న ఈ రాజకీయం రానున్న రోజుల్లో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో వేచి చూడాలి

# భూగర్భ విద్యుత్..

**6 వేల కి.మీ.కుపైగా అండర్‌గ్రౌండ్ కేబులింగ్**



**హైదరాబాద్, అక్టోబరు 10:**హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను మరింత ఆధునికంగా, సురక్షితంగా మార్చేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రాజెక్ట్ చేపట్టింది. ం+ూాణజూ ఆధ్వర్యంలో హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1 అమలు కానుంది. ఇందులో సుమారు 311 కిలోమీటర్ల 33 కేవీ, 5,772 కిలోమీటర్ల 11 కేవీ విద్యుత్ లైన్లను భూగర్భంలోకి మార్చనున్నారు. చెట్లు, గాలులు, వర్షాల కారణంగా విద్యుత్ అంతరాయాలు తగ్గడంతోపాటు వీధుల్లో భద్రత, నగర సౌందర్యం, స్మార్ట్ గ్రిడ్ సామర్థ్యం మెరుగుపడే అవకాశం ఉందని ం+ూాణజూ అధికారులు ట్విట్టర్ ఎక్స్ ద్వారా వెల్లడించారు.ప్రపంచ స్థాయి నగరంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్‌లో విద్యుత్ మౌలిక వసతులను ఆధునీకరించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. నగరంలో ప్రస్తుతం స్తంభాలపై ఉన్న విద్యుత్ లైన్లను దశలవారీగా భూగర్భంలోకి మార్చే హైదరాబాద్ భూగర్భ విద్యుత్ కేబులింగ్ ప్రాజెక్ట్ ఫేజ్-1ను చేపడుతోంది. తెలంగాణ దక్షిణ విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్ట్ అమలు కానుండగా.. నగర విద్యుత్ వ్యవస్థలో గణనీయమైన మార్పులు వచ్చే అవకాశం ఉంది.ఫేజ్-1లో సుమారు 311 కిలోమీటర్ల మేర 33 కేవీ విద్యుత్ లైన్లను, దాదాపు 5,772 కిలోమీటర్ల మేర 11 కేవీ లైన్లను భూగర్భంలోకి తరలించనున్నారు. బంజారాహిల్స్, గ్రీన్‌ల్యాండ్స్, సైఫాబాద్, ప్యారడైజ్, కంటోన్మెంట్, మెహదీపట్నం, చార్మినార్, బేగంబజార్, బోయిన్‌పల్లి, అస్మాన్‌గఢ్, ఆజామాబాద్ డివిజన్లు ఈ తొలి దశలో భాగంగా ఉన్నాయి. బంజారాహిల్స్, సికింద్రాబాద్, హైదరాబాద్ సెంట్రల్, హైదరాబాద్ సౌత్ సర్కిళ్ల పరిధిలోని 11 డివిజన్లలో ఈ పనులు చేపట్టనున్నారు. భూగర్భ కేబులింగ్‌తో ముఖ్యంగా వర్షాకాలంలో విద్యుత్ సరఫరాకు ఎదురయ్యే అంతరాయాలు తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం చెట్లు విరిగిపడటం, బలమైన గాలులు, వర్షాలు, పిడుగుల ప్రభావంతో విద్యుత్ లైన్లు దెబ్బతినే సందర్భాలు ఉంటాయి. కేబుళ్లు భూగర్భంలోకి వెళ్లడంతో ఇలాంటి బాహ్య ప్రభావాల నుంచి విద్యుత్ వ్యవస్థకు రక్షణ లభిస్తుంది. ఫలితంగా విద్యుత్ సరఫరాను మరింత స్థిరంగా కొనసాగించేందుకు వీలవుతుందని ం+ూాణజూ అధికారులు వెల్లడించారు.అదే సమయంలో రోడ్ల పక్కన, ఇళ్లకు సమీపంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు తగ్గడంతో ప్రజల భద్రత కూడా మెరుగుపడనుంది. బాల్కనీలు, ఇళ్లు, ఫుట్‌పాత్‌లకు సమీపంలో ఉన్న ప్రమాదకర విద్యుత్ లైన్ల సమస్య తగ్గడంతో పాటు స్తంభాల సంఖ్య తగ్గడం వల్ల పాదచారులకు మరింత స్థలం అందుబాటులోకి రానుంది. ముఖ్యంగా చారిత్రక ప్రాంతాలు, వారసత్వ కట్టడాల పరిసరాల్లో తీగల గందరగోళం తగ్గడం నగర సౌందర్యాన్ని పెంచే అంశంగా మారనుంది.ఈ ప్రాజెక్ట్‌లో స్మార్ట్ గ్రిడ్ సాంకేతికతకు కూడా ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ూజూణాూ ఆధారిత రింగ్ మెయిన్ యూనిట్లు అందుబాటులోకి రావడంతో విద్యుత్ నెట్‌వర్క్‌లో లోపాలను వేగంగా గుర్తించి, ప్రభావిత ప్రాంతాన్ని వేరు చేసి సరఫరాను త్వరగా పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. భూగర్భ కేబుళ్లకు అనధికారికంగా కొక్కేలు వేయడం కష్టంగా ఉండటంతో విద్యుత్ చౌర్యం, సాంకేతిక నష్టాలను తగ్గించడంలోనూ ఈ వ్యవస్థ ఉపయోగపడనుంది. మొత్తంగా భూగర్భ కేబులింగ్ ప్రాజెక్ట్ హైదరాబాద్‌ను మరింత సురక్షితమైన, అందమైన, ఆధునిక విద్యుత్ వ్యవస్థ కలిగిన నగరంగా తీర్చిదిద్దే దిశలో కీలక అడుగుగా నిలవనుంది. భవిష్యత్తులో నగరంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఈ విధానాన్ని విస్తరించడం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా మరింత పటిష్టమైన నెట్‌వర్క్‌ను నిర్మించే అవకాశం ఉంటుంది.

### రోడ్డు ప్రమాదంలో

# యువకుడి దుర్మరణం



**మేడ్చల్:** కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నాగారం రాంపల్లి చౌరస్తా లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. నాగారం నుండి అహ్మద్ గూడ వైపు వెళ్తున్న గ్యాస్ లారీ ప్రమాదపు శాత్తు వెనక టైర్ కిందపడి యువకుడు అక్కడికక్కడే మృతి. ఉదయం జిమ్ ముగించుకొని శివానంద్ పూరి కాలనీ లో తన ఇంటికి వెళ్తుండగా అఖిల్ (20 సంవత్సరాలు )లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు రోదన అక్కడ ఉన్న వారి ని కంటతడి పెట్టింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టంకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# జీడిమెట్ల పోలీస్ స్టేటస్ పరిధి చింతల్లో విషాదం..

**సైనేడ్ ముట్టుకొని రెండున్నరేళ్ల చిన్నారి మృతి**



**మేడ్చల్:**జీడిమెట్ల పోలీస్ స్టేటస్ పరిధి చింతల్లో సైనేడ్ ముట్టుకొని రెండున్నరేళ్ల చిన్నారి మృతి చెందాడు. దాంతో విష్ణు జ్యువెలరీ ఎదుట బంధువులు ఆందోళనకు దిగారు. న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు జీడిమెట్ల పోలీసులను ఆశ్రయించారు. చింతల్ కాస్తాబజార్లోని విష్ణు జ్యువెలరీ లో బంగారం కొనుగోలు చేసేందుకు తల్లితో కలిసి వచ్చిన రెండేళ్ల ఐదు నెలల చిన్నారి మిష సైనేడ్ పదార్థాన్ని ముట్టుకోవడంతో మృతి చెందినట్లు సమాచారం.

### ప్రేమ వేధింపులతో

# యువతి ఆత్మహత్య

**పరిగి:**వికారాబాద్ జిల్లా పరిగి మండలం రావులపల్లి గ్రామంలో దారుణం జరిగగింది. ప్రేమ పేరుతో యువకుడి వేధింపులు ఎక్కువ కావడంతో బాలిక ఆత్మహత్య చేసుకుంది. బాధితురాలు గ్రామశివారులోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. చరణ్ అనే యువకుడు ప్రేమించాలని పదే పదే ఫోన్ చేసి ఒత్తిడి చేసాడు. పోలీసులు బాలిక మృతదేహాన్ని పరిగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. నిందితుడు చరణ్ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ఆగం చేస్తోంది

**- బీఆర్ఎస్ సీనియర్ నేత సయ్యద్ ఖలీల్**

**ఆమనగల్లు, అక్టోబర్ 10 (స్కై న్యూస్):**కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని పూర్తిగా ఆగం చేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలన రైతులకు పీడకలగా మారిందని బీఆర్ఎస్ సీనియర్ నేత సయ్యద్ ఖలీల్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం ఆమనగల్లు పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. రైతుబంధు ఎప్పుడు వేస్తారో, ఎంత వేస్తారో కూడా రైతులకు అర్థం కాని పరిస్థితి నెలకొందన్నారు. హామీలు గుప్పించిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రెండు నెలలుగా ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయని, దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. కల్లాల్లో ధాన్యం



నిల్వ ఉంచుకోలేక, అమ్ముకోలేక రైతులు అల్లాడుతున్నారన్నారు.అదేవిధంగా అప్రకటిత కరెంటు కోతలతో పంటలకు నీళ్లు పెట్టుకోలేక రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారన్నారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఘనతను గుర్తుచేస్తూ.. కేసీఆర్ హయాంలో రైతులకు నీటి తీరువా రద్దు చేశామని, ప్రాజెక్టుల ద్వారా భూగర్భ జలాలను పెంచామని,వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చామని, ఎకరాకు రూ.5 వేల చొప్పున రైతుబంధు పెట్టుబడి సాయం అందించి, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసిందని తెలిపారు.కానీ నేడు రేవంత్ రెడ్డి పాలనలో రైతులు అన్ని రకాల ఇబ్బందులకు గురవుతున్నారని, రెండున్నరేళ్ల కాంగ్రెస్ పాలన రైతుల పాలిట శాపంగా మారిందని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో రైతులే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని బొందపెట్టడం ఖాయమని, తిరిగి కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వమే రావాలని రైతులు కోరుకుంటున్నారని సయ్యద్ ఖలీల్ అన్నారు.

# కర్ణాటక భారత్ మాల రోడ్డుపై ఘోర ప్రమాదం

**ఒకరు మృతి, మరొకరి పరిస్థితి విషమం**

**బాధితులంతా ఇందువాసి గ్రామ దళితులే**



ప్రమాద బాధితులు, కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడిన గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారుగద్వాల నియోజకవర్గం గట్టు మండలం ఇందువాసి గ్రామానికి చెందిన వలస కూలీలు ప్రయాణిస్తున్న సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది, పలువురు గాయపడటం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ దుర్ఘటన పట్ల గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధిత కుటుంబ సభ్యులతో ఫోన్ లో మాట్లాడారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. కుటుంబానికి తీరని లోటు కలిగించిన ఈ విషాద సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆకాంక్షించారు. అలాగే, ప్రమాదంలో గాయపడిన వారికి ప్రభుత్వ తరఫున ఆర్థిక సాయం అందించేలా చర్యలు తీసుకుంటామని, బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని రాయచూరు జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులతో మాట్లాడి చెప్పడం జరిగింది..ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అవసరమైన సహాయం అందేలా కృషి చేస్తామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి గారు స్పష్టం చేశారు.

# కడ్తాల్ ది ఎర్త్ సెంటర్ ను సందర్శించిన గ్రూప్-II ఆఫీసర్ ట్రైనీలు..

**ఎల్-నినో ప్రభావంపై అవగాహన**

**ఆమనగల్లు, అక్టోబర్ 10 (స్కై న్యూస్):** డా. ఎం.సి.ఆర్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ, తెలంగాణ ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రూప్-×× సర్వీస్ ఆఫీసర్ల కంబైన్డ్ ఫౌండేషన్ కోర్సులో భాగంగా 220 మంది ఆఫీసర్ ట్రైనీలు కడ్తాల్ లోని ది ఎర్త్ సెంటర్ ను సందర్శించారు. 28.09.2026 నుండి 17.10.2026 వరకు నిర్వహిస్తున్న ఈ (బ్యాచ్-××-దీ) ఫౌండేషన్ కోర్స్ లో భాగంగా శిక్షణలో ఉన్న అధికారులకు క్షేత్రస్థాయి అనుభవం, ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్ పై అవగాహన కల్పించేందుకు ఈ క్షేత్ర పర్యటనను ఏర్పాటు చేశారు.ఈ సందర్శనలో భాగంగా ట్రైనీ అధికారులకు అటవీ సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, సహజ వనరుల నిర్వహణ మరియు ఫీల్డ్ అడ్మినిస్ట్రేషన్ లో ఎదురయ్యే సవాళ్లపై క్షుణ్ణంగా అవగాహన కల్పించారు. ఎర్త్ సెంటర్ లో చేపడుతున్న వివిధ పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను అధికారులకు వివరించారు అనంతరం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో సి.జి.ఆర్ పర్యావరణ సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి లీలా లక్ష్మారెడ్డి ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుతం



ప్రపంచాన్ని వణికిస్తున్న ఎల్-నినో ప్రభావంపై అధికారులకు వివరంగా వివరించారు.ఎల్-నినో కారణంగా వాతావరణంలో అసాధారణ మార్పులు చోటు చోటుచేసుకుంటున్నాయని, అకాల వర్షాలు, తీవ్రమైన కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆమె తెలిపారు. దీని ప్రభావం వ్యవసాయ రంగం, నీటి వనరులు మరియు జీవవైవిధ్యంపై తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పులను తట్టుకోవడానికి అడవులను కాపాడుకోవడం,



సహజ వనరులను పరిరక్షించుకోవడం భావి తరాలకు ఎంతో అవసరమని, ఈ దిశగా అధికారులుగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సి జి ఆర్ సంస్థ వ్యవస్థాపకులు శ్రీ కె. లక్ష్మారెడ్డి గారు, ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త డా. నక్కా సాయి భాస్కర్ రెడ్డి గారు, ఎఫ్ ఆర్ వో లక్ష్మణ్ గారు, అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆమనగల్లు మార్కండేయ ఆలయ దేవీ నవరాత్రి ఉత్సవాలకు మంత్రి జూపల్లి, ఎమ్మెల్యేకు ఘన ఆహ్వానం



**ఆమనగల్లు, అక్టోబర్ 10 (స్కై న్యూస్):**ఆమనగల్లు పట్టణంలోని శ్రీ రాజరాజేశ్వరి సమేత శివ భక్త మార్కండేయ దేవాలయంలో నిర్వహించనున్న దేవీ నవరాత్రి ఉత్సవాలకు రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావుకు ఘన ఆహ్వానం పలికారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయంలో నిర్వహించనున్న ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాల వివరాలను మంత్రికి వివరించారు.అదేవిధంగా కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డిని కూడా ఉత్సవాలకు ఆహ్వానించారు. ఉత్సవాలకు తప్పకుండా హాజరవుతామని వారు హామీ ఇచ్చినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంగలి శ్రీధర్, మహేష్ నేత, గుర్రం దినేష్, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే...



**అమ్రాబాద్ అక్టోబర్ 10 (స్కై న్యూస్)** విద్యుత్ సబ్ స్టేషన్ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు విద్యుత్ సౌకర్యాన్ని మెరుగుపరచాలని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సూచించారు శనివారం మండల పరిధిలోని మన్ననూరు గ్రామంలో నూతన విద్యుత్ సబ్టేషన్ పనులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే నా లక్ష్యమని గ్రామ అభివృద్ధి ముఖ్యం అని గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని గ్రామంలో విద్యుత్ కొరత రాకుండా విద్యుత్ సౌకర్యాలను మెరుగుపరచడానికి నూతన సబ్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మంజుల రాజారామ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎమ్మే రహీం డిప్యూటీ సర్పంచ్ రమణ మాజీ అధ్యక్షులు తుల్జా నాయక్ మరియు పంబలి బుచ్చయ్య కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎమ్మెల్యేకు సన్మానం



**జోగులాంబ గద్వాల అక్టోబర్ 10 (స్కై న్యూస్):**గద్వాల ఆర్టీసీ డిపో ఎన్నికల్లో ఎంప్లాయిస్ యూనియన్ ఎమ్మెల్యే ని సన్మానించారు. గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల ఆర్టీసీ డిపోలో తెలంగాణ వర్కర్స్ యూనియన్ గెలుపొందిన గాల్ రెడ్డి (అధ్యక్షుడు), గిరిరాజ్ (కార్యదర్శి) ఎన్నికైన సందర్భంగా ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి ని మర్యాదపూర్వక కలిసి శాలువా కప్పి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిపో గౌరవ అధ్యక్షుడు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామన్ గౌడ్, మాజీ ఎంపీపీ విజయ్, మాజీ కౌన్సిలర్ శ్రీను ముదిరాజ్, నాయకులు, వంట భాస్కర్, ఆర్టీసీ యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సొంత నిధులతో ప్రజల తాగునీటి సమస్యకు పరిష్కారం

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 10 (స్కై న్యూ):** జిల్లేడు చౌదరిగూడ మండలం వీరన్నపేటలోని మైనారిటీ వార్డులో తాగునీటి సమస్యపై స్థానిక ప్రజలు చేసిన విజ్ఞప్తికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ తక్షణమే స్పందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తన స్వంత నిధులతో బోరు వేయించి తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. పదవిలో ఉన్నా లేకున్నా ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి తన వంతు సహకారం అందించడం అభినందనీయమని ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ, వారి కష్టాల్లో అండగా నిలవడమే నిజమైన నాయకత్వానికి నిదర్శనమని అన్నారు. అంజయ్య యాదవ్ చూపిన చొరవ పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కావలి సుమలత వెంకట్రాములు, వార్డు సభ్యులు సత్యం గౌడ్, కుమ్మరి శేఖర్, గంగంపుత్ర సంఘం అధ్యక్షుడు మురళీ, మండల సీనియర్ నాయకులు ఎం. నర్సిములు, సలీం, బీఆర్ఎస్ గ్రామ



అధ్యక్షుడు ఎండీ జహంగీర్, బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు కావలి నరేష్, ఉపాధ్యక్షుడు రెడ్డి నరేష్, మైనారిటీ విభాగం అధ్యక్షుడు ఎండీ అమీర్, సోహెల్, ఖాజా పాషా, ఐదవ వార్డుకు చెందిన మొకత్యార్, గులాం, దస్తగిరి, రఫీక్, మోసిన్, బురాన్, యూసుఫ్, కుక్కల బాలయ్య, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారిని దర్శించుకున్న మెదక్ జడ్జి పాపిరెడ్డి



**పాపన్నపేట /మెదక్,అక్టోబర్10,(స్కై న్యూస్ ప్రతినిధి ):**ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారిని శనివారం గౌరవ మెదక్ జడ్జి పాపిరెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజల్లో పాల్గొన్నారు.ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, జడ్జి పాపిరెడ్డి తీర్థప్రసాదాలను అందజేశారు. అమ్మవారి ఆశీస్సులు పొందిన ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, దేవస్థానం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు నెలకొల్పాలి



**మెదక్, అక్టోబర్ 10( స్కైన్యూస్ ప్రతినిధి ) :** జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను ఉన్న ప్రారంభించి నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని డివైఎఫ్ఐ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ డిమాండ్ చేశారు జిల్లా కేంద్రంలో నిర్వహించిన డివైఎఫ్ఐ దుస్తుతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూసివేసిన ఎన్ఎస్ఎఫ్ పరిశ్రమను ప్రారంభించాలని కోరారు. ప్రైవేటు పరిశ్రమలలో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని యువజన వసతి గృహాలను ఏర్పాటు చేయాలని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కేడియం అభివృద్ధి చేయాలని ఎందుకు ప్రత్యేక వ్యాయామ కోచులను నియమించాలని డిమాండ్ చేశారు. దళిత బడుగు బలహీన మైనార్టీ యువతకు కార్పొరేషన్ల ద్వారా ఎలాంటి పూచికత్తులు లేకుండా 10 లక్షల రుణాలు అందించాలని అన్ని మండల కేంద్రాలలో నైపుణ్యాభివృద్ధి శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు అనంతరం జిల్లా కన్వీనర్ కమిటీని ఎన్నుకున్నారు.

# సిద్దాపూర్ గోడు వినేదెవరు?

## ఏడో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు

**రంగారెడ్డి జిల్లా అక్టోబర్ 10 స్కై న్యూస్ ):** సిద్దాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను విరమించుకోవాలని, జీవో 641ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దాపూర్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు ఏడో రోజుకు చేరుకున్నాయి. ఇప్పటికే కలెక్టరేట్, ఎమ్మార్వో, ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసనలు చేపట్టి, మంత్రులకు వినతిపత్రాలు సమర్పించినా ప్రభుత్వం స్పందించకపోవడంపై జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దాపూర్‌తో పాటు పరిసర 30 గ్రామాలు, తండాల ప్రజల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే స్పందించాలని జేఏసీ చైర్మన్ రాంబాల్ నాయక్ డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారం కాకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు రాజేందర్ రెడ్డి, బిచ్యా నాయక్, నరేందర్ రెడ్డి తెలిపారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన సర్పంచ్ బసు నాయక్‌తో



పాటు పలువురు నాయకులు, మహిళలు ఉద్యమానికి సంఘీభావం తెలిపారు. ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సిద్దాపూర్ పరిరక్షణ పోరాటానికి మద్దతు ఇవ్వాలని జేఏసీ పిలుపునిచ్చింది.

# శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో అమావాస్య పూజలు



**జోగులాంబ గద్వాల, అక్టోబర్ 10 స్కై న్యూస్):**గద్వాల పట్టణ సమీపంలోని నది అగ్రహారం రోడ్డు లో గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం అమావాస్య సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ముకుందా చారి శ్రీనిధి ఆధ్వర్యంలో ఉదయం పంచామృతాభిషేకాలు అర్చనలు ఆకు పూజ అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా దేవాలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

వార్తాతరంగాలు

ఆదివారం 11 అక్టోబర్ 2026

# రామస్వామిగుట్ట ఇళ్ల పంపిణీకి ముహూర్తం ఖరారు!

**2,160 కుటుంబాలకు ఇళ్లు.. ఈ నెల 20న పట్టాల పంపిణీ లక్ష్యం**

**మౌలిక వసతులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష.. పారదర్శక కేటాయింపునకు ఆదేశాలు**

**హుజూర్‌నగర్, అక్టోబర్ 10 (స్కై న్యూస్):** పేదల సొంతింటి కలను సాకారం చేసే దిశగా రామస్వామిగుట్ట గృహ నిర్మాణ కాలనీలో మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో 116 ఎకరాల్లో నిర్మిస్తున్న 2,160 ఇళ్ల కేటాయింపునకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఈ నెల 20న లబ్ధిదారులకు కేటాయింపు పత్రాలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు మంత్రి వెల్లడించారు.

**ఇళ్లతోపాటు అన్ని వసతులు కల్పించాలి**

కాలనీ నిర్మాణ పనుల పురోగతిపై గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఇతర అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. లబ్ధిదారులు నివాసం ఉండేందుకు సిద్ధమయ్యే సమయానికి తాగునీరు, విద్యుత్, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పారిశుధ్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు. పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం, వైద్య సదుపాయాలు, పిల్లల కోసం ఆటస్థలాలు, ఉమ్మడి అధ్యయన గదులు ఏర్పాటు చేసే అంశాలపై దృష్టి పెట్టాలని సూచించారు.

**అర్హుల ఎంపికలో పారదర్శకతకు ప్రాధాన్యం**



ఇళ్ల కేటాయింపులో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా అర్హులైన కుటుంబాలకే ఇళ్లు దక్కేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. లబ్ధిదారుల జాబితాను మరోసారి పరిశీలించి, ఆధారాలతో వచ్చే అభ్యంతరాలను స్వీకరించాలని సూచించారు. అవసరమైతే లబ్ధిదారుల సమక్షంలో కంప్యూటర్ ఆధారిత లాటరీ ద్వారా కేటాయింపులు చేపట్టే అవకాశాన్ని పరిశీలించాలని తెలిపారు.

**ఏళ్ల నిరీక్షణకు తెరపడేనా?**

2011--12లో ప్రారంభమైన రామస్వామిగుట్ట గృహ నిర్మాణ ప్రాజెక్టు మధ్యలో కొన్నేళ్లపాటు నిలిచిపోయింది. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం పనులు





తిరిగి ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం నిర్మాణాలు తుది దశకు చేరుకోవడంతో ఇళ్ల కేటాయింపుపై అధికారులు దృష్టి సారించారు. కాలనీ అందుబాటులోకి వచ్చిన తర్వాత చెత్త సేకరణ, వ్యర్థాల నిర్వహణ, పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరిగేలా మున్సిపాలిటీ, నివాసితుల సంక్షేమ సంఘం సమన్వయంతో పనిచేయాలని మంత్రి సూచించారు. పేద కుటుంబాలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేలా కాలనీని అన్ని సౌకర్యాలతో తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# సదాశివపేట పట్టణం లోని సిద్దాపూర్ రోడ్డుకు శాశ్వత పరిష్కారం చూపాలి: జగ్గారెడ్డి, నిర్మల

**కూల్చివేతలు లేకుండా, పాన్ షాప్ లు, పూల దుకాణాలు,మటన్,చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మించాలి**

**అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులకు సూచన**

**సదాశివపేట అక్టోబర్10:**సదాశివపేట పట్టణంలోని సిద్దాపూర్ రోడ్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అధికారులను ఆదేశించారు. నిర్మల జగ్గారెడ్డితో కలిసి ఆయన సిద్దాపూర్ రోడ్డును పరిశీలించారు. ఆర్అండ్‌బీ, ఇరిగేషన్, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ అధికారులతో రోడ్డు నిర్మాణం, వర్షపు నీటి పారుదల, కల్వర్టులు, డ్రైనేజీ పనులపై సమీక్ష నిర్వహించారు.మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ కాలనీ చివరి వరకు పలుమార్లు పనులు చేపట్టినా రోడ్డు సమస్య పరిష్కారం కాకపోవడంపై జగ్గారెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు సిద్దాపూర్ రోడ్డు వేయించానని గుర్తుచేశారు. గత పదేళ్లలో ఈ రోడ్డు విషయంలో ఏం జరిగిందో తెలియదన్నారు. ఇకపై సిద్దాపూర్ రోడ్డు సమస్య పదేపదే చర్చకు రాకుండా పటిష్ఠంగా పనులు చేపట్టాలని సూచించారు.మెయిన్ రోడ్డు నుంచి సిద్దాపూర్ ఈద్గా వరకు సుమారు 1.5 కిలోమీటర్ల మేర పూర్తిస్థాయిలో సీసీ రోడ్డు నిర్మాణానికి అంచనాలు సిద్ధం చేయాలని తెలిపారు. డిగ్రీ కళాశాల నుంచి మెయిన్ రోడ్డు జంక్షన్ వరకు సాంకేతికంగా సరైన లెవల్స్ తీసుకుని, వరద నీరు, డ్రైనేజీ నీరు సక్రమంగా వెళ్లేలా రోడ్డు నిర్మించాలని స్పష్టం చేశారు. రోడ్డు ప్రారంభం నుంచి చివరి వరకు ఎక్కడా వర్షపు నీరు నిలవకుండా డ్రైన్లు, అవసరమైన చోట్ల కల్వర్టులు ఏర్పాటు చేయాలన్నారు. కల్వర్టులు అవసరమైన ప్రాంతాలను జగ్గారెడ్డి, నిర్మల స్వయంగా పరిశీలించారు.రోడ్డు వెడల్పు, అందుబాటులో ఉన్న స్థలాన్ని టేపుతో కొలిచి మరీ పరిశీలించారు.కూల్చివేతలు లేకుండా పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. 30 అడుగుల వెడల్పు ఉన్నచోట 30 అడుగులు, 40 అడుగులు ఉన్నచోట 40 అడుగులు, 60 అడుగులు అందుబాటులో ఉన్నచోట 60 అడుగుల మేర రోడ్డు నిర్మించాలని చెప్పారు. తనకు తెలియజేయకుండా సిద్దాపూర్ రోడ్డులో ఏ డబ్బానూ తొలగించవద్దని స్పష్టం చేశారు. చిరు వ్యాపారులు, పాన్‌షాపులు, పూల దుకాణాలు, మటన్, చికెన్ దుకాణాలకు ఇబ్బంది కలగకుండా పనులు జరగాలన్నారు.సిద్దాపూర్ కూడలిలో ప్రజలకు, వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా జంక్షన్ అభివృద్ధి చేయాలని సూచించారు. మధ్యలో విగ్రహం ఏర్పాటుకు అనువుగా సర్కిల్ రూపకల్పన చేయాలని చెప్పారు. రోడ్డు పనులకు అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తరలించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.సిద్దాపూర్ రోడ్డు పనులకు సంబంధించి రూ.2 కోట్ల నిధులు మిగిలి ఉన్నాయని, మున్సిపాలిటీలో టీఎఫ్ఐడీసీకి చెందిన మరో రూ.5 కోట్ల నిధులు కూడా అందుబాటులో ఉన్నాయని సమీక్షలో ప్రస్తావించారు. కలెక్టర్‌తో సమావేశం అనంతరం సంబంధిత శాఖల సమన్వయంతో పనులను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.



సరైన లెవల్స్, డ్రైన్లు, కల్వర్టులతో కూడిన 1.5 కిలోమీటర్ల సీసీ రోడ్డు నిర్మాణానికి అక్టోబర్ 30లోగా అంచనాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు.పట్టణం, మండలంలోని సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు రోజూ ఒక ప్రాంతంలో పర్యటిస్తానని జగ్గారెడ్డి తెలిపారు. త్వరలో ఊబ చెరువును పరిశీలిస్తానన్నారు.

# పదేళ్ల ప్రగతికి కేసీఆరే కారణం!

**జిల్లా దశాబ్ది వేడుకల్లో బొల్లం మల్లయ్య యాదవ్ వ్యాఖ్యలు.. కాంగ్రెస్ పాలనపై విమర్శలు**

**2కే రన్‌లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే.. రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీత**

**సూర్యాపేట, అక్టోబర్ 10 (స్కై న్యూస్):** తెలంగాణలో పదేళ్ల అభివృద్ధి, సంక్షేమానికి కేసీఆర్ నాయకత్వమే ప్రధాన కారణమని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. సూర్యాపేట జిల్లా ఆవిర్భావం పదేళ్లు పూర్తయిన సందర్భంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో నిర్వహించిన దశాబ్ది వేడుకల్లో భాగంగా జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ అధ్యక్షతన జరిగిన 2కే రన్‌లో ఆయన పాల్గొన్నారు.

**జిల్లాల ఏర్పాటు నుంచి సాగునీటి ప్రాజెక్టుల వరకు..**

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనతో పాటు పరిపాలనను ప్రజలకు చేరువ చేసేందుకు కేసీఆర్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణ చేపట్టిందని పేర్కొన్నారు. సాగునీటి ప్రాజెక్టులు, వ్యవసాయ రంగ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో రాష్ట్రంలో అనేక మార్పులు తీసుకొచ్చిందని అన్నారు. గతంలో ఉపాధి కోసం వలసలు వెళ్లాల్సిన పరిస్థితుల నుంచి తెలంగాణ వ్యవసాయ



రంగంలో పురోగతి సాధించిందని పేర్కొన్నారు.

**రైతుల ఇబ్బందులపై కాంగ్రెస్ ప్రభుత్వానికి విమర్శలు**

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతులు విద్యుత్ సరఫరా, యూరియా కొరత వంటి సమస్యలను ఎదుర్కొంటున్నారని బొల్లం మల్లయ్య యాదవ్ ఆరోపించారు. పంటల కొనుగోళ్లు, మద్దతు ధర విషయంలోనూ రైతులకు ఇబ్బందులు



ఎదురవుతున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కొనసాగించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమవుతోందని వ్యాఖ్యానించారు. తెలంగాణ అభివృద్ధి, సంక్షేమంపై గత పదేళ్లలో చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తుత పరిస్థితులతో ప్రజలు బేరీజు వేసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం

**హైద్రాబాద్ అక్టోబర్ 10:**భారత్ స్కాట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపక దినోత్సవం, ఫ్లాగ్ డేను హైద్రాబాద్ జిల్లా స్కాట్స్ అండ్ గైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెండా స్టిక్కర్లును జిల్లా స్కాట్స్ అండ్ గైడ్స్ అసోసియే షన్ కమిషనర్(బాలురు) బి.వెంకటేశ్వర్లు, గర్ల్స్ కమిషనర్ అనీల చేతుల మీద ఫ్లాగ్ స్టిక్కర్స్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ,స్కాట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమం, హైద్రాబాద్ జిల్లా వ్యాప్తంగా స్కాట్స్ అండ్ గైడ్స్ మూడు రోజుల టెస్టింగ్ క్యాంప్తో పాటు ర్యాలీ క్యాంప్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. హైద్రాబాద్ జిల్లాలో నూతనంగా ఆమోదం లభించిన ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, స్కాట్ మాస్టర్ అండ్ గైడ్ కెప్టెన్ పేర్లను త్వరలో నమోదు చేసుకుని



వారికి దసరా సెలువు అనంతరం శిక్షణ అందించేం దుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్కాట్స్ అండ్ గైడ్స్ అధికారులు లక్ష్మణ్ నాయక్, అనిత, మోహన్, రాములు నాయక్, హేమా ప్రియదర్శిని, దీపిక తదితరులు



పాల్గొన్నారు.

# ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత..

**లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే కసిరెడ్డి**



**ఆమనగల్లు, అక్టోబర్ 10 (స్కై న్యూస్):**ప్రజల ఆరోగ్య సంరక్షణకే రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు.శనివారం కల్వకుర్తి నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన అనారోగ్య బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను, ఎల్ఓసీ పత్రాలను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందులతో వైద్యం అందక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. అనారోగ్యంతో బాధపడే ప్రతి ఒక్కరూ సీఎంఆర్ఎఫ్ ను సద్వినియోగం చేసుకొని తమ ఆరోగ్యాలను పరిరక్షించుకోవాలని కోరారు.ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, కార్పొరేట్ ఆసుపత్రులలో కూడా పేదలు ఉచితంగా వైద్యం పొందేలా ఎల్ఓసీలను మంజూరు చేస్తోందని తెలిపారు. తన దృష్టికి వచ్చిన ప్రతి అనారోగ్య బాధితుడికి సీఎంఆర్ఎఫ్ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంటలు ఎండుతున్నా.. పాలకులకు చలనం లేదా?

**నీరు, నాణ్యమైన కరెంటు కోసం రైతుల ఆందోళన**

**గొండ్రియాలలో ట్యాంక్ ఎక్కి నిరసన.. ఎండిన పొలాల్లో బైక్‌లతో వినూత్న ప్రదర్శన**



**అనంతగిరి, అక్టోబర్ 10 (స్కై న్యూస్):** పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నా సాగునీరు, నాణ్యమైన విద్యుత్ అందడం లేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొండ్రియాల గ్రామంలో రైతులు వినూత్న రీతిలో నిరసన తెలిపారు. నీటి ట్యాంక్ ఎక్కి తమ సమస్యలను చాటిచెప్పడంతోపాటు, ఎండిపోయిన పంట పొలాల్లో ద్విచక్ర వాహనాలు నడుపుతూ ఆవేదనను వ్యక్తం చేశారు.

**12 గంటల విద్యుత్ సరఫరా చేయాలి**

వ్యవసాయానికి రోజుకు కనీసం 12 గంటలపాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాల కారణంగా మోటార్లు పనిచేయక సాగునీరు అందడం లేదని, దీంతో పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**పంటలను కాపాడేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలి**

అధికారులు వెంటనే స్పందించి విద్యుత్ సరఫరాను మెరుగుపరచాలని, సాగునీటి సమస్యలను పరిష్కరించాలని రైతులు కోరారు. ముఖ్యంగా చిన్న, సన్నకారు రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. సాగు చేసిన పంటలు చేతికందేలా అవసరమైన సహాయం అందించాలని డిమాండ్ చేశారు.

# పూల పండుగకు కోదాడ సిద్ధం!

**బతుకమ్మ సంబరాలకు ఆడపడుచులకు ఆహ్వానం.. మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ**



**కోదాడ, అక్టోబర్ 10 (స్కై న్యూస్):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలకు కోదాడ పట్టణం ముస్తాబవుతోంది. కోదాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని బాయ్స్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించనున్న సంబరాలకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏర్పాట్లను మున్సిపల్ చైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ శనివారం పరిశీలించారు.

**తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయ వేడుక బతుకమ్మ**

ఈ సందర్భంగా కుసుమ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ మహిళల ఐక్యతకు, తెలంగాణ సంప్రదాయాల వైభవానికి ప్రతీక అని పేర్కొన్నారు. తంగేడు, గునుగు, బంతి, చామంతి తదితర రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, గౌరమ్మను పూజిస్తూ పాటలు, ఆటలతో సంబరాలు జరుపుకోవడం తరతరాలుగా వస్తున్న గొప్ప సంప్రదాయమని తెలిపారు. ప్రకృతితో మానవ జీవనానికి ఉన్న అనుబంధాన్ని బతుకమ్మ పండుగ చాటిచెబుతుందని అన్నారు.

**పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాలి**

కులమతాలకు అతీతంగా మహిళలంతా ఒక్కచోట చేరి ఆనందోత్సాహాలతో జరుపుకునే బతుకమ్మ వేడుకల్లో కోదాడ పట్టణంలోని మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని చైర్‌పర్సన్ పిలుపునిచ్చారు. పండుగను సంప్రదాయబద్ధంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నూనె సులోచన, కౌన్సిలర్లు వంగూరి గోపి, కొల్లు చత్రయ్య, మందలపు శేషయ్య, మైలారి శెట్టి భాస్కర్, మల్లె కొండలు, ఎర్నేని రత్నకుమార్, రామచంద్రరావు, మున్సిపల్ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సోలార్ తో విద్యుత్ బిల్లులకు చెక్

## పీఎం సూర్య ఘర్ పథకం సద్వినియోగం చేసుకోండి.. ఎస్ఈ విజయేందర్ రెడ్డి




**కరీంనగర్,అక్టోబర్ 08 (స్కై న్యూస్)** గృహ విద్యుత్ వినియోగదారులు తమ ఇళ్లపై రూఫ్‌టాప్ సోలార్ ను ఏర్పాటు చేసుకుని, కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఏ విజయేందర్ రెడ్డి కోరారు. ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవడంతో పాటు సౌర విద్యుత్ ద్వారా ఇంటి అవసరాలకు అవసరమైన విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకునేందుకు పీఎం సూర్య ఘర్--ముఫ్త్ బిజ్లీ యోజన పథకం సద్వినియోగపరచుకోవలసిందిగా కోరారు... ఇళ్ల పైకప్పులపై రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా సూర్యరశ్మి సహాయంతో విద్యుత్‌ను ఉత్పత్తి చేసుకోవచ్చున్నారు. దీనివల్ల గ్రిడ్ నుంచి తీసుకునే విద్యుత్ వినియోగం తగ్గి, నెలవారీ విద్యుత్ బిల్లుపై గణనీయమైన ఆదా పొందే అవకాశం ఉందన్నారు. సోలార్ ప్లాంట్ సామర్థ్యం, ఇంటి విద్యుత్ వినియోగం, సౌర విద్యుత్ ఉత్పత్తి బట్టి విద్యుత్ బిల్లు జీరోకు చేరే అవకాశం కూడా ఉంటుందని వివరించారు అంతేకాకుండా బ్యాంకులు కూడా రుణ చదువు ఉపాయాన్ని కల్పిస్తున్నాయని , నెలవారి చెల్లించే సదుపాయం కూడా అందుబాటులో ఉందని చెప్పారు.పీఎం సూర్య ఘర్ పథకం కింద అర్హులైన గృహ వినియోగదారులకు రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోంది.1 కిలోవాట్ సోలార్ ప్లాంట్‌కు: రూ.30,000 సబ్సిడీ,2 కిలోవాట్ల సోలార్ ప్లాంట్‌కు రూ.60,000 సబ్సిడీ,3 కిలోవాట్లు లేదా అంతకంటే ఎక్కువ సామర్థ్యానికి: గరిష్ఠంగా రూ.78,000 సబ్సిడీ ఈ రాయితీల వల్ల సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అయ్యే వ్యయం తగ్గుతుంది. 3 కిలోవాట్ల రూఫ్‌టాప్ సోలార్ ప్లాంట్ ద్వారా అనుకూల పరిస్థితుల్లో నెలకు 360 యూనిట్ల పై మేరకు విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుంది. అయితే వాతావరణ పరిస్థితులు, పైకప్పుపై సూర్యరశ్మి లభ్యత, ప్లాంట్ పనితీరు ఆధారంగా ఉత్పత్తి మారుతుందన్నారు. ఇంటి విద్యుత్ వినియోగం సోలార్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌కు అనుగుణంగా ఉంటే విద్యుత్ బిల్లును గణనీయంగా తగ్గించుకోవచ్చున్నారు. అంతేకాకుండా అర్హులైన గృహ వినియోగదారులు కేంద్ర ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ **https://pmsuryaghar.gov.in** ద్వారా పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్, ఆమోదిత విక్రేత ఎంపిక, సోలార్ ప్లాంట్ ఏర్పాటు, తనిఖీ, నెట్ మీటరింగ్, సబ్సిడీ పొందే ప్రక్రియను పథకం మార్గదర్శకాల ప్రకారం పూర్తి చేయాలి అని సూచించారు..సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునే ముందు తమ ఇంటి విద్యుత్ వినియోగం, అవసరమైన ప్లాంట్ సామర్థ్యం, పైకప్పుపై అందుబాటులో ఉన్న స్థలం, మొత్తం వ్యయం, సబ్సిడీ అర్హత వివరాలను పరిశీలించుకోవాలని సూచించారు.రూఫ్‌టాప్ సోలార్ వినియోగం ద్వారా సంప్రదాయ విద్యుత్ వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు కూడా తోడ్పడవచ్చు. ప్రతి అర్హమైన గృహ వినియోగదారుడు పీఎం సూర్య ఘర్ పథకాన్ని ద్వారా అందుబాటులో ఉన్న ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఈ కోరారు.

# తెలంగాణ సంస్కృతికి సజీవ సాక్ష్యం! బతుకమ్మ

ప్రొఫెసర్ లిల్లీ మేరీ



**హైదరాబాద్ అక్టోబర్ 10:** ఆశ్వీయుజ శుద్ధ పాడ్యమికి ముందురోజు వచ్చే అమావాస్య రోజున ఎంగిలి పూల బతుకమ్మ పేరుతో ప్రారంభమై దుర్గాష్టమి రోజున సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది అని బాలారిష్టాలు, కలరా, మలేరియా, ప్లేగు వంటి మహమ్మారి రోగాల నుండి పిల్లా పాపలను, కరువు కాటకాల నుండి ప్రజలను కాపాడి బతుకును ఈయమ్మా అని ప్రజలు ప్రకృతి గౌరీని తమ సాధారణ ఆటపాటలతో పూజించే వేడుకే బతుకమ్మ పండుగ అని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ లిల్లీ మేరి అన్నారు. తెలంగాణ పల్లెల్లోని ప్రతీ ఒక్క ఆడపడుచు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూసే ఈ బతుకమ్మ పండుగ యువతులు, ముత్తైదువులు సాంప్రదాయం ఉట్టిపడేలా తయారయ్యి ఊరంతా ఒకటయ్యి తమలో బీదా గొప్పా వర్ణం వర్గం అంతా ఒకటే అంటూ జరుపుకునే పల్లె ప్రజల సాంస్కృతిక పండుగ ఇది. మంచి వర్షాలతో వరుణ దేవుడు అనుగ్రహించి అన్నపూర్ణమ్మ దయతో వ్యవసాయం అభివృద్ధి చెంది రైతు జీవితం కళకళలాడుతూ ఉండాలని, ఊరంతా పచ్చగా ఉండాలని ఆకాంక్షిస్తూనే యువతులు ముత్తైదువులు రంగు రంగు పువ్వులతో బతుకమ్మను తీర్చిదిద్ది అందులో గౌరమ్మను పెట్టి పూజించి ఊరంతా ఒక్క చోట గుమిగూడి పల్లె ప్రజల జీవితాలను కష్టసుఖాలను పాటలరూపంలో ప్రకృతి గౌరికి విన్నవించుకుంటారు అని ప్రొఫెసర్ లిల్లీ మేరి పేర్కొన్నారు.

# హనుమాస్పల్లి శ్రీ రామేశ్వర వీరాంజనేయ స్వామి క్షేత్రంలో శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం...

## ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం మాజీ జెడ్పీటీసీ జర్పుల దశరథ్ నాయక్ పాల్గొన్నారు

## భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, భక్తులు

**ఆమనగల్లు, అక్టోబర్ 10(స్కై న్యూస్):** కడ్తాల్ మండల పరిధిలోని హనుమాస్పల్లి గ్రామపంచాయతీ లో వెలిసిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో శనివారం భక్తి వాతావరణం సంతరించుకుంది. ఆలయ సాంప్రదాయం ప్రకారం ఇక్కడ ప్రతి నెల రెండవ శనివారం నిర్వహించే స్వామివారి ప్రత్యేక రథం ఈరోజు స్థానిక సర్పంచ్ శీను నాయక్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగింది.సర్పంచ్ శీను నాయక్ ప్రత్యేక ఆహ్వానం మేరకు ఈ ఆధ్యాత్మిక వేడుకకు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రాష్ట్ర ఫుడ్ కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కడ్తాల్ మాజీ జెడ్పీటీసీ,రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జర్పుల దశరథ్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ రాష్ట్రపు కార్పొరేషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి కల్వకుర్తి మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం కు సర్పంచ్, ఆలయ నిర్వాహకులు సాదర స్వాగతం పలికారు. అనంతరం వారు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు,అభిషేకాలునిర్వహించారు వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ సర్వాంగ సుందరంగా అలంకరించిన స్వామివారి ఉత్సవ విగ్రహ రథం సేవలో పాల్గొని, మంగళహారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణమంతా భక్తుల జయజయధ్వానాలు,ఆంజనేయ నామస్మరణలతో మారుమోగింది.

**ఆధ్యాత్మికతతోనే గ్రామాల్లో ప్రశాంతత, ఐక్యత**

అనంతరం మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ హన్మాస్పల్లి గ్రామంలో ప్రతి నెల నియమబద్ధంగా, ఇంతటి నిష్ఠతో ఆంజనేయ స్వామి రథం కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషకరం. గ్రామాల్లో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుపుకోవడం వల్ల ప్రజలందరికీ శుభం కలుగుతుంది. ఈ వేడుకలు గ్రామ ప్రజల మధ్య ఐక్యతను, సోదరభావాన్ని మరింత పెంపొందిస్తాయి" అని కొనియాడారు.ఆంజనేయ స్వామివారి కృపతో కడ్తాల్ మండల ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. తన ఆధ్వర్యంలోని రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు అందిస్తు హనుమస్పల్లి గ్రామంలో జరిగే ఎలాంటి సామాజిక,ఆధ్యాత్మికకార్యక్రమాలకైనా తన వంతు సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నీలా లక్ష్మారెడ్డి మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్ సర్పంచులు



నరసింహ గౌడ్ మహేష్ కల్వకుర్తి కౌన్సిలర్ రాము నాయక్ మాజీ సర్పంచులు లక్ష్మీ నరసింహ రెడ్డి పోతుగంటి శంకర్ చందు నాయక్ తెలంగాణ యువజన సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్ ఉప సర్పంచ్ మహేష్ యాదవ్ వాటి సభ్యులు ప్రశాంత్ దేవుల జగన్ గౌడ్ పద్మరాజు గౌడ్ రేణుక శివ నాయక్ నాయకులు శాంతి కిషన్ కృష్ణయ్య శ్రీరాములు నరసింహ గౌడ్ మహేష్ రామకృష్ణ వెంకటేష్ జగన్ నాయకులు ప్రజాప్రతినిధులు ఆలయ నిర్వాహకులు, పాల్గొన్నారు.

# మానసిక రోగ వ్యక్తుల పట్ల అవగాహన



**అమరాబాద్ స్కై న్యూస్ అక్టోబర్ 10** శనివారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి సుధాకర్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు మానసిక ఆరోగ్యం పై శనివారం అవగాహన కల్పించారు ఈ సందర్భంగా గ్రామస్తులతో కలిసి ప్రధాన కూడలిలో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భాన్ని ఉద్దేశించి శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన కూడలిలో ప్రజలకు వైద్యాధికారి పలు సూచనలు చేశారు మానసిక ఆరోగ్యం శారీరక ఆరోగ్యంతో సమానమని అన్నారు మానసిక వ్యాధితో బాధపడుతున్న వారిని తక్కువ చేసి మాట్లాడడం మంచిది కాదన్నారు వాళ్ళ ప్రవర్తన మాటలను ఓపికగా విని ప్రోత్సహించినట్లయితే వారికి సహాయం చేసిన వారు అవుతామని అన్నారు మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకొనడానికి ప్రతినిత్యం శారీరక వ్యాయామంతో పాటు యోగ ధ్యానం చేయాలి రోజులో 7 నుంచి 9 గంటల పాటు ఆరోగ్యకరంగా నిద్రించాలి ఇలాంటి కొన్ని జాగ్రత్తలు ఇలాంటి కొన్ని జాగ్రత్త చర్యలు పాటించినట్లయితే మానసిక వ్యాధి నుంచి ఉపశమనం పొందవచ్చునని డాక్టర్ సుధాకర్సూచించారు కార్యక్రమంలో వైద్య అధికారులు అరుణ క్రాంతి రవితేజ భవితేజ గోవయ్య శైలజ హెల్త్ సూపర్వైజర్ మార్తమ్మ వైద్య సిబ్బంది రేనమ్మ అమీనా బేగం తదితరులు పాల్గొన్నారు

# మాలలను తక్షణమే బి గ్రూపులో చేర్చాలి



**సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ డిమాండ్**

**హైద్రాబాద్ అక్టోబర్ 10:** మాలలను తక్షణమే బి గ్రూపులో చేర్చాలని సెంటర్ ఫర్ బెటర్ ఇండియా రిసెర్చ్ ఫౌండేషన్ డైరెక్టర్ మామిడి నారాయణ డిమాండ్ చేశారు.శనివారం భాషేర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో ప్రొఫెసర్స్ డాక్టర్ ప్రభాకర్,ప్రొఫెసర్ డేవిడ్ తో కలిసి మాట్లాడారు.గడచిన 32 సంవత్సరాలుగా నిత్యం మాలలపై విషం చిమ్ముతూ బతికే మందకృష్ణ పద్మశ్రీ పురస్కారం పొందిన తర్వాత కూడ అబద్దాలు ఆడటం మానడం లేదని విమర్శించారు. వర్గీకరణ విషయంలో ఉమ్మడి రాష్ట్రంలో మాదిగలకు 7% ఉండేది. మాదిగలకు ప్రస్తుతం తెలంగాణలో 9%, ఆంధ్రపదేశ్ లో 6.5% రెండు కలుపగ 15.5% వస్తున్నాయి. కాని రెండు రాష్ట్రాలలోని మొత్తం 14% దటకూడదు. ఉష మెహ్రా కమీషన్ ప్రకారం తెలంగాణలో మాదిగలకన్న మాలలు వెనుకబడి ఉన్నారన్న విషయం తొక్కిపెట్టించి ప్రభుత్వాన్ని బ్లాక్ మెయిల్ చేసి బి గ్రూపులోకి రావలసిన మాలలను కాదని మాదిగలను బి గ్రూపులో చేర్పించుకున్నాడన్నారు ఎదిగిన కొద్ది పరిపక్వతతో మాట్లాడవలిసినది పోయి కాకి లెక్కలు అబద్దపు ప్రచారాలు కొనసాగించడం అభ్యంతరకరం. ఆయన లెక్క ప్రకారం కడియం కావ్య మాదిగ కానప్పుడు తెలంగాణ రాష్ట్రంలో కేవలం అచ్చంపేట ఎంఎల్ఎ వంశీ కృష్ణ ఎంఎల్ సి గోరేటి వెంకన్న మాత్రమే మాలలని మిగితావారు కులాంతర వివాహాలు చేసుకొని సామాజిక వివక్షను దాటిఉన్నారని తెలుసుకోవాలని వాస్తవాలు గ్రహించి అబద్దాలు ప్రచారం చేయడం మానుకోవాలని వారు సూచించారు..

# సుజాతనగర్‌కు తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరు

## జీవో 187తో రూ.8.75 కోట్ల నిధులు

## నర్సరీ నుంచి ఇంటర్ వరకు ఉచిత ఇంగ్లీష్ విద్య

## కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు

**సుజాతనగర్ అక్టోబర్ 10( స్కై న్యూస్):** సుజాతనగర్ మండల కేంద్రానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ మంజూరైందని, దీని ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య చేరువవుతుందని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఎన్నో ఏండ్లుగా ఈ ప్రాంత ప్రజలు కోరుకుంటున్న విద్యా వసతుల కల్పన కోసం గత నెల రోజులుగా విద్యాశాఖ ఉన్నతాధికారులు, డైరెక్టర్లతో నిరంతరం సంప్రదింపులు జరపడంతో జీవో నెంబర్ 187 ద్వారా పాఠశాల మంజూరైందని చెప్పారు. పాఠశాల అభివృద్ధి పనుల నిమిత్తం రూ.8.75 కోట్ల నిధులు కేటాయించినట్లు పేర్కొన్నారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఉచితంగా ఇంగ్లీష్ మీడియంలో విద్యాబోధన సాగుతుందని, ప్రస్తుతం స్టేట్ సిలబస్‌తో మొదలై భవిష్యత్తులో సెంట్రల్ సిలబస్ (సీబీఎస్ఈ) ప్రవేశపెట్టే యోచన ఉందని స్పష్టం చేశారు.పాఠశాలలో అత్యాధునిక సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, లైబ్రరీ, అడ్మినిస్ట్రేషన్ గదులు, టాయిలెట్లు, 97 డ్యూయల్ డెస్క్ బెంచీలు, క్రీడా మైదానాలు నిర్మిస్తామన్నారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో కూడిన అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ అందించేలా చర్యలు ఉంటాయన్నారు. రాబోయే నాలుగు-ఐదు రోజుల్లోనే ప్రజాప్రతినిధుల సమక్షంలో పాఠశాల పనులకు శంకుస్థాపన చేస్తామని ప్రకటించారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టుకు గతంలోనే సూత్రప్రాయ ఆమోదం లభించినా, సాంకేతిక కారణాలు, భూసేకరణ ఆలస్యం వల్ల కొంత వెనుకబడిందని, పట్టువదలకుండా ప్రయత్నించి జిల్లాకు ఎయిర్‌పోర్ట్, పరిశ్రమలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నాయకులగూడెం నుంచి సుజాతనగర్ వరకు సెంట్రల్ లైటింగ్‌తో కూడిన నాలుగు లైన్ల రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామన్నారు. సుజాతనగర్ మెయిన్



రోడ్డుకు ఇరువైపులా డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టడంతో పాటు పాత పంచాయతీ ఆఫీస్ స్థలంలో మోడల్ కమ్యూనిటీ హాల్ నిర్మిస్తామని తెలిపారు. మహిళలకు స్థానికంగా ఉపాధి కల్పించేందుకు రవి, పాపారావులతో కలిసి 300 మందికి గృహ పరిశ్రమల ద్వారా పని కల్పిస్తున్నామని వివరించారు.ఈ ప్రాంతంలో కూరగాయలు, మిర్చి సాగు అధికంగా ఉన్నందున కోల్డ్ స్టోరేజీ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ఆసక్తి చూపుతున్నారన్నారు. సుజాతనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనం కావడం, నాన్-షెడ్యూల్డ్ భూములు అందుబాటులో ఉండటంతో పారిశ్రామిక అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, ప్రజలు ఐక్యంగా సహకరించాలని కూనంనేని కోరారు. విలేకరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, కాంగ్రెస్ నాయకులు నాగ సీతారాములు కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, డీఈవో వెంకటేశ్వరరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ లాల్ సింగ్ గ్రంధాలయ చైర్మన్ వీరబాబు, నాయకులు వాసిరెడ్డి మురళి భూక్య దస్రు, సిపిఐ మిత్రపక్షల నాయకులు కోమారి హన్మంతరావు, జక్కుల రాములు, రామ్మూర్తి, రాజగోపాల్, వెంకటేశ్వరరావు, ధర్మారావు, అజయ్, రాజశేఖర్, జగన్, కామేష్, ఉపేందర్, శ్రావణి, అనిత, రవి, పండు, తిరుపతిరెడ్డి, బందగి, రాంప్రసాద్, భద్రరావు, భూక్య శ్రీను, వెంకట్, అనిల్, మౌలానా, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ తో ఎన్నికలు



**విజయవాడ, అక్టోబరు 11:**ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా కీలక ప్రకటన చేశారు. విజయవాడ వేదికగా పంచాయతీరాజ్, మున్సిపల్, రెవెన్యూ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఎన్నికల రోడ్‌మ్యాప్‌ను స్పష్టం చేశారు. ఈ దఫా స్థానిక సమరాన్ని బ్యాలెట్ పేపర్ల ద్వారానే నిర్వహించనున్నట్లు పునేఠా అధికారికంగా వెల్లడించారు. బ్యాలెట్ బాక్సుల లభ్యత, ముద్రణ, భద్రతా ఏర్పాట్లపై ఇప్పటికే క్షేత్రస్థాయి యంత్రాంగానికి స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశామని, ఎన్నికల నిర్వహణకు కమిషన్ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోందని స్పష్టం చేశారు.ఓటర్ల జాబితా రూపకల్పనపై ఎస్ఈసీ ప్రకటన చేశారు. 2026 ఫిబ్రవరి నాటికి సిద్ధమయిన తుది ఓటర్ల జాబితానే ఈ స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రాతిపదికగా తీసుకోనున్నట్లు పునేఠా ప్రకటించారు. అర్హులైన కొత్త ఓటర్లందరికీ ఓటు హక్కు కల్పించేలా, డూప్లికేట్ ఎంట్రీలు లేకుండా పకడ్బందీగా ఈ లిస్టులను రూపొందించాలని జిల్లా కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల వారీగా ఓటర్ల జాబితాల పునర్విభజన ప్రక్రియను ఎటువంటి తప్పిదాలు లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఉన్నతాధికారులకు దిశానిర్దేశం చేశారు.ప్రస్తుతం స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు, ఇతర అంశాలపై సుప్రీంకోర్టులో నడుస్తున్న న్యాయపరమైన ప్రక్రియను కమిషన్ నిశితంగా పరిశీలిస్తోందని ఎస్ఈసీ తెలిపారు. సుప్రీంకోర్టు నుంచి తుది తీర్పు , స్పష్టమైన ఆదేశాలు వెలువడిన వెంటనే ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా శాంతిభద్రతల పరిరక్షణ, భద్రతా బలగాల మోహరింపును దృష్టిలో ఉంచుకుని స్థానిక పోరును ఏకకాలంలో కాకుండా విడతల వారీగా నిర్వహించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు స్పష్టం చేశారు. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికల దశలను పక్కా ప్రణాళికతో చేపట్టేలా కసరత్తు చేస్తున్నామన్నారు.ఉన్నతాధికారుల సమీక్షలో ఎన్నికల ఏర్పాట్లు, నిధుల సమీకరణ, సిబ్బంది శిక్షణ వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. అధికార యంత్రాంగం నిష్పాక్షికంగా, పారదర్శకంగా వ్యవహరించాలని, ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రతి ప్రక్రియ చట్టబద్ధంగా సాగేలా గట్టి నిఘా ఉంచాలని పునేఠా స్పష్టం చేశారు. న్యాయస్థానం వైపు నుంచి గ్రీన్ సిగ్నల్ రావడమే తరువాయి.. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేసేందుకు అన్ని శాఖలు సమన్వయంతో సిద్ధంగా ఉండాలని ఆదేశించడంతో వచ్చే రెండు, మూడు నెలలు స్థానిక ఎన్నికల హంగామా కనిపించనుంది.



## బంతిపూల సాగు..
# భలే బాగు..

**తరతరాల జ్ఞాపకాల వారధి పెత్తర అమావాస్య**
**రవాణా సౌకర్యాలు లేక ఇబ్బందులు**
**బంతి రైతుకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు**

**ఇల్లంతకుంట(కరీంనగర్):**సంప్రదాయ పంటలకు భిన్నంగా బంతిపూలను సాగుచేస్తూ రైతులు ఆదాయం పొందుతున్నారు. కొద్దిమొత్తం పెట్టుబడి, తక్కువ నీటి వినియోగం ఉండే బంతితోటలు సాగుచేయడానికి కొందరు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక, మహిళలకు ప్రీతి పాత్రమైన బతుకమ్మ పండుగకు బంతిపూలు ఇంటింటా అవసరం. మండలంలోని ముస్కాని పేట, కేసన్నపల్లె, గాలిపెల్లి, ఎర్రనర్సుపల్లె, సిరి కొండ, ఇల్లంతకుంట తదితర గ్రామా లలోని రైతులు 23ఎకరాల విస్తీర్ణంలో బంతిపూలను సాగుచేశారు. మూడు నెలల్లో పూలు చేతికి వస్తాయి. ఎకరానికి దాదాపుగా రూ.20 వేలు వెచ్చిస్తే రెండింతల

లాభం వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. భూమిని చదును చేసి బంతిపూల నారు నాటాలి. నీటి వినియోగం తక్కువ కాగా చీడపీడలు వస్తే మందు లు పిచికారి చేయాల్సి ఉంటుంది. బతుకమ్మ పండుగ వచ్చిందంటే రైతులు పూలు తెంపే పనిలో నిమగ్నం అవుతారు. బతుకమ్మ పండుగ నుంచి మొదలుకొని దీపా వళి వరకు అమ్మకాలు ఉంటాయని రైతులు అంటున్నారు. కిలోకు ఒక్కొక్కసారి రూ.130 సైతం వస్తుందని ఇలాంటప్పుడు అదనంగా లాభం వస్తుందని అంటున్నారు. సరైన రవాణా సౌకర్యాలు లేక ప్రతి సంవత్సరం ఇబ్బంది పడుతున్నామని, ప్రభుత్వం ప్రోత్సహిస్తే మరింత మంది రైతులు పూలసాగు వైపు మరిలే అవకాశం ఉంది.

# సోలార్ కు పెరుగుతున్న ఆదరణ

**భీమిని(మంచిర్యాల):** పెరిగిపోతున్న విద్యుత్ చార్జీలు ఈ పరిస్థితులను అధిగమిం చేందుకు జిల్లా ప్రజలు సౌరశక్తి వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ఒక్కప్పుడు సరైన అవగాహన లేక సౌర విద్యుత్తును వినియోగించుకున్న వారు తక్కువే. దీనితో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోత్సహిస్తుం డటంతో వినియోగదారుల సంఖ్య పెరిగింది. గ్రామాల్లో సైతం తమ ఇళ్లపై, ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ ప్యానెల్స్ బిగించుకుని విద్యుత్తును వాడుకుంటున్నారు. ఏసీలు, గ్రీజర్లు తదితర సోలార్ విద్యుత్ ద్వారా విని యోగిస్తున్నారు. ఎప్పుడూ ప్యాన్లు తిరుగుతున్నా, లైట్లు వెలుగుతున్నా జీరో బిల్లే వస్తుంది. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా సౌరశక్తి అధిక బిల్లులు రాకుండా అడ్డుకుంటోంది.



**పీఎం సూర్యఘర్ ఉపయోగాలు...**
ఈ పథకం ద్వారా ప్రతీ నెల 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ లభిస్తుంది. 2 కిలోవాట్ల సిస్టమ్‌కు రూ. 60 వేలు, 3 కిలో వాట్లకు రూ.78 వేలు వరకు సబ్సిడీ అందిస్తారు. ఇంటి అవ సరాలకు పోనూ మిగిలిన విద్యుత్‌ను తిరిగి సంస్థకు అమ్మడం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చు. ఈ పథకంలో ఈవీ వాహనాలను సైతం ఛార్జింగ్ చేసుకునే వెసులు బాటు ఉంటుంది.

**దరఖాస్తు విధానం ఇలా..**
కేంద్రం పీఎం సూర్యఘర్ బిజిలీ యోజన రాయితీ ఇచ్చే సౌరశక్తి యూనిట్లను పోత్సహిస్తుంది. పీఎం సూర్యఘర్. జీఓవి.ఐన్ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకుంటే త క్షణమే కార్యచరణ మొదలవుతుంది. తక్కువ వ్యవధిలో ఇంట్లో ప్యానెల్స్ అమర్చుకోవచ్చు. గరిష్ఠంగా రూ. 78 వేల రూపాయల రాయతీ వస్తుండగా తక్కువ వడ్డీతో బ్యాంకు రాణాలు కూడా పొందవచ్చు.

**యూనిట్ల లెక్కలన్నీ ఫోన్‌లో ప్రత్యక్ష్యం..**
సౌర విద్యుత్తు వినియోగం సమాచారం ఫోన్‌కు వ స్తుంది. రోజూ వారీ ఉత్పత్తి అయిన విద్యుత్తు ఎంత? వచ్చిన ఆదాయం ఎంత? తెలుస్తుంది. విద్యుత్ సంస్థ తీ సుకున్న సౌర విద్యుత్‌కు ఏడాదికి రెండు సార్లు (జన వరి–జూన్, జూలై–డిసెంబరు) మీటర్ ద్వారా లెక్కించి యూనిట్ల ఆధారంగా డబ్బులు ఉత్పత్తిదారులకు చెల్లిస్తారు.

**ఖర్చు, రాయితీ, ఉత్పత్తి వివరాలు**
2 కిలోవాట్ల యూనిట్ల సామర్థ్యం వ్యయం1.60 లక్షలు దీనికి రాయితీ 60 వేలు ఇది నెలకు 240 యూనిట్ల వరకు ఉత్పత్తి చేస్తుంది.
3 కిలోవాట్ల యూనిట్ సామర్థ్యం వ్యయం 2.16 లక్షలు దీనికి రాయితీ 78 వేలు ఇది నెలకు 360 యూనిట్లను ఉత్పత్తి చేస్తుంది.
4 కిలోవాట్ల యూనిట్ సామర్థ్యం వ్యయం 2.67 లక్షలు కాగా దీనికి రాయితీ 78 వేలు ఇది నెలకు 480 యూనిట్లను ఉత్పత్తి చేయగలదు.
5 కిలోవాట్ల యూనిట్ సామర్థ్యం వ్యయం 3.25 లక్షలు అవుతుంది దీనికి రాయితీ 78 వేలు ఇది నెలకు 600 యూనిట్లను ఉత్పత్తి చేయగలదు.

**రైతులకు పీఎం కుసుమ్ పథకం..**
సొంత భూమిని కలిగి ఉండి ఇప్పటికే బోరు బావి ఇతర సాగునీటి వనరులు కలిగి ఉన్న రైతుల కోసం కేంద్ర ప్రభుత్వం పీఎం కుసుమ్ పథకం ద్వారా 3 హెచ్‌పీ నుంచి 10 హెచ్‌పీ వరకు సోలార్ పంప్ సెట్లకు సబ్సిడీ అంది స్తోంది. ఈ ప్యానెళ్లకు 25 ఏళ్ల వరకు గ్యారెంటీ ఉండటం తో పాటు పగటి పూట దాదాపు 8 గంటల పాటు ఉచి తంగా మోటార్లు నడుస్తాయి. ఈ పథకం ద్వారా ఏడాదికి ఎకరాకు రూ.50 లక్షల ఆదాయం పొందవచ్చు. సరైన మార్గదర్శకాలు ఇచ్చి జిల్లా వ్యాప్తంగా ఈ పథకాన్ని త్వరిత గతిన అమలు చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బెజవాడకు దళపతి విజయ్

**విజయవాడ, అక్టోబరు 11:**తమిళనాడు సీఎం ఆంధ్రప్రదేశ్ పర్యటనకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. విజయవాడలో అత్యంత వైభవంగా జరిగే ప్రసిద్ధ ఇంద్రకీలాద్రి దసరా ఉత్సవాలకు హాజరుకావాల్సిందిగా విజయ్‌ను విజయవాడ పార్లమెంటు సభ్యుడు కేశినేని శివనాథ్ ప్రత్యేక బృందం నేరుగా ఆహ్వానించింది. ఎంపీ బృందం ఆహ్వానానికి విజయ్ కూడా సానుకూలంగా స్పందించినట్లు, దసరా వేడుకల్లో పాల్గొనేందుకు ఆయన ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది.ఇటీవల కాలంలో విజయ్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై, ఇక్కడి సామాజిక పరిస్థితులపై ప్రత్యేక ఆసక్తి కనబరుస్తున్నట్లు ఆయన వ్యూహకర్తలు చెబుతున్నారు. తన పార్టీ భావజాలాన్ని, తమిళనాడు ప్రభుత్వ విజయాలను కేవలం సొంత రాష్ట్రానికే పరిమితం చేయకుండా తెలుగు ప్రజలకు కూడా చేరేలా ప్రత్యేకంగా తెలుగులో ప్రకటనలు ఇప్పించడం, టీవీ ఛానెళ్లలో ప్రసారం చేయించడం చేస్తున్నారు. కేవలం సినిమాల ద్వారానే కాకుండా, రాజకీయంగా కూడా తన ప్రభావాన్ని ఇతర రాష్ట్రాలకు, ముఖ్యంగా పొరుగునే ఉన్న ఏపీకి విస్తరించాలనే ఆలోచనలో విజయ్ ఉన్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు అంటున్నాయి.తమిళనాడు దాటి తన పార్టీని దక్షిణాది ఇతర రాష్ట్రాల్లోకి తీసుకువెళ్లేందుకు అడుగులు వేస్తున్న విజయ్‌కు, ఏపీ తొలి పర్యటన ద్వారా ప్రజా స్పందనను పరిశీలించే అవకాశం ఉంది. విజయవాడ దసరా ఉత్సవాల వేదికగా ఆయన పర్యటిస్తే, ఇక్కడి రాజకీయ, సామాజిక సమీకరణాలపై ఆయనకు ఒక స్పష్టమైన అవగాహన వచ్చే అవకాశం ఉంది.

# తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ

**తెలంగాణ భవన్‌లో బతుకమ్మ వేడుకలు**
**మహిళలతో కలిసి బతుకమ్మ ఆడిన పద్మాదేవేందర్‌రెడ్డి**



**మెదక్, అక్టోబర్ 10,(స్కైన్యూస్ ప్రతినిధి ):** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శనివారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన వేడుకల్లో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మాదేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ మహిళా నేతలు,మహిళలతో కలిసి వివిధ రకాల పూలతో బతుకమ్మను పేర్చి, అందంగా అలంకరించారు. అనంతరం బతుకమ్మలను ఒకచోట ఏర్పాటు చేసి, మహిళలతో కలిసి సంప్రదాయబద్ధంగా బతుకమ్మ ఆడారు. మహిళలతో మమేకమై పండుగ సంబరాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పద్మాదేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. ప్రకృతిలో లభించే రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, మహిళలంతా ఒకచోట చేరి ఆనందోత్సాహాల మధ్య జరుపుకునే ఈ పండుగకు ప్రత్యేక విశిష్టత ఉందన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రత్యేకతను చాటిచెబుతుందని తెలిపారు.తెలంగాణ



ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలోనూ బతుకమ్మ పండుగ కీలక పాత్ర పోషించిందని, తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని ప్రపంచానికి చాటిచెప్పిందని పేర్కొన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న పండుగలు, సంప్రదాయాల గొప్పతనాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ, వాటి విశిష్టతను ప్రపంచానికి తెలియజేయాలని సూచించారు.బతుకమ్మ పండుగ మహిళల మధ్య ఆత్మీయతను, ఐకమత్యాన్ని పెంపొందిస్తుందని పేర్కొన్నారు. మహిళలు సంతోషంగా, ఐకమత్యంతో పండుగలను జరుపుకోవాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ వేడుకలను ప్రతి ఒక్కరూ సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తూ, పండుగ విశిష్టతను కాపాడాలని పిలుపునిచ్చారు.తెలంగాణ భవన్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. పూలతో అలంకరించిన బతుకమ్మల చుట్టూ చేరి సంప్రదాయ పాటలు పాడుతూ ఆడిపాడారు. దీంతో తెలంగాణ భవన్‌లో పండుగ వాతావరణం నెలకొంది.

## న్యాయవ్యవస్థలో బహుజనులకు
# సముచిత ప్రాతినిధ్యం కల్పించాలి

**సామాజిక న్యాయమే లక్ష్యంగా బీసీ లాయర్స్ అసోసియేషన్ తీర్మానం**

**హైదరాబాద్, అక్టోబర్ 10**:న్యాయవ్యవస్థలో బహుజన వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని బీసీ లాయర్స్ అసోసియేషన్ తీర్మానించింది. న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు బలోపేతం కావాలంటే న్యాయమూర్తుల నియామకాలతో సహా అన్ని కీలక వ్యవస్థల్లో జనాభా నిష్పత్తికి అనుగుణంగా బహుజన న్యాయవాదులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని సదస్సు అభిప్రాయపడింది. హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శనివారం 'ఉన్నత న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం అనే అంశంపై బీసీ లాయర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు తలకొక్కుల రాజు అధ్యక్షతన, కార్యదర్శి పొన్నం దేవరాజ్ గౌడ్ సమన్వయంతో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొని న్యాయవ్యవస్థలో సామాజిక ప్రాతినిధ్యంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

**న్యాయవ్యవస్థలో సమాన అవకాశాలకు ప్రాధాన్యం**
సమాజంలోని అన్ని వర్గాలకు న్యాయం అందించే వ్యవస్థలోనే అన్ని సామాజిక వర్గాలకు తగిన భాగస్వామ్యం ఉండాలని వక్తలు పేర్కొన్నారు. న్యాయవ్యవస్థలో బహుజన వర్గాల ప్రాతినిధ్యం పెరగడం ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని అభిప్రాయపడ్డారు. అర్హత కలిగిన బహుజన న్యాయవాదులకు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

**కొలీజియం వ్యవస్థపై పునరాలోచన అవసరం**





ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలకు సంబంధించి అమలులో ఉన్న కొలీజియం వ్యవస్థపై పునరాలోచన జరగాలని సదస్సు అభిప్రాయపడింది.

. నియామకాల ప్రక్రియలో పారదర్శకత, సమాన అవకాశాలు, సామాజిక ప్రాతినిధ్యానికి ప్రాధాన్యం కల్పించే విధానాలను పరిశీలించాలని కోరింది. న్యాయవ్యవస్థలో అన్ని వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించే దిశగా విధానపరమైన మార్పుల కోసం కృషి చేయాలని నిర్ణయించింది.

**బహుజన న్యాయవాదుల చైతన్యానికి కార్యాచరణ**
న్యాయవ్యవస్థలో సామాజిక న్యాయం సాధించేందుకు స్వల్పకాలిక వ్యూహాలు, దీర్ఘకాలిక లక్ష్యాలతో ముందుకు సాగాలని బీసీ లాయర్స్ అసోసియేషన్ నిర్ణయించింది. బహుజన న్యాయవాదుల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు, వారి సమస్యలు మరియు ప్రాతినిధ్యానికి సంబంధించిన అంశాలపై సంఘటితంగా కృషి చేసేందుకు సమగ్రమైన కార్యాచరణ రూపొందించనున్నట్లు ప్రకటించింది. అవసరమైతే తమ డిమాండ్ల సాధన కోసం కార్యాచరణను మరింత విస్తృతం చేస్తామని స్పష్టం చేసింది.

**ప్రముఖుల భాగస్వామ్యం**
ఈ సదస్సులో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, విశ్రాంత ఐఏఎస్ అధికారి టి. చిరంజీవులు, బార్ కౌన్సిల్ సభ్యులు రఘునాథ్, సునీల్ గౌడ్, ముఖిద్, బీసీ మేధావులు పి. వినయ్ కుమార్, నారగోని, బొమ్మగాని ప్రభాకర్, చిక్కుడు ప్రభాకర్, మాస్టర్ జి. రంగయ్య, నల్లమాస కృష్ణ, చామకూర రాజు, కోల జనార్ధన్, మంజుల దేవి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ అనవసర రాద్ధాంతం.. ఓటమి భయంతోనే ఆందోళనలు: కీర్తిరెడ్డి

**హైదరాబాద్:**ఎస్ఐఆర్ ప్రక్రియ పేరుతో కాంగ్రెస్ పార్టీ అనవసర రాద్ధాంతం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని బీజేపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ జూటూరు కీర్తిరెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా బీజేపీకి పెరుగుతున్న ప్రజాదరణను కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోందని, ఓటమి భయంతోనే వివిధ అంశాలపై ఆందోళనలు చేస్తోందని ఆరోపించారు.ఓటర్ల జాబితాలో ఉన్న అవకతవకలను సరిచేయడం, డూప్లికేట్ ఓట్లు, అనర్హమైన ఓట్లను తొలగించడం ప్రజాస్వామ్యానికి అవసరమని కీర్తిరెడ్డి పేర్కొన్నారు. గతంలో ఓటర్ల జాబితాలో అక్రమాలున్నాయని ఆరోపించిన కాంగ్రెస్ నేతలు.. ఇప్పుడు వాటిని సరిచేసే ప్రక్రియను ఎందుకు వ్యతిరేకిస్తున్నారని ప్రశ్నించారు. నిజమైన ఓటర్ల హక్కులను కాపాడటమే ా×= లక్ష్యమని, అర్హులైన ఓటర్లకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తొలగించబడిన ఓట్ల విషయంలో అభ్యంతరాలుంటే సంబంధిత ఎన్నికల అధికారులను సంప్రదించాలే తప్ప, రోడ్లపై ఆందోళనలు చేయడం సరికాదని హితవు పలికారు.ఓట్ చోరీ గురించి మాట్లాడే నైతిక హక్కు కాంగ్రెస్ పార్టీకి లేదని కీర్తిరెడ్డి విమర్శించారు. గతంలో జరిగిన రాజకీయ పరిణామాలను ప్రస్తావిస్తూ.. రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి ఈ అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.మరోవైపు, తెలంగాణలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆమె ఆరోపించారు. రాష్ట్రంలోని ప్రజా సమస్యలను పరిష్కరించకుండా సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీలో ధర్నాలు, ఆందోళనలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పక్కనపెట్టి రాజకీయ ఇమేజ్ కోసం ప్రయత్నించడం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీకి నిజంగా ఓటర్లపై ప్రేమ ఉంటే.. నిజమైన ఓటర్ల హక్కులను కాపాడటంతో పాటు, అనర్హమైన ఓట్ల తొలగింపు ప్రక్రియకు సహకరించాలని కీర్తిరెడ్డి సూచించారు.

# రోజువారీ ఆహారంలో ఫైబర్ కచ్చితంగా ఉండేలా చూసుకోవాలి



ఆరోగ్యకరమైన ఆహారంలో ప్రొటీన్లు, విటమిన్లు ఎంత ముఖ్యమో ఫైబర్ కూడా అంతే అవసరం. జీర్ణక్రియ సక్రమంగా సాగేందుకు, ఆరోగ్యకరమైన బరువును నిర్వహించేందుకు ఫైబర్ కీలక పాత్ర పోషిస్తుంది. అయితే చాలామంది రోజువారీ ఆహారంలో తగినంత ఫైబర్‌ను తీసుకోవడం లేదు. ఈ నేపథ్యంలో ఒక్క సర్వింగ్‌లోనే దాదాపు 5 గ్రాముల ఫైబర్‌ను అందించే కొన్ని సులభమైన ఆహారాలను ఆహార నిపుణులు సూచిస్తున్నారు. సగం అవకాడో, ఒక యాపిల్, ఒక చిలగడదుంప, రెండు టేబుల్‌స్పూన్ల అవిసె గింజలు, రెండు టేబుల్‌స్పూన్ల పాప్‌కార్న్ గింజలు వంటి సులభమైన ఆహారాలను తీసుకోవడం వల్ల మనకు తగినంత ఫైబర్ లభిస్తుందని నిపుణులు చెబుతున్నారు.

**యాపిల్‌ను తొక్కతోనే తినాలి..**

అలాగే యాపిల్‌ను తొక్కతో తినడం వల్ల మరింత ఫైబర్ లభిస్తుంది. ఇందులో ఉండే పెక్టిన్ మంచి బ్యాక్టీరియాకు ఆహారంగా పనిచేసే ప్రీబయోటిక్ పదార్థంగా ఉపయోగపడుతుంది. తొక్కలో కూడా ఫైబర్ ఉండడంతో దానిని తొలగించకుండా తినడం వల్ల జీర్ణవ్యవస్థ సక్రమంగా పనిచేయడానికి సహాయపడుతుంది. అలాగే చిలగడదుంపను తొక్కతోనే ఉడికించడం లేదా కాల్చి తీసుకోవడం ద్వారా ఫైబర్ పొందవచ్చు. ఇది పేగుల ఆరోగ్యానికి కూడా ఉపయోగకరంగా ఉండే ఆహారాల్లో ఒకటిగా సూచిస్తారు.

**అవిసె గింజలు..**

అవిసె గింజలను కూడా రోజువారీ ఆహారంలో చేర్చుకోవడం వల్ల తగినంత ఫైబర్ ను పొందవచ్చు. రెండు టేబుల్‌స్పూన్ల అవిసె గింజలను స్వల్పంగా వేయించి, పొడిగా చేసుకుని తీసుకోవడం ద్వారా ప్రీబయోటిక్ ఫైబర్‌తోపాటు ఆరోగ్యకరమైన ఒమెగా 3 కొవ్వు ఆమ్లాలు లభిస్తాయి. మరోవైపు సగం అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులతోపాటు పోషకాలు అధికంగా ఉండే ఫైబర్ ఉంటుంది. ఇది జీర్ణక్రియ సక్రమంగా సాగేందుకు తోడ్పడుతుంది. అందువల్ల సలాడ్లు లేదా ఇతర ఆహారాల్లో అవకాడోను చేర్చుకోవడం మంచిది.

**పాప్‌కార్న్ కూడా..**

ఫైబర్ తీసుకోవడం పెంచుకోవాలనుకునేవారికి పాప్‌కార్న్ కూడా ఒక సులభమైన ఎంపికగా సూచిస్తున్నారు. ఇది సంపూర్ణ ధాన్యానికి చెందిన ఆహారం కావడంతో, రెండు టేబుల్‌స్పూన్ల గింజలను గాలితో వేడి చేసి తయారు చేస్తే పెద్ద పరిమాణంలో, కడుపు నిండిన అనుభూతిని కలిగించే చిరుతిండి సిద్ధమవుతుంది. పేగుల్లోని మంచి బ్యాక్టీరియా ఫైబర్‌ను విచ్ఛిన్నం చేసే సమయంలో కొన్ని ఉపయోగకరమైన పదార్థాలు ఉత్పత్తి అవుతాయి. ఇవి వాపును తగ్గించడంలో, రోగనిరోధక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను స్థిరంగా ఉంచడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే ఖరీదైన సప్లిమెంట్లపై ఆధారపడడానికి బదులుగా సహజమైన ఫైబర్ ఉన్న ఆహారాలను రోజువారీ మెనూలో చేర్చుకోవడం

# మీ పిల్లలు ఫోన్లను చూస్తూ ఆహారం తింటున్నారా.. అయితే జాగ్రత్త.. వైద్యుల హెచ్చరిక..



పిల్లలు భోజనం లేదా చిరుతిండి తినే సమయంలో టీవీ, మొబైల్ లేదా ట్యాబ్లెట్ వంటి వాటిని చూడడం ఇప్పుడు చాలా సాధారణంగా మారింది. అయితే ఇలా స్క్రీన్ చూస్తూ తినడం వల్ల పిల్లలు తాము ఎంత ఆహారం తీసుకుంటున్నారో, నిజంగా ఆకలిగా ఉందో లేదో గుర్తించలేకపోయే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. స్క్రీన్‌పై దృష్టి మళ్లడంతో ఆహారం రుచి, పరిమాణం, కడుపు నిండిన భావన వంటి సంకేతాలను పిల్లలు తక్కువగా గమనిస్తారు. అయితే స్క్రీన్ చూస్తే ప్రతి చిన్నారి తప్పనిసరిగా ఎక్కువగా తింటారని చెప్పడానికి ఆధారాలు లేవు. పరిశోధనల్లో తక్షణంగా తీసుకునే కేలరీలపై ప్రభావం అన్ని సందర్భాల్లోనూ ఒకేలా కనిపించలేదు. అంటే స్క్రీన్ ప్రభావం పిల్లల ప్రవర్తన, ఆహారం అందుబాటులో ఉండడం, స్క్రీన్‌పై చూస్తున్న కంటెంట్ వంటి అంశాలపై ఆధారపడి ఉంటుంది. అయితే స్క్రీన్ చూస్తూ తినడం వల్ల ప్రభావం ఆ సమయంలో తీసుకునే ఆహారానికే పరిమితం కాదని కొన్ని పరిశోధనలు సూచిస్తున్నాయి. భోజనం సమయంలో టీవీ చూడడం వల్ల తరువాతి భోజనంలో ఎక్కువ ఆహారం తీసుకునే అవకాశం ఉన్నట్లు 2025లో నిర్వహించిన ప్రయోగాత్మక అధ్యయనాల సమీక్షలో గుర్తించారు. స్క్రీన్‌పై దృష్టి కేంద్రీకరించడం వల్ల పిల్లలు తాము తిన్న ఆహారాన్ని సరిగ్గా గుర్తుంచుకోకపోవడం కూడా దీనికి ఒక కారణంగా ఉంటుందని భావిస్తున్నారు. దీనికి తోడు టీవీ కార్యక్రమాలు, వీడియోలు, ఆటల్లో కనిపించే ఆహార ప్రకటనలు, బ్రాండెడ్ ఆహార పదార్థాలు, రుచికరమైన తినుబండారాల దృశ్యాలు పిల్లల్లో ఆహారం పట్ల ఆసక్తిని పెంచే అవకాశం ఉంది. సమీక్షించిన 35 అధ్యయనాల్లో 27 అధ్యయనాలు ఆహార ప్రకటనలు లేదా ఆహారానికి సంబంధించిన సంకేతాలతో ఎక్కువ ఆహారం తీసుకోవడాన్ని గుర్తించాయి. స్క్రీన్‌తో పాటు ఎలాంటి ఆహారం తింటున్నారు, ఎంత పరిమాణంలో అందిస్తున్నారు అనేదీ ముఖ్యమే. ఉదాహరణకు పిల్లలు అరగంట పాటు కార్టూన్ చూస్తూ పక్కనే పెట్టిన బిస్కెట్లు లేదా చిప్స్‌ను తింటూ ఉంటే, తినడం ఎప్పుడు ప్రారంభమై ఎప్పుడు ముగిసిందో వారికి స్పష్టంగా తెలియదు. ప్యాకెట్ నుంచి నేరుగా తినడం వల్ల పరిమాణంపై నియంత్రణ కూడా తగ్గుతుంది. అలాగే టీవీ ముందు కూర్చున్న ప్రతిసారీ చిప్స్, బిస్కెట్లు, తీపి పానీయాలు లేదా స్వీట్లు ఇస్తూ ఉంటే స్క్రీన్ చూడడం, చిరుతిండి తినడం రెండూ ఒకదానితో ఒకటి అనుసంధానమయ్యే అలవాటుగా మారుతాయి. దీంతో ఆకలి లేకపోయినా స్క్రీన్ కనిపించగానే తినాలనే కోరిక కలిగే అవకాశం ఉంటుంది. అందుకే పిల్లల ఆహారపు అలవాట్లలో స్క్రీన్‌ను పూర్తిగా నిషేధించడం కంటే భోజనం, స్క్రీన్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు వేరు చేయడం మంచిది. భోజనం, చిరుతిండిని భోజన ప్రదేశంలోనే ఇవ్వడం, అవసరమైన పరిమాణంలో మాత్రమే వడ్డించడం, ప్యాకెట్‌ను పిల్లల ముందు ఉంచకుండా ఉండడం ఉపయోగకరంగా ఉంటుంది. నీటిని ప్రధాన పానీయంగా ఇవ్వడంతోపాటు పండ్లు, పెరుగు, తగిన పరిమాణంలో గింజలు వంటి ఆరోగ్యకరమైన చిరుతిండ్లను ఎంచుకోవచ్చు. స్క్రీన్ చూస్తే ఆహారాన్ని బహుమతిగా ఇచ్చే అలవాటును కూడా తగ్గించాలి. పిల్లల బరువుపై ప్రభావాన్ని అర్థం చేసుకోవాలంటే స్క్రీన్ ఒక్కటే కాకుండా భోజన సమయాలు, నిద్ర, శారీరక చురుకుదనం, ఇంట్లో అందుబాటులో ఉన్న ఆహారం వంటి మొత్తం జీవనశైలిని పరిగణనలోకి తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు తరచూ వైద్య సేవలను అందుకోవాలి..



దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు క్రమం తప్పకుండా వైద్య సేవలు అందుకోవడం ఎంతో అవసరం. మధుమేహం, గుండె జబ్బులు, మూత్రపిండాల సమస్యలు, ఊపిరితిత్తుల వ్యాధులు, అధిక రక్తపోటు వంటి సమస్యలను నియంత్రించేందుకు వైద్యుల పర్యవేక్షణ, అవసరమైన పరీక్షలు, సమయానికి చికిత్స తీసుకోవడం కీలకం. అయితే అవసరం లేకపోయినా తరచూ ఆసుపత్రికి వెళ్లడం లేదా ఎక్కువకాలం ఆసుపత్రిలో ఉండడం వల్ల కొన్ని అదనపు ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. ఆసుపత్రుల్లో వివిధ రకాల ఇన్ఫెక్షన్లతో బాధపడుతున్నవారు ఉండడంతో, దీర్ఘకాలిక వ్యాధులు లేదా బలహీనమైన రోగనిరోధక శక్తి ఉన్నవారికి పదేపదే ఆసుపత్రికి వెళ్లడం వల్ల ఇన్ఫెక్షన్లకు గురయ్యే అవకాశం పెరుగుతుంది. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు తరచూ ఒకటి కంటే ఎక్కువ మందులు తీసుకుంటుంటారు. అలాగే వివిధ ఆరోగ్య సమస్యలకు వేర్వేరు వైద్యులను సంప్రదించాల్సి ఉంటుంది. సరైన సమన్వయం లేకపోతే కొన్ని మందులు అవసరం లేకపోయినా కొనసాగడం, ఒకే రకమైన మందులు రెండుసార్లు తీసుకోవడం, మందుల మధ్య పరస్పర ప్రభావాలు లేదా దుష్ప్రభావాలు ఎదురయ్యే అవకాశం ఉంటుంది. అందువల్ల క్రమం తప్పకుండా మందుల సమీక్ష చేయించుకోవడం, ఏ మందును ఎందుకు తీసుకుంటున్నారో తెలుసుకోవడం ముఖ్యం. తరచూ ఆసుపత్రికి వెళ్లడం వల్ల ఎక్కువసేపు వేచి ఉండడం, పరీక్షలు చేయించుకోవడం, చికిత్సా ప్రక్రియలు, నిద్ర, రోజువారీ అలవాట్లలో మార్పులు వంటి కారణాలతో శారీరక, మానసిక ఒత్తిడి కూడా పెరుగుతుంది.

**ఎక్కువ సేపు మంచానికే పరిమితం అయితే..**

ముఖ్యంగా వృద్ధుల్లో పదేపదే ఆసుపత్రిలో చేరడం మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. ఆసుపత్రిలో ఎక్కువసేపు మంచానికే పరిమితం కావడం లేదా శారీరకంగా చురుకుగా లేకపోవడం వల్ల కండరాల బలం తగ్గి, కదలికలు మందగిస్తాయి. దీని కారణంగా గతంలో ఉన్న శారీరక సామర్థ్యానికి తిరిగి రావడం ఆలస్యం కావడంతో పాటు, రోజువారీ పనులను స్వయంగా చేసుకునే సామర్థ్యం కూడా ప్రభావితమయ్యే అవకాశం ఉంది. అదేవిధంగా ఒకే వ్యక్తికి పలువురు వైద్యులు చికిత్స అందిస్తున్నప్పుడు వారి మధ్య సరైన సమాచార మార్పిడి లేకపోతే అవసరం లేని పరీక్షలు మళ్లీ చేయించుకోవాల్సి వస్తుంది లేదా ఒకదానితో మరొకటి సరిపోని చికిత్సా విధానాలు ఏర్పడే అవకాశం ఉంటుంది. అందుకే రోగి వైద్య చరిత్ర, మందుల వివరాలు, పరీక్షల నివేదికలు స్పష్టంగా అందుబాటులో ఉండడం అవసరం.

**వైద్య సలహా తప్పనిసరి..**

అయితే వైద్య అవసరం ఉన్నప్పుడు ఆసుపత్రికి వెళ్లకుండా ఉండడం పరిష్కారం కాదు. అనవసరమైన ఆసుపత్రి సందర్శనలను తగ్గించేందుకు దీర్ఘకాలిక వ్యాధులను ముందుగానే నియంత్రించుకోవడం, క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం, మందులను సమీక్షించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించడం, సమస్యల హెచ్చరిక సంకేతాలను ముందుగానే గుర్తించడం ఉపయోగపడతాయి. ఒక స్పష్టమైన చికిత్సా ప్రణాళికను రూపొందించుకుని, ఎప్పుడు వైద్య సహాయం అవసరమో తెలుసుకోవడం కూడా ముఖ్యం. అదే సమయంలో కొత్తగా తీవ్రమైన లేదా సమస్య మరింత ఎక్కువైన లక్షణాలు కనిపిస్తే ఆసుపత్రికి వెళ్లడాన్ని ఆలస్యం చేయకూడదు. దీర్ఘకాలిక వ్యాధుల విషయంలో అవసరమైన సమయంలో సరైన వైద్యం అందించడంతో పాటు, నివారించగలిగే ఆసుపత్రి సందర్శనలను తగ్గించడం, రోగుల ఆరోగ్యం, కదలికలు, స్వతంత్ర జీవనాన్ని కాపాడడం ప్రధాన లక్ష్యంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

# 2 గంటల్లో బ్రెయిన్ ట్యూమర్ గుర్తింపు.. ఇంగ్లండ్‌లో కొత్త పరీక్ష అభివృద్ధి?



నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌లోని నేషనల్ హెల్త్ సర్వీస్(ఎన్‌హెచ్‌ఎస్) ఉపయోగిస్తున్న కొత్త పరీక్ష ద్వారా రోగులు తమ బ్రెయిన్ ట్యూమర్ ఏ రకానికి చెందిందో, ఏ దశలో ఉందో తెలుసుకొనే సమయాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. కొన్ని కేసుల్లో రెండు గంటల్లోనే ఈ పరీక్ష ఫలితాలను తెలుసుకోవచ్చు. యూనివర్సిటీ ఆఫ్ నాటింగ్‌హామ్ పరిశోధకులు, నాటింగ్ హామ్ దవాఖానాల ఎన్‌హెచ్‌ఎస్ ట్రస్ట్‌లోని వైద్య నిపుణులు ఈ పరీక్షను అభివృద్ధి చేశారు. ఈ పరీక్షలో శస్త్ర చికిత్స సమయంలో కణితి కణజాలాన్ని విశ్లేషించడానికి వేగవంతమైన జన్యు క్రమాన్ని ఉపయోగిస్తారు. నానోపోర్ సీక్వెన్సింగ్ సాంకేతికతను ఈ పరీక్షలో ఉపయోగిస్తారు. ఈ కొత్త పరీక్షలో రాబిన్ అనే వ్యవస్థ ద్వారా 50 మెదడు కణితి నమూనాలను పరీక్షించారు.

# బిజినెస్

## అమెజాన్‌లో మళ్లీ లేఆఫ్స్.. వెయ్యి మంది తొలగింపు.. మొత్తం 30 వేల మందిని తొలగించే యోచన..!




ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ మరోసారి భారీగా ఉద్యోగులను తొలగించింది. ఈసారి ప్రపంచవ్యాప్తంగా వెయ్యిమందికి పైగా ఉద్యోగులను తొలగించినట్లు ప్రకటించింది. భారత్ అమెరికా యూకే సహా పలు దేశాల్లోని రిటైల్ బృందాలపై ఈ లేఆఫ్స్ ప్రభావం పడింది. రానున్న రోజుల్లో దాదాపు 30 వేల మంది ఉద్యోగులను తొలగించాలనే విస్తృత ప్రణాళికలో భాగంగానే ఈ తాజా ఉద్యోగుల కోతలు ఉన్నాయని కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ-కామర్స్ వెబ్‌సైట్‌ను పర్యవేక్షించే 'స్టోర్స్' వ్యాపార విభాగానికి చెందిన ఉద్యోగులను తాజాగా తొలగించినట్లు రాయిటర్స్, బిజినెస్ ఇన్‌సైడర్ నివేదికలు పేర్కొన్నాయి. తమ ప్రాధాన్యతలను మెరుగ్గా చేరుకోవడానికి వీలుగా స్టోర్స్ బిజినెస్‌లో కొన్ని సర్దుబాట్లు చేశామని అమెజాన్ ప్రతినిధి ఒకరు రాయిటర్స్‌కు వివరించారు. అయితే ఎంతమందిని తొలగించారనే కచ్చితమైన సంఖ్యను కంపెనీ వెల్లడించలేదు. మరోవైపు కరోనా మహమ్మారి సమయంలో అవసరానికి మించి ఉద్యోగులను నియమించుకోవడమే ప్రస్తుత తొలగింపులకు కారణమని అమెజాన్ వ్యవస్థాపకుడు జెఫ్ బెజోస్ అన్నారు. కరోనా సమయంలో ప్రజలు ఇళ్లకే పరిమితమై ఎక్కువగా ఆర్డర్లు చేశారని, అది తమకు చాలా ఒత్తిడితో కూడిన కాలమని, అందుకే అవసరానికి మించి ఉద్యోగులను తీసుకున్నామని 'ఫాక్స్ న్యూస్' కు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో బెజోస్ పేర్కొన్నారు. కాగా భారత్‌లో 'అమెజాన్ గ్రేట్ ఇండియన్' ఫెస్టివల్ సేల్.. ప్రపంచవ్యాప్తంగా 'ప్రైమ్ బిగ్ డీల్ డేస్' సేల్ ప్రారంభమైన తరుణంలోనే ఈ లేఆఫ్‌లు జరగడం గమనార్హం. మంగళవారం రోజున ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తున్నట్లు కంపెనీ ఉన్నతాధికారులు సమాచారం అందించారు. దాంతో ప్రభావిత ఉద్యోగులు కంపెనీ అంతర్గత స్లాక్ ఛానెల్‌లో సెవరెన్స్ ప్యాకేజీ, నోటీస్ పీరియడ్, ఇతర అవకాశాలపై చర్చించుకున్నట్లు సమాచారం. ఒకవైపు ఉద్యోగులను తొలగిస్తున్నప్పటికీ మరోవైపు అమెజాన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతోంది.

## విమాన ప్రయాణికులకు షాక్.. ఫ్యూయల్ సర్‌ఛార్జీ పెంచేసిన ఎయిరిండియా

టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ ప్రయాణికులకు షాకిచ్చాయి. దేశీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులపై ఫ్యూయల్ సర్‌ఛార్జీలను పెంచేశాయి. పెరిగిన ధరలు అక్టోబర్ 9 నుంచే అమల్లోకి రానున్నాయి. ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలు పెరిగిన నేపథ్యంలో ఎయిరిండియా ఈ నిర్ణయం తీసుకుంది. మరో విమానయాన సంస్థ ఇండిగో సర్‌ఛార్జీలను పెంచిన కొద్దిరోజులకే ఎయిరిండియా, ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ఏటీఎఫ్ ధరల పెరుగుదలతో నిర్వహణ వ్యయం భారీగా పెరిగిందని ఎయిరిండియా ఓ ప్రకటనలో తెలిపింది. దూరాన్ని బట్టి దేశీయ విమానాలకు ఫ్యూయల్ సర్‌ఛార్జీ రూ.400 నుంచి రూ.1200 మేర పెంచుతున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ విమాన సర్వీసులకు 55 డాలర్ల నుంచి 215 డాలర్ల మేర పెంచుతున్నట్లు ప్రకటించింది. ఇండిగో సంస్థ దూరాన్ని బట్టి దేశీయ విమానాలకు రూ.100 నుంచి రూ.350 మేర సర్‌ఛార్జీ భారాన్ని మోపింది. ఆకాశ ఎయిర్ కూడా: మరో ప్రైవేటు విమానయాన సంస్థ ఆకాశ ఎయిర్.. దేశీయ విమాన సర్వీసులకు ఫ్యూయల్ సర్‌ఛార్జీ విధానాన్ని తిరిగి తీసుకొచ్చింది. అంతర్జాతీయ విమాన సర్వీసులపై ప్రస్తుతం విధిస్తున్న సర్‌ఛార్జీని మరింత పెంచింది.

# యూపీఐ లావాదేవీలపై ఛార్జెస్ జనవరి నుంచి?..
# త్వరలో అధికారికంగా స్పష్టతవచ్చే అవకాశం

యూపీఐ ద్వారా జరిగే రూ.2000పైన లావాదేవీలపై ప్రతిపాదించిన ఛార్జీల అమలును కొన్ని నెలలపాటు వాయిదా వేయాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. ఇప్పుడు పండగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలుస్తున్నది. దీనిపై త్వరలోనే అధికారికంగా స్పష్టతవచ్చే అవకాశం ఉన్నది. రూ.2,000 కంటే ఎక్కువ విలువైన మర్చంట్ యూపీఐ లావాదేవీలపై 0.4 శాతం ఛార్జీలను అక్టోబర్ 15 నుంచి అమలు చేయాలని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. అయితే ఈ గడువును వచ్చే ఏడాది జనవరి వరకు పొడిగించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. ఈ నిర్ణయంవల్ల పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను ఆధునికీకరించుకోవడానికి సమయం దొరుకుంది. అదేవిధంగా పండగల సీజన్‌లో వ్యాపారులపై అదనపు ఛార్జీల భారం పడకుండా ఉంటుంది. కాగా ఆరేళ్లకుపైగా ఎలాంటి రుసుము లేకుండా కొనసాగుతున్న యూపీఐ చెల్లింపులపై ఈ ఛార్జీలను ప్రభుత్వం ప్రతిపాదించింది. అయితే ఇది వినియోగ దారులకు ప్రత్యక్షంగా వర్తించదు. ఇది వ్యాపారులవైపు నుంచి చెల్లించాల్సిన ఇంటర్‌ఛేంజ్ రుసుము. ప్రస్తుతం దేశంలో 50 కోట్లకుపైగా యూపీఐ వినియోగదారులు ఉన్నారు. ఆగస్టు 2026 లోనే యూపీఐ ద్వారా రూ.29.82 లక్షల కోట్ల విలువైన 2,451 కోట్ల లావాదేవీలు జరిగాయంటే దీని




ప్రాధాన్యం అర్థం చేసుకోవచ్చు. అక్టోబర్ 15 నుంచి ఛార్జీల అమలు మొదలుపెడితే అది దసరా, దీపావళి వంటి పండగల వేళ వినియోగదారుల కొనుగోళ్లపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ కీలక సమయంలో రిటైల్ చెల్లింపులకు అంతరాయం కలుగకుండా చూడాలనేది ప్రధాన ఉద్దేశం. అదే సమయంలో ఈ అదనపు గడువులో పేమెంట్ కంపెనీలు తమ సాంకేతిక వ్యవస్థలను మెరుగుపరుచుకోవడానికి, ఛార్జీల భారాన్ని వినియోగదారులపై పడకుండా ఎలా సర్దుబాటు చేయాలో ప్రణాళిక రచించుకోవడానికి సమయం లభించనుంది.

# స్టాక్ మార్కెట్ భారీ పతనం..
# ఒక్క రోజే రూ.11 లక్షల కోట్ల సంపద ఆవిరి

భారత్ స్టాక్ మార్కెట్ గురువారం భారీగా పతనమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 1,000 పాయింట్లకుపైగా నష్టపోగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 371 పాయింట్లు నష్టపోయింది. దీంతో ఇన్వెస్టర్లు ఈ ఒక్కరోజే దాదాపు రూ.11 లక్షల కోట్ల వరకు పోగొట్టుకున్నారు. ఆర్బీఐ రెపో రేట్ పెంపు, రూపాయి బలహీన పడటం, క్రూడాయిల్ ధర పెరగడం వంటివన్నీ మార్కెట్‌పై ప్రతికూల ప్రభావం చూపాయి. ట్రేడింగ్ ఉదయం స్వల్ప లాభాల్లో ప్రారంభమైంది. బీఎస్ఈ సెన్సెక్స్ 72,668.00 పాయింట్ల వద్ద స్వల్ప లాభంతో ప్రారంభమైంది. తర్వాత 71,327.75 పాయింట్ల కనిష్టాన్ని తాకింది. చివరకు 1,045.46 పాయింట్ల నష్టంతో 71,593.24 వద్ద ముగిసింది. 1.44 శాతం నష్టపోయింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా 371.25 పాయింట్ల (1.64 శాతం) నష్టంతో 22,231.80 వద్ద ముగిసింది. ఈ భారీ నష్టం కారణంగా బీఎస్ఈలో నమోదైన కంపెనీలు రూ.11.37 లక్షల కోట్లు కోల్పోయాయి. ఇంతకుముందు రోజు మొత్తం మార్కెట్ విలువ రూ.4,72,35,273.39 కోట్లుగా ఉండగా, ఈ రోజు అది రూ.4,60,97,838.63 కోట్లకు తగ్గింది. మరోవైపు అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధర పెరిగింది. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 4.25 శాతం పెరిగి, 104.46 డాలర్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్లో రూపాయి విలువ పడిపోయింది. డాలర్‌తో రూపాయి మారక విలువ 96.78కి చేరింది. గత మే నెలలో అత్యంత కనిష్ట స్థాయి 96.69. గురువారం



దీనికి దగ్గరగా రూపాయి విలువ పడిపోయింది. మరోవైపు యూపీఐ లావాదేవీలపై ఎండీఆర్ ఛార్జీల పెంపును కేంద్రం వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ఈ నెలలో అమలు కావాల్సిన ఛార్జీలు వచ్చే జనవరి వరకు వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

# స్పోర్ట్స్

# ఐపీఎల్‌తో మరోసారి పోటీపడనున్న పాకిస్తాన్ సూపర్ లీగ్

పాకిస్తాన్ సూపర్ లీగ్ మరోసారి ఇండియన్ ప్రీమియర్ లీగ్‌తో పోటీపడనుంది. ఐపీఎల్ జరిగే సమయంలోనే మరోసారి పీఎస్ఎల్‌ను ప్లాన్ చేశారు పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధికారులు. గతేడాది కూడా ఇలాంటి పరిస్థితే ఏర్పడింది. దీంతో కొంతమంది విదేశీ ఆటగాళ్లు పీఎస్ఎల్ ఒప్పందాల నుంచి తప్పుకుని ఐపీఎల్‌లో చేరారు. ఈ చేదు అనుభవం చవిచూశాక కూడా పీఎస్ఎల్ ఐపీఎల్‌తో ఢీకొట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేసింది. పీఎస్ఎల్ 2027 సీజన్‌కు సంబంధించిన తేదీలను లీగ్ నిర్వహకులు ఇవాళ ప్రకటించారు. ఈ టోర్నీలో వచ్చే ఏడాది మార్చి 18 నుంచి మే 2 వరకు జరుగనుంది. మరోవైపు ఐపీఎల్ 2027 సీజన్‌కు సంబంధించి తేదీలు ఖరారు కానప్పటికీ.. ఇంచుమించు పీఎస్ఎల్ జరిగే సమయంలోనే ఐపీఎల్ కూడా జరుగుతుంది. ప్రస్తుతమున్న సమాచారం? ప్రకారం ఐపీఎల్ 2027 మార్చి మధ్యలో మొదలవుతుంది. ఐపీఎల్, పీఎస్ఎల్ మరోసారి క్లాష్ కానున్న నేపథ్యంలో మరోసారి విదేశీ ఆటగాళ్ల కోసం రెండు లీగ్‌ల మధ్య పోటీ తప్పకపోవచ్చు. గత సీజన్‌లో క్వెట్టా గ్లాడియేటర్స్‌కు డైరెక్ట్ సైనింగ్‌గా ఎంపికైన స్పెన్సర్ జాన్సన్.. వ్యక్తిగత కారణాలు సాకుగా చూపి పీఎస్ఎల్ నుంచి వైదొలిగి చెన్నై సూపర్ కింగ్స్‌లో చేరాడు. శ్రీలంక ఆటగాడు దసున్ షనక లాహోర్ ఖలందర్స్ డీల్‌ను




కాదనుకొని రాజస్తాన్ రాయల్స్‌లో చేరాడు. బ్లెస్సింగ్ ముజారబాని ఇస్లామాబాద్ యునైటెడ్‌తో ఒప్పందం రద్దు చేసుకొని కోల్‌కతా నైట్ రైడర్స్‌లో చేరాడు. దీంతో ముజారబానిపై పీఎస్ఎల్ రెండేళ్ల నిషేధం విధించింది.

## విండీస్‌తో రెండో టీ20కి ముందు వైభవ్ విధ్వంసం

విండీస్‌తో రేపు జరుగబోయే రెండో టీ20కి ముందు టీమిండియా యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ జట్టు మేనేజ్‌మెంట్‌కు స్ట్రాంగ్ మెసేజ్ పంపాడు. నెట్స్‌లో అతడు భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. అలవోకగా బౌండరీలు, సిక్సర్లు బాదాడు. జట్టు సమీకరణల వల్ల వైభవ్‌కు అవకాశాలు రాని విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో వైభవ్ తనలోని విధ్వంసకర కోణాన్ని మేనేజ్‌మెంట్‌కు మరోసారి గుర్తు చేశాడు. నెట్స్‌లో పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్ కూడా చెలరేగిపోయాడు. వైభవ్‌తో పోటీపడి మరీ షాట్లు ఆడాడు. వీరిద్దరి బ్యాటింగ్ విన్యాసాలు చూసి పోలీసులు, ప్రేక్షకులు, మీడియా ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, రెండో టీ20 రాంచీ వేదికగా జరుగనుంది. ఇది ఇషాన్ కిషన్‌కు సొంత మైదానం. రేపటి మ్యాచ్‌లో ఇషాన్ ప్రదర్శన కోసం? స్థానికులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇదిలా ఉంటే, రేపటి మ్యాచ్‌లో భారత్ ఎలాంటి మార్పులు లేకుండా బరిలోకి దిగవచ్చు. ఇదే జరిగితే వైభవ్ సూర్యవంశీకి మరోసారి నిరాశ తప్పదు. మేనేజ్‌మెంట్ సంజూ శాంసన్‌పై విశ్వాసాన్ని కొనసాగించినంత కాలం వైభవ్‌ది ఇదే పరిస్థితి. ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో కొనసాగుతుంది.



లక్నో వేదికగా జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఘన విజయం సాధించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ కెరీర్‌లో తొలి టీ20 శతకంతో భారత్‌ను విజయతీరాలకు చేర్చాడు.

## నా ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం తీవ్రంగా బాధించింది

ఇంటర్నెట్ డెస్క్: తనను భారత క్రికెట్ జట్టుకు డైరక్టర్‌గా తప్పించడం సరిగా



అనిపించలేదని రవిశాస్త్రి తెలిపారు. 2016లో తనను కాదని అనిల్ కుంబ్లేను ప్రధాన కోచ్‌గా నియమించారని.. తన ఇంటర్వ్యూకు గంగూలీ హాజరు కాకపోవడం మరింత బాధించిందని గుర్తు చేసుకున్నారు. 2014లో టీమ్‌ఇండియాకు రవిశాస్త్రి డైరక్టర్ ఆఫ్ క్రికెట్ పదవిలో ఉన్నారు. రెండేళ్ల తర్వాత ఆ పదవిని బీసీసీఐ తీసేసింది. ప్రధాన కోచ్ పదవికి దరఖాస్తు చేయాలని రవిశాస్త్రకి సూచించింది. సౌరభ్ గంగూలీ, సచిన్ తెందుల్కర్, వీవీఎస్ లక్ష్మణ్‌తో కూడిన క్రికెట్ సలహా మండలి చివరి క్షణంలో రవిశాస్త్రిని కాదని కుంబ్లేను ఎంపిక చేసింది. "నేను డైరక్టర్‌గా ఉన్నా. రెండేళ్ల తర్వాత బోర్డు సభ్యులు వచ్చి ఆ పదవిని రద్దుచేస్తున్నాం.. హెడ్ కోచ్ పదవికి దరఖాస్తు చేయమని చెప్పింది. నన్ను బయటకు పంపించేందుకు మరో కారణం ఉందని అనిపించింది. ఆ నిర్ణయం నన్ను చాలా బాధించింది. జట్టు కోసం నా శాయశక్తులా కృషి చేశా. నన్ను ఇంటర్వ్యూ చేసేందుకూ గంగూలీ (ాశీబత్ఝుజ +ఘఅస్త్రబశ్రీఎ) గైర్హాజరు కావడం మరింత బాధపెట్టింది" అని రవిశాస్త్రి తెలిపారు.

**మళ్లీ వచ్చేశా..**

"నా వ్యాఖ్యాత పాత్రను పోషించేందుకు వెళ్లిపోయా. ఆటతోనే మమేకమై ఉన్నా. దాదాపు ఏడాదిన్నరపాటు మంచి అనుభవం సంపాదించా. ఎన్నో పాఠాలను నేర్చుకున్నా. ప్రధాన కోచ్‌గా భారత డ్రెస్సింగ్ రూమ్‌లోకి వచ్చా. ఆటగాళ్లు ఎలా ఆలోచిస్తున్నారనేది అర్థం చేసుకున్నా. జీవితంలో ఇలాంటి ఒడుదొడుకులు సహజమే. వాటన్నింటినీ ఎదుర్కొని ముందుకు సాగా. అవకాశం అందిపుచ్చుకున్నా" అని రవిశాస్త్రి తెలిపారు. కెప్టెన్ విరాట్ కోహ్లీ - రవిశాస్త్రి ద్వయం హయాంలో భారత్ (ఎఘుఎ ×అఇఖు) విదేశాల్లో అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే.



# స్పిరిట్‌లో ప్రభాస్ డబుల్ లుక్..

## సెకండాఫ్‌లో ఊహించని అవతారం?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయన నటిస్తున్న అత్యంత ఆసక్తికరమైన ప్రాజెక్టుల్లో 'స్పిరిట్' ఒకటి. 'అర్జున్ రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో తనదైన మేకింగ్ శైలిని చూపించిన దర్శకుడు సందీప్ రెడ్డి వంగా ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. ప్రభాస్, సందీప్ రెడ్డి వంగా తొలిసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే 'స్పిరిట్' గురించి వస్తున్న వార్తలు సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నాయి. తాజాగా ఈ చిత్రంలో ప్రభాస్ పాత్రకు సంబంధించి ఓ ఆసక్తికరమైన సమాచారం ప్రచారంలోకి వచ్చింది. ఈ సినిమాలో ప్రభాస్ గతంలో ఎన్నడూ కనిపించని విధంగా రెండు భిన్నమైన లుక్స్‌లో కనిపించనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ప్రచారంలో ఉన్న సమాచారం ప్రకారం.. 'స్పిరిట్'లో ప్రభాస్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. ఈ పాత్రకు తగ్గట్టుగా ఒక ప్రత్యేకమైన లుక్‌లో ఆయన కనిపిస్తారని తెలుస్తోంది. అయితే సినిమా ద్వితీయార్థంలో ప్రభాస్ మరో భిన్నమైన అవతారంలో కనిపిస్తారనే ప్రచారం ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ రెండు లుక్స్ మధ్య వ్యత్యాసం ఎలా ఉండబోతోంది? కథలో వచ్చే మలుపులకు ప్రభాస్ పాత్ర ఎలా అనుసంధానమై ఉంటుంది? అనే విషయాలపై అభిమానులు చర్చించుకుంటున్నారు. అయితే ఈ వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. 'స్పిరిట్'లో మాఫియా నేపథ్యానికి కూడా ప్రాధాన్యత ఉండనున్నట్లు కథనాలు వెలువడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభాస్ పాత్రలో వచ్చే మార్పులు కథను ఏ మలుపు తిప్పుతాయన్నది ఆసక్తికరంగా మారింది. పోలీస్ అధికారిగా ఆయన కనిపించే విధానం ఒకవైపు ఉంటే, ద్వితీయార్థంలో మరో కోణంలో కనిపించడం సినిమాకు కీలక ఆకర్షణగా నిలవవచ్చని అభిమానులు భావిస్తున్నారు. అయితే కథ, పాత్రల స్వరూపం, ప్రభాస్ లుక్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా అధికారికంగా వెల్లడికాలేదు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న సమాచారం నిజమైతే.. ప్రభాస్‌ను సరికొత్తగా చూపించేందుకు సందీప్ రెడ్డి వంగా ప్రత్యేకంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు భావించవచ్చు. ప్రభాస్‌కు ఉన్న పాన్ ఇండియా క్రేజ్, సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో కనిపించే తీవ్రత, విభిన్నమైన పాత్రల రూపకల్పన ఈ ప్రాజెక్టుపై అంచనాలను పెంచుతున్నాయి. దర్శకుడి గత చిత్రాలు ప్రేక్షకుల్లో సృష్టించిన ప్రభావం నేపథ్యంలో 'స్పిరిట్' ఎలా ఉండబోతోందనే ఆసక్తి నెలకొంది.




## దండోరా దర్శకుడితో నితిన్ 'అలియాస్ రుక్మిణి'.. విడుదల తేదీపై కీలక అప్‌డేట్!

టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని వరుస సినిమాలతో దూసుకుపోతున్నారు. ఒకవైపు హీరోగా 'ది ప్యారడైజ్' చిత్రంతో బ్లాక్ బస్టర్ అందుకొని మరోవైపు నిర్మాతగా వైవిధ్యమైన ప్రాజెక్ట్‌లను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. ఈ క్రమంలోనే యంగ్ హీరో నితిన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా రొమాంటిక్ డ్రామా 'అలియాస్ రుక్మిణి' చిత్రానికి ఆయన నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. 'దండోరా' చిత్రంతో దర్శకుడిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న మురళి కాంత్ దేవోత్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండటంతో, టాలీవుడ్ వర్గాల్లో ఈ ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇదిలా ఉంటే, ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించి చిత్ర యూనిట్ తాజాగా ఓ క్రేజీ అప్‌డేట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సినిమా విడుదలకు సంబంధించిన ముఖ్యమైన అప్‌డేట్‌ను రేపు ఉదయం సరిగ్గా 10:08 గంటలకు అధికారికంగా ప్రకటించనున్నట్లు మేకర్స్ సోషల్ మీడియా ద్వారా వెల్లడించారు. ఇప్పటికే విడుదలైన ఈ చిత్రపు గ్లింప్స్ సినిమాపై మంచి బజ్‌ను క్రియేట్ చేయగా, ఇప్పుడు రాబోయే రిలీజ్ డేట్ అనౌన్స్‌మెంట్ కోసం అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, ఈ చిత్రంలో నితిన్ సరసన నటిస్తున్న హీరోయిన్ ఎవరనే దానిపై ఇంకా స్పష్టత రాలేదు. త్వరలోనే దీనిపై కూడా చిత్ర బృందం నుంచి క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమాకు టాలెంటెడ్ మ్యూజిక్ డైరెక్టర్ విజయ్ బుల్గానిన్ సంగీతం అందిస్తున్నారు. 'యూనిసానిమస్ ప్రొడక్షన్స్' పతాకంపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మితమవుతున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.



## గ్లామర్‌కే పరిమితం కావాలనుకోవడం లేదు.. ఇకపై అలాంటి పాత్రలే చేస్తా

బాలీవుడ్‌లో తన గ్లామర్‌తో పాటు నటనతోనూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ దిశా పటాని ఇప్పుడు తన కెరీర్ విషయంలో కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటివరకు ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో కనిపించిన ఈ ముద్దుగుమ్మ.. ఇకపై వైవిధ్యమైన, బలమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించాలని కోరుకుంటోంది. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం, ఇప్పటివరకు నేర్చుకున్న విషయాలు, భవిష్యత్తులో ఎలాంటి పాత్రలు చేయాలనుకుంటోందనే అంశాలపై దిశా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. దిశా పటాని తొలిసారిగా 'ఎంఎస్ ధోనీ: ది అన్‌టోల్డ్ స్టోరీ' సినిమాతో ప్రేక్షకులకు పరిచయమైంది. భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ జీవిత కథ ఆధారంగా తెరకెక్కిన ఈ చిత్రంలో ఆమె నటనకు మంచి గుర్తింపు లభించింది. ఆ సినిమా విడుదలై పదేళ్లు పూర్తవుతున్న సందర్భంగా తన ప్రయాణాన్ని గుర్తు చేసుకుంది. ఈ పదేళ్లలో నటిగా ఎన్నో విషయాలు నేర్చుకున్నానని దిశా తెలిపింది. విభిన్నమైన అనుభవాలు తనను మరింత పరిణతి చెందిన నటిగా తీర్చిదిద్దాయని చెప్పింది. ఇప్పటివరకు తాను ఎక్కువగా గ్లామర్‌కు ప్రాధాన్యమున్న సినిమాల్లో నటించినప్పటికీ, ఇకపై తన కెరీర్‌లో కొత్త ప్రయోగాలు చేయాలనుకుంటున్నట్లు వెల్లడించింది. సినిమా పరిశ్రమలో గ్లామర్‌తో గుర్తింపు తెచ్చుకోవడం ఒక ఎత్తయితే, నటిగా విభిన్నమైన పాత్రలతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించడం మరో ఎత్తు. ఈ విషయాన్ని దిశా పటాని కూడా గుర్తించినట్లు ఆమె వ్యాఖ్యలను బట్టి అర్థమవుతోంది. ఇకపై ఒకే తరహా పాత్రలకు పరిమితం కాకుండా, తనలోని నటనా ప్రతిభను బయటపెట్టే అవకాశాల కోసం ఎదురుచూస్తున్నట్లు చెప్పింది. కేవలం తెరపై అందంగా కనిపించడమే కాకుండా, కథలో కీలక పాత్ర పోషించే క్యారెక్టర్లు చేయాలని ఉందని దిశా తెలిపింది. ప్రేక్షకులు తన పాత్రతో భావోద్వేగపరంగా అనుసంధానమయ్యేలా ఉండాలని, కథను ముందుకు తీసుకెళ్లడంలో ఆ పాత్రకు ప్రాధాన్యం ఉండాలని కోరుకుంటున్నట్లు వెల్లడించింది. ప్రస్తుతం దిశా పటాని 'హోలీగార్డ్స్ సాగా: ది పోర్టల్ ఆఫ్ ఫోర్స్' అనే హాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నట్లు సమాచారం. భారతీయ సినిమాలతో పాటు అంతర్జాతీయ ప్రాజెక్టుల్లోనూ అవకాశాలను అందిపుచ్చుకుంటున్న ఆమెకు ఈ చిత్రం కెరీర్‌లో మరో కీలక అడుగు కానుంది.



## 'పని కట్టుకుని మరి చేస్తున్నారు.. ఎందుకు ఇలాంటి పనులు'

టాలీవుడ్ హీరో విజయ్ దేవరకొండ సంచలన కామెంట్స్ చేశారు. సోషల్ మీడియాలో తనపై, భార్య రష్మికపై వస్తున్న ట్రోల్స్, నెగిటివిటీపై సీరియస్‌గా స్పందించారు. రణబాలి ట్రైలర్ ఈవెంట్‌కు హాజరైన విజయ్.. విమర్శలపై స్ట్రాంగ్ కౌంటరిచ్చారు. నా సెల్ఫ్ కాన్ఫిడెన్స్ వాళ్లకు బలుపులా అనిపిస్తే నేను తగ్గాలా? ఎవరికోసం నేను మారబోనంటూ వ్యాఖ్యానించారు. సోషల్ మీడియాలో వచ్చే ట్రోల్స్‌లో 90 శాతం కావాలని ఒక గ్రూప్ క్రియేట్ చేస్తున్నవేనని విజయ్ దేవరకొండ ఆరోపించారు. ఒక 50 మంది కూర్చుని ఒక్కొక్కరు 20 నుంచి 1000 అకౌంట్స్ క్రియేట్ చేసి కావాలని నెగిటివిటీని సృష్టిస్తున్నారని విజయ్ విమర్శించారు. రణబాలి సినిమా ట్రైలర్ రాకముందే ఇది బ్రిటీశ్ సినిమా అంటూ కొన్ని వర్గాలు కావాలని వ్యతిరేక ప్రచారం చేస్తున్నాయని మండిపడ్డారు. ఎవరినైనా కలవకుండానే, వ్యక్తిగతంగా తెలియకుండానే ఇలా బలమైన అభిప్రాయాలను క్రియేట్ చేయడం వెనుక ఒక పెద్ద మెషినరీ పనిచేస్తోందని సంచలన ఆరోపణలు చేశారు. తెలుగు సినిమా అయిన రణబాలి కాకుండా మనం జైలర్–2కు పోదాం అని సడెన్‌గా 50 అకౌంట్స్ నుంచి ఒకే రీల్ షేర్ అవుతుందన్నారు. అందరూ ఒకే అభిప్రాయాన్ని రీల్‌గా షేర్ చేస్తున్నారంటే ఎవరో కూర్చొని డబ్బులు పెట్టి మరీ చేయిస్తున్నారని అర్థం.. వ్యవస్థ అలా తయారైంది. దీన్ని మనం ఆపలేమన్నారు. విజయ్ దేవరకొండ మాట్లాడుతూ..' ఇప్పుడు డబ్బులు ఇచ్చి చేయిస్తున్న వాడు రేపు ఏఐతో కూడా అదే పని చేయిస్తారు. అప్పుడు ఈ పనిచేసే వాళ్లు ఏం చేస్తారు? సినిమాను ప్రచారం చేయడానికి నేను సపోర్ట్ చేస్తా. ఎవరో ఒకరు బాగుపడతారు. అదే టూల్‌ను ఒకరిని కిందకు లాగడానికి ఉపయోగిస్తే ఎందుకురా ఈ పనులు అనిపిస్తుంది. ఇలా ఇండస్ట్రీలో ఏం జరుగుతుందో తెలుసుకోవడానికి నాకు ఏడేళ్లు పట్టింది. నేను ఖాళీ చేతులతో వచ్చి, నాకు నచ్చిన సినిమాలు చేసుకుంటూ వచ్చా. ఏడేళ్ల నుంచి అర్థం కాలేదు. గత ఏడాది ఈ విషయంలో క్లారిటీ వచ్చింది. నాకు ఏం జరుగుతుందో అర్థమైంది' అనిఅన్నారు.

# “ఓట్ల దొంగతనం” జరుగుతోంది

దేశంలో “ఓట్ల దొంగతనం” జరుగుతోందంటూ తాము చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలు సమర్పించాలని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తమను కోరినట్లు లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ చుట్టూ అలుముకున్న వివాదంపై శుక్రవారం ఇండియా కూటమి నేతలు రాష్ట్రపతిని కలిసిన అనంతరం ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ సహా పలువురు విపక్ష నేతల ప్రతినిధి బృందం రాష్ట్రపతి భవన్‌లో ద్రౌపది ముర్ముతో సమావేశమైంది. ఎన్నికల ప్రక్రియలో అవకతవకలు జరుగుతున్నాయని, భారత ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ వారు రాష్ట్రపతికి ఒక వినతిపత్రం సమర్పించారు.



సమావేశం అనంతరం రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, సీఈసీ జ్ఞానేశ్ కుమార్ కలిసి భారత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్ర పన్నుతున్నారని రాష్ట్రపతికి తెలియజేశామని చెప్పారు. “మా ఆరోపణలను నిరూపించేందుకు ఆధారాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఆమెకు సమయం ఉన్నప్పుడు తప్పకుండా ఆధారాలను సమర్పిస్తాం” అని రాహుల్ తెలిపారు. రాష్ట్రపతి తమ వాదనలను తిరస్కరించలేదని, ప్రశ్నించలేదని, సమావేశం సంతృప్తికరంగా జరిగిందని ఆయన పేర్కొన్నారు.

ఈ అంశంపై సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించి, ప్రధాన న్యాయమూర్తికి కూడా ఒక వినతిపత్రం అందజేస్తామని రాహుల్ ప్రకటించారు.

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. రాష్ట్రపతి తమ వాదనలను ఓపికగా విన్నారని తెలిపారు. “ఓట్ల దొంగతనంపై మేం నాలుగు రోజులుగా చేస్తున్న ఆందోళనల గురించి రాష్ట్రపతికి వివరించాం. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన తీవ్రమైన తప్పిదాన్ని, ఎన్నికల కమిషన్ పనితీరుపై మా ఆందోళనలను తెలియజేశాం. ఈవీఎంలను పక్కనపెట్టి, బ్యాలెట్ పత్రాలతో ఎన్నికలు నిర్వహించాలని మేం డిమాండ్ చేశాం” అని ఖర్గే వివరించారు.

టీఎంసీ అధినేత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ.. “మేం వినతిపత్రం ఇచ్చాం. దీనిపై విచారణ జరుపుతానని, వివరాలు పరిశీలిస్తానని, ఆధారాలు కావాలని ఆమె చెప్పడాన్ని మేం సానుకూల దృక్పథంతో చూస్తున్నాం. దేశ ప్రజలు ఆందోళనగా ఉన్నారు, రాజ్యాంగ పరిరక్షకురాలిగా ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఆమెను కోరాం” అని అన్నారు.

ఈ ప్రతినిధి బృందంలో జమ్మూకశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా, ఎన్సీపీ-ఎస్పీ ఎంపీ సుప్రియా సూలే, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ. బేబీ, ఆర్జేడీ ఎంపీ మనోజ్ కుమార్ ఝా, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ రాజీవ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు. గత కొద్ది రోజులుగా ఎన్నికల కమిషన్, ఓటర్ల జాబితా సవరణ తీరుపై విపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

# ‘జెన్ జీకి భయపడుతున్న కేంద్రం

దిల్లీ జంతర్ మంతర్ వద్ద కాక్రోచ్ జనతా పార్టీ (జపీా) అక్టోబర్ 10న భారీ ఎత్తున నిరసన నిర్వహించనున్నట్లు పిలుపునివ్వగా దేశ రాజధానిలో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఇక్కడ మెట్రో స్టేషన్ల మూసివేత, రైళ్ల రద్దు, ప్రజా రవాణాపై ఆంక్షలు విధించిన నేపథ్యంలో సీజేపీ నేతలు కేంద్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ నిరసనను అడ్డుకోవడానికి కేంద్రం దిల్లీని సైనిక కోటలా మార్చిందని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో తీవ్ర అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న సీజేపీ దీనికి బాధ్యత వహిస్తూ ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తుంది. ఇందులో భాగంగానే దిల్లీ జంతర్ మంతర్ వద్ద శనివారం నిరసన కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపింది. ఈ క్రమంలోనే బెంగళూరు నుంచి తిరుగుపయనం అవుతూ ముంబై విమానాశ్రయంలో విలేకరులతో మాట్లాడారు సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే. తమ నిరసనను అడ్డుకోవడానికి ప్రజల రాకపోకలపై ఆంక్షలు విధించడం సరికాదని, వారిని ఎందుకు ఇబ్బంది పెడుతున్నారని ప్రశ్నించారు. శనివారం జంతర్ మంతర్ వద్ద నిర్వహించ తలపెట్టిన నిరసనను విరమించుకోబోమని స్పష్టం చేశారు. జెన్ జీని చూసి కేంద్రం భయపడుతోందని వ్యాఖ్యలు చేసిన దీప్కే- యువతను చూసి అంతగా భయపడుతుంటే దేశం మొత్తాన్ని మూసేయండని ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్లీ ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాల ప్రైవేట్ ప్రాపర్టీ ఏం కాదని వ్యంగ్యాస్త్రాలు సంధించారు.




నిరసనల వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఒకవైపు చెబుతూనే, మరోవైపు మెట్రో స్టేషన్లు, రైళ్ల రాకపోకలపై ఆంక్షలు విధించడం వల్ల ప్రజలకు మరింత ఇబ్బంది కలగదా? అని ప్రశ్నించారు. కేంద్రం చర్యలు హాస్యాస్పదంగా ఉన్నాయని అభిజీత్ తెలిపారు. కశ్మీర్, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల నుంచి భద్రతా బలగాలను దిల్లీకి ఎందుకు తరలిస్తున్నారని, యువతను పాకిస్థానీలను చూసినట్లు చూస్తుందని దీప్కే మండిపడ్డారు. తనను అరెస్ట్ చేయడం వల్ల సమస్యలు పరిష్కారమవుతాయని ప్రభుత్వం భావిస్తే, ధైర్యముంటే తనను అరెస్ట్ చేయాలని సవాల్ విసిరారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ చేసిన దానికి ఆయన శిక్ష అనుభవించాలని, సర్ ప్రక్రియను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇక దిల్లీలో ప్రస్తుత పరిస్థితులను ఎమర్జెన్సీతో పోల్చారు మరో సీజేపీ నేత సౌరవ్ దాస్. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పార్టీ కార్యకర్తలను నిర్బంధిస్తున్నారని, కొందరిని గృహ నిర్బంధం చేశారని ఆరోపించారు. ఆంక్షలు, పరిమితులతో దిల్లీని కోటలా మార్చారని విమర్శించారు.

**మెట్రో, రైళ్లపై ఆంక్షలు- సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు**

సీజేపీ నిరసనల నేపథ్యంలో రవాణా మార్గాలపై ప్రభుత్వం విధించిన ఆంక్షలపై దాఖలైన విజ్ఞప్తులను పరిశీలించిన సుప్రీం కోర్టు గురువారం కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రధాన న్యాయమూర్తి సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ బాగ్చీ, జస్టిస్ వి. మోహనలతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ- నిరసనల కారణంతో మెట్రో రైళ్లు, ప్రజా రవాణాను పూర్తిగా నిలిపివేయకూడదని స్పష్టం చేసింది. గురుగ్రామ్, గ్రేటర్ నోయిడా నుంచి దిల్లీకి వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, వృద్ధులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని వ్యాఖ్యానించింది. రవాణా సేవలపై తీసుకునే నిర్ణయాలను ప్రజలకు తప్పనిసరిగా ముందుగానే తెలియజేయాలని సూచించింది. నిరసనలకు జంతర్ మంతర్‌నే కొనసాగించాలా? ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని చూడాలా? అనే అంశాన్ని కూడా కేంద్రం పరిశీలించాలని పేర్కొంది.

**దిల్లీ పోలీసుల ఉన్నత స్థాయి సమీక్ష- ఇంటర్నెట్ బంద్**

సీజేపీ నిరసనల నేపథ్యంలో దిల్లీ పోలీస్ కమిషనర్ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్నతాధికారులు అత్యవసర సమావేశం నిర్వహించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. కేంద్ర హోం శాఖ ఆమోదంతో జంతర్ మంతర్ పరిసరాల్లో 4 కిలోమీటర్ల పరిధిలో అక్టోబర్ 9 రాత్రి 10 గంటల నుంచి అక్టోబర్ 10 రాత్రి 10 గంటల వరకు మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. న్యూదిల్లీ జిల్లా పరిధిలో దీచీూా సెక్షన్ 163 అమల్లో ఉంటుందని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. ఇంకా ‘యాన్ ఓపెన్ లెటర్ టు ఎవ్రీ సిటిజెన్’ పేరుతో ప్రతి ఒక్కరూ శాంతి భద్రతలకు సహకరించాలని పోలీసులు ఎక్స్ వేదికగా బహిరంగ లేఖను కూడా విడుదల చేశారు.

# నీట్ విధానంలో మరిన్ని సంస్కరణలు

ఈ ఏడాది నీట్ యూజీ 2026 ప్రశ్నాపత్రం లీక్ ఆరోపణలు, పరీక్ష రద్దు నేపథ్యంలో ఈ వ్యవహారంపై పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన రిపోర్టును విడుదల చేసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే జాతీయ స్థాయి పోటీ పరీక్షల్లో పారదర్శకతను పెంచడానికి, అక్రమాలను అరికట్టేందుకు కీలక సంస్కరణలను ప్రతిపాదించింది. ఇక్కడ ఎన్టీఏ పార్లమెంటుకు (లోక్‌సభ, రాజ్యసభ) జవాబుదారీగా ఉండేలా చట్టపరమైన వ్యవస్థను ఏర్పాటు చేయాలని విద్యా వ్యవహారాలపై ఏర్పాటైన పార్లమెంటరీ స్థాయీ సంఘం సూచించింది. పరీక్షల నిర్వహణపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు సహా ప్రజల్లో నమ్మకాన్ని నిలబెట్టడం చాలా ముఖ్యమని స్పష్టం చేసింది. పరీక్షలపై విశ్వాసం దెబ్బతినకుండా చూసేందుకు తగిన పార్లమెంటరీ వ్యవస్థను విద్యాశాఖ ప్రవేశపెట్టాలని కమిటీ తెలిపింది. పరీక్షల్లో అక్రమాలకు పాల్పడాలనుకునే వ్యవస్థీకృత నెట్‌వర్క్‌లు నిరంతరం కొత్త మార్గాలను అన్వేషిస్తుంటాయని, పరీక్ష నిర్వహణలోని బలహీనతలను ఉపయోగించుకునేందుకు చూస్తాయని పేర్కొంది.

ఈ నేపథ్యంలో అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ నీట్ యూజి 2026 పరీక్షను రద్దు చేయాల్సి రావడం మాత్రం సంస్థాగత, విధానపరమైన లోపాలను సృష్టిస్తోందని కాంగ్రెస్ ఎంపీ దిగ్విజయ సింగ్ నేతృత్వంలోని ఈ కమిటీ అభిప్రాయపడింది. అందుకే ఎన్టీఏలో తగినంత సిబ్బంది, పటిష్టమైన భద్రతా విధానాలు, స్పష్టమైన జవాబుదారీ వ్యవస్థలు ఉండాలని సూచించింది. ముఖ్యంగా చీూా ప్రశ్నాపత్రాలను తయారు చేసే అధ్యాపకులు, నిపుణుల గత చరిత్ర ముఖ్యంగా నైతికతను పరిశీలించడానికి ఒక ప్రత్యేక ట్రాకింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సిఫార్సు చేసింది.



క్వశ్చన్ పేపర్లు తయారు చేసే వారికి కూడా ఏ ప్రశ్నలు పరీక్షలు వస్తున్నాయో ముందుగా తెలియకుండా ఉండేలా ఎన్టీఏ పెద్ద క్వశ్చన్ బ్యాంకులను రూపొందించాలని స్పష్టం చేసింది.

**ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా ప్రశ్నలు!**

ఇదే సమయంలో కంప్యూటర్ బేస్డ్ ఆటోమేటెడ్ సిస్టమ్ ద్వారా చివరి క్షణంలో ప్రశ్నలను ఎంపిక చేసే విధానం రావాలని కమిటీ పేర్కొంది. పెన్ అండ్ పేపర్ పద్ధతిలో నిర్వహించే నీట్‌లో ప్రశ్నా పత్రాల లీకేజీ ప్రమాదం ఎక్కువగా ఉందన్న కమిటీ, దీనిని అధిగమించడానికి నీట్ యూజీని పూర్తి స్థాయిలో కంప్యూటర్ బేస్డ్ టెస్టుగా నిర్వహించాలని రికమెండ్ చేసింది. ఇదే సమయంలో ప్రైవేట్ పరీక్షా కేంద్రాలపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రభుత్వ యాజమాన్యంలోని సంస్థలు, డిజిటల్ కేంద్రాల ద్వారానే ప్రవేశ పరీక్షలు నిర్వహించాలని సూచించింది. కొన్ని కారణాల వల్ల పరీక్ష కేంద్రాలకు కొద్దిగా ఆలస్యంగా వచ్చే విద్యార్థులను అండర్‌టేకింగ్ తీసుకొని పరీక్ష రాయడానికి అనుమతించాలని పార్లమెంటరీ ప్యానెల్ పేర్కొంది.

**మే 3న పరీక్ష- తర్వాత రద్దు- రీ ఎగ్జామ్!**

ఈ ఏడాది మే 3న దేశవ్యాప్తంగా 551 నగరాలు, విదేశాల్లోని 14 కేంద్రాల్లో నీట్ యూజీ పరీక్ష నిర్వహించగా, సుమారు 22 లక్షల మందికిపైగా విద్యార్థులు హాజరయ్యారు. అయితే వ్యవస్థీకృత ముఠాలు ప్రశ్నాపత్రాన్ని లీక్ చేశారన్న ఆరోపణలతో మే 12న ఎన్టీఏ ఈ పరీక్షను రద్దు చేసింది. తర్వాత కేంద్ర ప్రభుత్వం ఆమోదంతో జూన్ 21న నీట్ యూజీ 2026 రీ ఎగ్జామ్ నిర్వహించారు. ఇక ఈ కేసును విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ - ఒక కెమిస్ట్రీ లెక్చరర్‌ను అరెస్ట్ చేసింది. పరీక్షకు ముందే పుణెలోని ఒక స్పెషల్ కోచింగ్ క్లాస్‌లోని విద్యార్థులకు ఆయన ప్రశ్నలు, ఆప్షన్లు, సరైన సమాధానాల్ని చెప్పారని, అవి అసలు ప్రశ్నా పత్రంతో సరిపోలాయని సీబీఐ కూడా నిర్ధరించింది. ఈ నేపథ్యంలో విద్యార్థులు, ఇతర పౌర సమాజ సంస్థలు, ప్రతిపక్షాలు దీనిపై పెద్ద ఆందోళన నిర్వహించాయి. దిల్లీ జంతర్ మంతర్ కేంద్రంగా అభిజీత్ దీప్కే నేతృత్వంలో కాక్రోచ్ జనతా పార్టీ చేసిన నిరసనలు చాలా రోజులు కొనసాగాయి. ఈ క్రమంలోనే అప్పటి విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామాకు డిమాండ్ చేయగా, కొన్ని రోజులకు ఆయన తప్పుకున్నారు. ఆయన స్థానంలో ప్రహ్లాద్ జోషిని కేంద్రం విద్యాశాఖ మంత్రిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అయినా అప్పటి నుంచి కాంగ్రెస్ సహా ఇతర విపక్ష పార్టీలు దేశంలో పరీక్షల నిర్వహణపై, విద్యా వ్యవస్థపై ప్రశ్నిస్తూనే ఉన్నాయి.

## ‘ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని భారత్ అనుమతించదు’

భారత్‌లో ఏ రంగంలోనూ గుత్తాధిపత్యాన్ని అనుమతించదని కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అన్నారు. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలను అందించేందుకు భారత్‌లో తమ సంస్థను అనుమతించడం లేదని స్టార్‌లింక్ అధిపతి ఎలాన్ మస్క్ ఆరోపణలు చేసిన నేపథ్యంలో శుక్రవారం ఆయన ఈ మేరకు స్పందించారు. ప్రస్తుతం ఒక కంపెనీ గురించి అందరూ ఎక్కువగా చర్చిస్తున్నారని సింధియా తెలిపారు. వాస్తవానికి ఇప్పటికే మూడు కంపెనీలకు శాట్‌కామ్ లైసెన్సులు మంజూరు చేసినట్లు సింధియా వెల్లడించారు. అయితే, భద్రతా ప్రమాణాలు, నిర్దేశిత మార్గదర్శకాలను నెరవేర్చిన తర్వాతే ఆయా సంస్థలు తమ కార్యకలాపాలను ప్రారంభించగలవని సింధియా స్పష్టంచేశారు. ఫ్రీ మార్కెట్‌లో వినియోగదారులు తమకు నచ్చిన సేవలను ఎంచుకుంటారని, వారికి పలు ఆప్షన్లను అందుబాటులోకి తీసుకురావడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. మస్క్‌కు మద్దతు తెలుపుతూ రాహుల్ చేసిన పోస్టుపైనా ఆయన మండిపడ్డారు. గతంలో ఒక నిర్దిష్ట వ్యక్తికి లైసెన్స్ ఇవ్వడంపై కాంగ్రెస్ తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిందని అన్నారు. ఇప్పుడు అదే వ్యక్తితో చేతులు కలిపి ఆయనకు లైసెన్స్ ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించడం ఆ పార్టీ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని సింధియా విమర్శించారు.

**తీవ్ర దుమారం రేపుతున్న మస్క్ వ్యాఖ్యలు**

స్టార్‌లింక్‌ను భారత్‌లోకి రాకుండా కొందరు శక్తిమంతులు అడ్డుకుంటున్నారని ఎలాన్ మస్క్ ఇటీవల ఆరోపించారు. వారు టెలికాం రంగంలో గుత్తాధిపత్యం చెలాయిస్తున్నారన్న మస్క్, ఇండియాకు అంబానీయే బాసా? అని అన్నారు. మస్క్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం దుమారం రేపుతున్నాయి. అయితే, మస్క్? వ్యాఖ్యలను భారత్ ఖండించింది. శాటిలైట్ ఇంటర్నెట్ సేవలపై స్టార్‌లింక్ సహా జియో, ఎయిర్‌టెల్ వంటి భారత సంస్థలు దరఖాస్తు చేసుకున్నాయని, ఇప్పటివరకు దేనికీ పూర్తిస్థాయి అనుమతులు ఇవ్వలేదని తెలిపింది. ఆ మూడు సంస్థలూ ఒకే దశలో ఉన్నాయని తెలిపిన ప్రభుత్వం భద్రతా ప్రమాణాల తనిఖీల తర్వాత మాత్రమే స్పెక్ట్రమ్ కేటాయింపులు ఉంటాయని వివరించింది. మరోవైపు, మస్క్ ఆరోపణల వెనుక భారతీయుల మీద ప్రేమ కంటే, తన వ్యాపార, అమెరికా వ్యూహాత్మక ప్రయోజనాలే దాగి ఉన్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దేశ భద్రతను పణంగా పెట్టి, భారత సంపదను కొల్లగొట్టే మస్క్ స్టార్‌లింక్ మనకు నిజంగా అవసరమా అని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ప్రపంచంలో చౌకగా డేటా దొరికే భారత్‌లో ఈ వ్యవహారంపై నిపుణులు, నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. అయితే, ఉక్రెయిన్, ఇరాన్, ఇజ్రాయెల్ వంటి దేశాల్లో స్టార్‌లింక్ సేవలను అమెరికా తన భౌగోళిక రాజకీయ ప్రయోజనాల కోసం ఒక ఆయుధంగా వాడుకుంటోందని అలాంటి సాంకేతికత విషయంలో భారత ప్రభుత్వం అప్రమత్తంగా వ్యవహరించడం సమంజసమేనని విశ్లేషకులు చెబుతున్నారు. మస్క్ చెబుతున్న ‘చౌక’ ఇంటర్నెట్ వాదనను నెటిజన్లు, నిపుణులు డేటాతో సహా తీవ్రంగా ఎండగడుతున్నారు. ప్రస్తుతం భారత్‌లో 100 వీఎజూం వేగమున్న ఇంటర్నెట్ కోసం నెలకు సగటున రూ.700 నుంచి రూ.900 రూపాయలు మాత్రమే ఖర్చవుతోంది. అదే చైనాలో రూ.2,000 నుంచి రూ.3,000 వరకు ఉంది. కానీ, మస్క్ స్టార్‌లింక్ ఇంటర్నెట్ వాడాలంటే నెలకు రూ. 8,000 చెల్లించాలి. దానికి తోడు పరికరాల ఇన్‌స్టాలేషన్ కోసం అదనంగా వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి ఉంటుందని నెటిజెన్లు పోస్టులు పెడుతున్నారు. నెలకు ఏడు వందలు కట్టే భారతీయులకు, రూ. 8,000కు పైగా వసూలు చేసే స్టార్‌లింక్ ఏ రకంగా చౌక అవుతుందని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఇది కచ్చితంగా దేశ సంపదను భారీగా కొల్లగొట్టి బయటకు తరలించడమేనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు భారత టెలికాం రంగంలో పోటీ కొరవడి కేవలం కొన్ని సంస్థల ఆధిపత్యమే కొనసాగుతోందన్న మస్క్ వాదనలో నిజం లేకపోలేదన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. డేటా ధరలు తక్కువగా ఉన్నప్పటికీ, నెట్‌వర్క్ నాణ్యత మాత్రం నాసిరకంగా ఉంటోందని టెలికాం రంగంలో పోటీ పెంచాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే అని మరికొందరు నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

## వ్యాపారానికి కాదు, గుత్తాధిపత్యానికే మేము వ్యతిరేకం

దేశంలో ప్రతి వ్యాపార సంస్థకు కూడా సమానంగా అవకాశాలు ఉండాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. కేవలం రాజకీయ అండతోనే కొన్ని సంస్థలకు ప్రత్యేకంగా ప్రయోజనం కల్పించే విధానాన్ని అంతం చేసి, పోటీ వాతావరణాన్ని కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఆవిష్కరణలు, కష్టపడి పనిచేసే తత్వంపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థను నిర్మించడానికి కాంగ్రెస్ కట్టుబడి ఉందని పేర్కొన్నారు. భారత్‌లో స్టార్‌లింక్ శాటిలైట్ ఇంటర్నెట్ సేవలకు వాణిజ్యపర అనుమతులు ఇంకా లభించలేదని స్పేస్‌ఎక్స్ అధినేత ఎలాన్ మస్క్ వ్యాఖ్యానించిన నేపథ్యంలో ఈ చర్చ మొదలైంది. గురువారం రోజు మస్క్ చేసిన ఎక్స్ పోస్టుకు రాహుల్ బదులివ్వడం, మళ్లీ మస్క్ థ్యాంక్యూ చెప్పారు. తాను వ్యాపారాలకు వ్యతిరేకం కాదని, కేవలం గుత్తాధిపత్యానికే వ్యతిరేకమని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ మేరకు రాహుల్ తన వాట్సాప్ ఛానల్ ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధించాలంటే ప్రతీ చిన్నా, పెద్ద వ్యాపార సంస్థకు సమాన అవకాశాలు కల్పించాలని, ఇందుకోసం లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ ఉండాలని డిమాండ్ చేశారు. మరోవైపు వివిధ రంగాల్లో పోటీని తగ్గించి గుత్తాధిపత్యాన్ని ప్రోత్సహిస్తోందని కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కూడా విమర్శలు చేశారు. మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక విధానాలపై ఖర్గే, రాహుల్ గాంధీ శుక్రవారం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

**ఇండియాకు అసలు బాస్ అంబానీనా?**

అంతకుముందు భారత చట్టాలు, నిబంధనలు అన్నీ పాటిస్తూ ఐదేళ్లుగా చూస్తున్నా స్టార్‌లింక్‌కు ఇండియాలో లైసెన్స్ రాలేదని, గుత్తాధిపత్యం చెలాయిస్తున్న కొందరు బడా వ్యాపారులు తమకు లైసెన్స్ రాకుండా అడ్డుకుంటున్నారని మస్క్ తెలిపారు. ఇంకా ఇండియాకు అసలు బాస్ అంబానీనా? అని మస్క్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. దీనికి స్పందించిన రాహుల్ ‘వెల్‌కమ్ టు ఇండియా ఎలాన్. మరో వ్యక్తి గురించి కూడా తెలుసుకునే వరకు వెయిట్ చెయ్’ అని రిప్లై ఇచ్చారు. దీనికి మస్క్ మళ్లీ థ్యాంక్యూ చెప్పి, ఇది చాలా ఆందోళనకర విషయం అన్నారు. ఈ క్రమంలోనే ప్రతి వ్యాపార సంస్థకు ఇండియాలో సమాన అవకాశాలు ఉండాలని రాహుల్ ఓ వీడియోలో తెలిపారు. ఇదే సమయంలో కాంగ్రెస్ ప్రెసిడెంట్ మల్లికార్జున ఖర్గే కూడా ఎక్స్ వేదికగా కేంద్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. మోదీ ప్రభుత్వ విధానాలు తమకు అనుకూలమైన పెట్టుబడిదారులకే అవకాశం ఇచ్చి ఆర్థిక వ్యవస్థపై నియంత్రణ కలిగి ఉండేలా ఉన్నాయని, దీని ద్వారా బీజేపీ ప్రయోజనాలు పొందుతోందని విమర్శలు గుప్పించారు. మొత్తానికే పోటీని అంతం చేసి గుత్తాధిపత్యం చెలాయిస్తున్న లేదా రెండు ప్రధాన సంస్థల ఆధిపత్యాన్నే ప్రోత్సహించడం ద్వారా ఆర్థిక వ్యవస్థ పునాదులు దెబ్బతింటున్నాయని ఖర్గే పేర్కొన్నారు. ఈ విధానాన్ని ఆర్థిక ఉగ్రవాదం (ఎకనామిక్ టెర్రరిజం) అని ఆయన అభివర్ణించారు.

**టెలికాం, విమానయాన రంగంలో పోటీనే లేదు: ఖర్గే**

తన వాదనకు బలం చేకూర్చేలా ఖర్గే ఉదాహరణలతో వివరించారు. ఇక్కడ టెలికాం, విమానయాన రంగాలను ఆయన ప్రస్తావించారు. 2014కు ముందు టెలికాం రంగంలో ఇండియాలో 13 సంస్థలు ఉండగా, ప్రస్తుతం 3 ప్రైవేట్ సంస్థలే మిగిలాయని ఖర్గే గుర్తు చేశారు. ఇంకా దేశీయ విమానయాన రంగంలో కూడా 2014కు ముందు వరకు 7 ప్రధాన సంస్థలు ఉండేవని, ప్రస్తుతం అక్కడా రెండు ప్రధాన సంస్థలే మిగిలాయని ఆరోపించారు. ఇంకా వీటికి తోడు డిజిటల్ పేమెంట్స్, ఫుడ్ డెలివరీ యాప్స్, సిమెంట్ వంటి రంగాల్లోనూ క్రమంగా పోటీ లేకుండా చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యంగా మారిందని ఖర్గే విరుచుకుపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు పెద్ద సంఖ్యలో మూతపడుతున్నాయని, యువత నిరుద్యోగ సమస్యను ఎదుర్కొంటోందని అన్నారు. ఇదిలా ఉండగా స్టార్‌లింక్ కమర్షియల్ లైసెన్స్ గురించి మస్క్ చేసిన ఆరోపణలను కేంద్రం తోసిపుచ్చింది. శాటిలైట్ కమ్యూనికేషన్ సేవలు అందించడానికి దరఖాస్తు చేసుకున్న అన్ని సంస్థలకు తాము సమాన అవకాశాలు కల్పిస్తున్నామని, వివక్ష లేని న్యాయమైన విధానం అమల్లో ఉందన్నారు. ఇక్కడ అవసరమైన భద్రతా పరిశీలనలు, స్పెక్ట్రమ్‌కు సంబంధించిన అనుమతులు పూర్తయ్యే వరకు ఏ సంస్థ కూడా వాణిజ్య కార్యకలాపాలను ప్రారంభించలేదని తెలిపింది.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137